ప్రజాశక్తి
సోమవారం 1 మే 2023 12+16 పేజీలు



ప్రకాశం



బాపట్ల


రాష్ట్రానికి అన్యాయం చేసిన

మోడీకి మూడు పార్టీల భజన

- బిజెపికి వ్యతిరేకంగా పోరాడితేనే ప్రజలకు మేలు చేసినట్లవుతుంది..
- ప్రచార భేరి బహిరంగ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో, సంతనూతలపాడు రూరల్

రానున్న ఎన్నికల్లో గెలిచి.. అధికారం చేపట్టేందుకు రాష్ట్రం లోని మూడు పార్టీలు రాష్ట్రానికి అన్యాయం చేసిన మోడీకి భజన చేస్తున్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. 'ప్రజావ్యతిరేక నిరంకుశ మతోన్మాద బిజెపిని సాగనంపుదాం-దేశాన్ని కాపాడుకుందాం' అనే నినాదంతో ఆదివారం సాయంత్రం సంతనూతలపాడు బస్టాండ్ సెంటర్‌లో జరిగిన ప్రచారభేరి బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రానికి అన్ని రకాలుగా అన్యాయం చేసిన కేంద్రం పైనా, బిజెపిపైనా పోరాడాల్సిన ఈ మూడు పార్టీలు ఇపుడు అన్ని రకాలుగా మోడీకి కాళ్ల మొక్కే పరిస్థితికి దిగజారాయన్నారు. బిజెపిని ప్రసన్నం చేసుకుంటూ రాష్ట్రంలో సిఎం జగన్ పాలన సాగిస్తున్నారని ధ్వజమెత్తారు. పార్లమెంటులో ఏ బిల్లు పెట్టినా వైసిపి, తెలుగుదేశం చేతులెత్తుతున్నాయన్నారు. ఎన్నికలకు ముందు ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పిన మోడీని ఏనాడైనా దానిపై సిఎం జగన్ అడిగారా? అని ప్రశ్నించారు. కనీసం లేఖ కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉన్నాడన్నారు. ఇంత కన్నా సిగ్గుచేటు మరొకటుందా? అని ప్రశ్నించారు. ఢిల్లీ వెళ్లి ప్రధానిని కలిసి కేసులు విషయం మాట్లాడుకోవడం తప్ప జనం కోసం ఏమీ చేయలేదన్నారు. అవినాష్ ▶ 2లో



మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

వైసిపిలో సంక్షోభం

- బాలినేని రాజీనామా విషయంలో అధినేత నిర్ణయంపైనే దృష్టి

11లో ▲



హనుమంతునిపాడులో రేకులు ఎగిరిపోయిన ఇల్లు

గాలివాన బీభత్సం

- ఉరుములు, మెరుపులతో భారీ వర్షం

2లో ▲



శ్రీను మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నారపశెట్టి పాపారావు

ఆర్మీ జవాన్‌కు నివాళి

ప్రజాశక్తి-దరిశి

దరిశి నగర పంచాయతీలోని శివరాజ్‌నగర్‌కు చెందిన ఆర్మీ జవాన్ బత్తుల శ్రీను(32) గుండెపోటుతో మృతిచెందగా ఆయన మృతదేహానికి ఆదివారం దరిశి మాజీ ఎమ్మెల్యే నారపశెట్టి పాపారావు పూలమాలలు వేసి.. నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం పనిచేస్తూ.. ప్రాణాలు అర్పించిన బత్తుల శ్రీను త్యాగం మరువలేనిదన్నారు. ఢిల్లీలో శుక్రవారం మృతిచెందగా శ్రీను మృతదేహాన్ని విమానంలో హైదరాబాదుకు తీసుకొని వచ్చి అక్కడ నుండి వాహనంలో దరిశికి తీసుకొని వచ్చారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నివాళులర్పించిన వారిలో కౌన్సిలరు రామగిరి, నాయకులు రామయ్య, శ్రీనాధ్, సురేష్, కొండలు ఉన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి-దరిశి

దరిశికి చెందిన గోగు నారాయణ ఈ నెల 19న మృతిచెందిన నేపథ్యంలో ఆయన జ్ఞాపకార్థం స్నేహితులు కురిచేడ్‌రోడ్‌లోని షిర్డిసాయిబాబా వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఆదివారం అన్నదానం చేశారు. పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్నేహితులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు

ఇష్టపడి చదవండి: ఎస్ఐ

ప్రజాశక్తి-చీమకుర్తి

విద్యార్థులు ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు అందుకోవచ్చని స్థానిక ఎస్ఐ జి రామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక నారాయణ టెక్నో పాఠశాల వార్షికోత్సవాలలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల జిల్లా ఏజిఎం పెద్దిరెడ్డి, ఎంఈఓ టి.రవి, పాఠశాల ఆర్ఐ శ్రీనివాసరావు, శివం ఫౌండేషన్ అధ్యక్షులు గొల్లపూడి హరి, ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

రామతీర్థంలో ఘనంగా పొంగళ్లు

ప్రజాశక్తి-చీమకుర్తి

రామతీర్థంలోని గంగమ్మ ఆలయంలో మద్దిపాడు ఏఎంసి మాజీ ఛైర్మన్ మారం వెంకారెడ్డి ఆధ్వర్యంలో పొంగళ్లు ఘనంగా జరిగాయి. ఇటీవల జరిగిన రామతీర్థం తిరునాళ్ల సంధర్భంగా మారంవెంకారెడ్డి యూత్ విద్యుత్ ప్రభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆదివారం గంగమ్మ పొంగళ్ళు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భారీస్థాయిలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు మారం వెంకటేశ్వరరెడ్డి, సిహెచ్.అశోక్, కోటరాములు, దశరథ రామిరెడ్డి, అంబటి గోపిచంద్, బ్రహ్మారెడ్డి, నాగేశ్వరరెడ్డి, సురేష్‌రెడ్డి, వెంగన్న, శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన

మండలంలోని పల్లామల్లిలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు ఘనంగా జరిగాయి. ఆదివారం జరిగిన కార్యక్రమంలో భారీ స్థాయిలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఏఎంసి మాజీ ఛైర్మన్ మారం వెంకారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు ఎన్.వెంకటేశ్వర్లు, బ్రహ్మయ్య, కృష్ణయ్య, వీరబ్రహ్మం, కోటా రాములు, మారంవెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం

ప్రకాశం, బాపట్ల జిల్లాలోని పలు చోట్ల ఆదివారం సాయంత్రం నుంచి గాలివాన బీభత్సం సృష్టించింది. నిజాంపట్నంలో అకాల వర్షంతో రైతన్నలు వేరుశనగ, మొక్కజొన్న పంటలను కాపాడుకొనేందుకు పరుగులు పెట్టారు. పంటలపై పరదాలు కప్పారు. హనుమంతునిపాడులో పలు చోట్ల ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపోయి.. చెల్లాచెదురుగా పడ్డాయి. కొనకనమిట్లలో పిడుగు పడి పది జీవాలు మృతిచెందాయి.

- ఉరుములు, మెరుపులతో భారీవర్షం
- పంటలను కాపాడుకొనేందుకు పరుగులు పెట్టిన రైతన్నలు
- కొనకనమిట్లలో పిడుగు పడి పది జీవాలు మృతి

ప్రజాశక్తి-నిజాంపట్నం

మండలంలోని ఆదివారం సాయంత్రం అకాల వర్షం కురిసింది. వేరుశనగ, మొక్కజొన్న పంటలను కాపాడుకొనేందుకు రైతులు పంటపై పట్టలు కప్పుతున్నారు. ఎకరాకు సుమారు రూ.80 వేలు ఖర్చు చేశామని, పంట చేతికి వస్తున్న సమయంలో ఈ అకాల వర్షం వల్ల తీరని నష్టం వాటిల్లుతుందని రైతులు బోరున విలపిస్తున్నారు. నెల క్రితం కురిసిన వర్షాల వల్ల ఎకరానికి 60 నుంచి 70 బస్తాలు పండే పంట 30 నుంచి 40 బస్తాలకు పడిపోగా, ఖర్చులు కూడా వస్తాయో, రావో అనుకునే సమయంలో ఈ అకాల వర్షం వల్ల పంట మొత్తం నీటి పాలవుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.



నిజాపట్నంలో వేరుశనగకు పట్టలు కప్పుతున్న రైతులు

హనుమంతునిపాడు: మండలంలో ఉమ్మనపల్లి, నందనవనం, వేములపాడు, హనుమంతునిపాడు మండల కేంద్రంలో ఆదివారం గాలివాన బీభత్సం సష్టించింది. ఈదురుగాలుల కారణంగా పలు గ్రామాలలోని ఇంటిపై కప్పు రేకులు ఎగిరిపోయాయి. భారీవృక్షాలు కూడా నేలకొరిగాయి.

కొనకనమిట్ల: మండలంలోని ఇరసలగొండంలో పిడుగు పడి పది గొర్రెలు మృతిచెందాయి. మొత్తం రూ.1.8 లక్షల నష్టం వాటిల్లినట్లు పశుపోషకులు తెలిపారు.

వర్షంతో తిరునాళ్లకు ఆటంకం

దరిశి: మండలంలోని బొట్లపాలెం గ్రామంలో శ్రీ బ్రహ్మంగారి ఆరాధనోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన తిరునాళ్లకు వర్షం ఆటంకం కలిగించింది. తిరునాళ్ల సందర్భంగా వైసిపి ఆధ్వర్యంలో మూడు విద్యుత్ ప్రభలు, టిడిపి ఆధ్వర్యంలో రెండు విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేశారు. సాయంత్రం ఏడు గంటలకు గాలివాన భీభత్సం సృష్టించడంతో ప్రభలకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఒక్కొక్క ప్రభకు రూ.6 లక్షల నుండి 10 లక్షల వరకు ఖర్చు పెట్టారు. తిరునాళ్లకు ఆటంకం కలగడంతో దాదాపు ఐదు క్వింటాళ్ల బియ్యం వండి.. అన్నదానం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.



కొనకనమిట్లలో పిడుగుపాటుకు మృతిచెందిన జీవాలు



దర్శిలో తిరునాళ్లలో బురదమయమైన నేల

ఆరవల్లిపాడులో బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి-దొనకొండ

మండలంలోని ఆరవల్లిపాడు గ్రామంలో వీరబ్రహ్మంగారి తిరునాళ్ల సందర్భంగా గ్రామస్తులు రాష్ట్రస్థాయి ఎడ్ల బండ లాగుడు పోటీలు ఆదివారం నిర్వహించారు. నంద్యాల జిల్లా కొత్తూరుకు చెందిన సుబ్రమణ్యేశ్వరరెడ్డి ఎడ్లు 5450 అడుగులు బండను లాగి మొదటి స్థానం కైవసం చేసుకున్నాయి. ప్రకాశం జిల్లా యర్రబాలెంకు చెందిన వెంకటగిరి హేమలతా నాయుడు ఎడ్లు 4805 అడుగులు లాగి రెండో స్థానం, గుంటూరు జిల్లా వినుకొండకు చెందిన బత్తుల చిన్నబ్బాయి యాదవ్ ఎడ్లు 4509 అడుగులు లాగి మూడవ స్థానం, ప్రకాశం జిల్లాకు చెందిన మోపర్తి వెంకటేశ్వర్లు ఎడ్లు 3774 అడుగులు లాగి నాల్గవ స్థానం, ప్రకాశం జిల్లా, ఆరవల్లిపాడుకు చెందిన నారాయణస్వామి ఎడ్లు 2939 అడుగులు లాగి ఐదవ స్థానం, ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన పిచ్చిరెడ్డి ఎడ్లు 2438 అడుగులు లాగి ఆరో స్థానంలో నిలిచాయి. వీరికి రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేల నగదును బహుమతిగా అందజేశారు. ఈ పోటీలను చూసేందుకు చుట్టు పక్కల గ్రామాల నుండి అధిక సంఖ్యలో విచ్చేయగా గ్రామస్తులు అన్నదానం చేశారు.



బండ లాగుతున్న ఎడ్లు

వైన్‌షాప్‌లో రూ.1.94 లక్షలు చోరీ

ప్రజాశక్తి-దొనకొండ

స్థానికంగా ఉన్న మద్యం దుకాణంలో రూ.1.94 లక్షల నగదు చోరీకి గురైన ఘటన శనివారం రాత్రి జరిగింది. సిబ్బంది శుక్రవారం రాత్రి 10 గంటలకు దుకాణం మూసివెళ్లారు. దొంగలు గుణపంతో షట్టర్ తాళాలు పగలగొట్టి దుకాణంలో నగదు లాకర్‌ను ఎత్తుకెళ్లారు. సమీపంలోని వెంచర్‌లో పగలకొట్టి అందులోని రూ.1.94 లక్షల నగదును, షాప్‌లోని రూ.29,520 విలువ గల 72 మద్యం సీసాలను తీసుకెళ్లారు. ఉదయాన్నే దుకాణం తెరిచేందుకు వచ్చిన సేల్స్‌మెన్ దాసరి రాంబాబు తాళాలు పగలకొట్టి ఉండటం గుర్తించి.. చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ యం.సైదుబాబు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేశారు.

రాష్ట్రానికి అన్యాయం చేసిన

మోడీకి మూడు పార్టీల భజన

(మొదటిపేజీ తరువాయి)

కేసుతో వారి గుట్టంతా బయటపడుతోందన్నారు. మోడీ చెయ్యెత్తమంటే చెయ్యెత్తడం.. గుంజీలు తియ్యమంటే తియ్యడం.. ఇదేనా ప్రాంతీయ పార్టీగా చేయడం అని ప్రశ్నించారు. దేశంలో అన్ని రాష్ట్రాల్లోనూ బిజెపికి వ్యతిరేకంగా పోరాడే పార్టీలున్నాయని, ఇక్కడే మూడు పార్టీలు మోడీకి అన్ని రకాలుగా వత్తాసు పలుకుతున్నాయన్నారు. చంద్రబాబు కూడా మోడీ పాలన బ్రహ్మాండం అని కితాబిచ్చారని, ఇది అధికారం కోసమేనన్నారు. మోడీని పొగిడేటప్పుడు ప్రజలపై వేసే భారాలు గుర్తుకురాలేదా? ప్రజలను కులాలు, మతాల పేరుతో చీల్చి వేరుచేస్తున్న అంశాలు గుర్తుకురాలేదా? అని చంద్రబాబును ప్రశ్నించారు. దేశంలో హిందూ, ముస్లిముల మధ్య చిచ్చుపెడుతున్న బిజెపి రాజ్యాంగం బదులు మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేస్తోందన్నారు. దేశాన్ని, జనాన్ని ఇలా చీలికలు.. పేలికలు చేస్తూ పాలన సాగిస్తుంటే ప్రశ్నించాల్సిన పార్టీలు అధికారం కోసం మౌనంగా ఉండటం ఆందోళనకరమన్నారు. ఇది ప్రజలకు నష్టమన్నారు. ప్రజలకు, రాష్ట్రానికి అన్ని రకాలుగా అన్యాయం చేసిన బిజెపికి వ్యతిరేకంగా పోరాడితేనే ప్రజలకు మేలు చేసినట్లవుతుందన్నారు. అలాకాకుండా బిజెపికి అనుకూలంగా ఉంటే ప్రజలకు వ్యతిరేకంగా ఉన్నట్లేనన్నారు. రాష్ట్రానికి అన్ని రకాలుగా అన్యాయం చేసిన బిజెపిని నమ్ముకొని అధికారంలోకి వచ్చినా రేపు ప్రజలకు ఏమి చేస్తారన్నారు. రూ.40 వేల కోట్లు ప్రచారానికి ఖర్చుపెట్టి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి చేసిందేమిటంటే అదానీ, అంబానీలకు దేశ సంపదను దోచిపెట్టడమేనన్నారు. అందుకే బిజెపికి వ్యతిరేకంగా కమ్యూనిస్టులు పోరాడుతున్నాయన్నారు. ప్రజలంతా కలిసి రావాలన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను నాశనం చేస్తున్న మోడీని సాగనంపాలన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక మనుధర్మ శాస్త్రం అమలులోకి వచ్చిందన్నారు. రాజ్యాంగం అమలు లేదన్నారు. గ్యాస్, పెట్రోలు ధరలు భారీగా పెరిగాయన్నారు. ప్రజలను దోచుకుంటున్నారన్నారు. బిజెపిని సాగనంపాలని కోరారు. సభకు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్‌కె.మాబు, సిపిఐ సంతనూతలపాడు నియోజకవర్గ కార్యదర్శి ఎస్.మురళి అధ్యక్షత వహించారు. సభలో సిపిఎం రాష్ట్ర నాయకులు జాలా అంజయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ సిపిఎం నాయకులు కాలం సుబ్బారావు, జె జయంతిబాబు, ఉబ్బా ఆదిలక్ష్మి, పమిడి వెంకట్రావు, పూసపాటి వెంకట్రావు, నెరుసుల వెంకటేశ్వర్లు, టి.శ్రీకాంత్, బంకా సుబ్బారావు, సిపిఐ నాయకులు ఎం.అంజయ్య, కె.అనంతలక్ష్మి, ఇ.సీతారామయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు • సినిమాకు వచ్చి పోతుండగా ప్రమాదం


ఆరిఫ్ (ఫైల్)

ప్రజాశక్తి-శింగరాయకొండ

సరదాగా సినిమాకు వచ్చి సినిమా చూసి డాబాకి వెళ్లి కడుపునిండా తిని రూముకి వెళదాము అనుకున్న విద్యార్థులు రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు మతి చెంది మరొక తీవ్ర గాయాలతో ఆసుపత్రి పాలైన సంఘటన ఆదివారం తెల్లవారుజామున సింగరాయకొండ జాతీయ రహదారిపై జరిగింది. నెల్లూరు జిల్లా కందుకూరు ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల చదువుతున్న విద్యార్థులు నలుగురు రెండు బైకుల మీద శింగరాయకొండ కొచ్చి సినిమా చూసి జాతీయ రహదారి మీద దాబాకు వెళ్లి టిఫిన్ చేసి తిరిగి కందుకూరు వెళ్లేందుకు జాతీయ రహదారి మీద రాంగ్ రూట్‌లో బయలుదేరారు. ఇద్దరు విద్యార్థులను గుర్తుతెలియని వాహనం ఢీకొంది. వీరిలో నెల్లూరు జిల్లా సంఘంకు చెందిన ఎస్‌కె ఆరిఫ్ (22) అక్కడికక్కడే మతి చెందారు. మరొక వ్యక్తి మనోజ్ నెల్లూరు జిల్లా పందిపాడు గ్రామానికి చెందిన వ్యక్తి మనోజ్ కు తీవ్ర గాయాల కావడంతో హైవే పెట్రోలింగ్ పోలీసులు హుటా హుటిన ఘటన స్థలానికి చేరుకొని గాయపడిన మనోజ్‌ను ఒంగోలు సంఘమిత్ర ఆసుపత్రికి చేర్పించారు. సరదాగా సినిమాకు వచ్చిన విద్యార్థులు ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నారు. కందుకూరులోని బయట రూములో ఉంటూ చదువుతున్నారు. మోటార్ బైకుల మీద వచ్చిన వీళ్లు సింగరాయకొండకు వచ్చి సినిమా చూసి జివిఆర్ ఫ్యాక్టరీ సమీపంలోని పెట్రోల్ బంకు వద్దకు వెళ్లి అక్కడ నుంచి కందుకూరు వెళ్లేందుకు జాతీయ రహదారి మీద రాంగ్ రూట్లో వెళుతుండగా గుర్తుతెలియని వాహనం మోటార్ బైకును ఢీకొట్టింది. దీంతో ఒకరు చనిపోగా మరొకరు తీవ్ర గాయాలతో ఒంగోలు ఆసుపత్రిలో ఉన్నారు. ఘటన స్థలాన్ని ఎస్ఐ ఫిరోజా ఫాతిమా పరిశీలించి వివరాలను సేకరించారు. బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న ఆరిఫ్ మతి చెందిన విషయం తల్లిదండ్రులు తెలియడంతో తల్లిదండ్రులు తల్ల డిల్లిపోయారు. శనివారం కావడంతో ఆదివారం సెలవు వస్తుందన్న ఉద్దేశంతో బీటెక్ చదువుతున్న విద్యార్థులు సరదాగా సినిమాకు వచ్చి తిరుగు ప్రయాణంలో మృతి చెందటం కళాశాల విద్యార్థిని విద్యార్థులను కలచివేసింది.

లీలాకృష్ణకు సన్మానం

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి భీమా లీలాకృష్ణను బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. న్యాయ వ్యవస్థపై నమ్మకంతో బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నికైన లీలా కృష్ణ బాధ్యతలు సమర్ధవంతంగా నిర్వర్తించి ప్రజలకు న్యాయ సేవలు అందించి పేదలకు అండగా నిలవాలన్నారు. న్యాయం అందరికీ అందేలా కృషి చేయాలని నరేంద్రవర్మ, చీరాల పార్టీ బాధ్యులు కొండయ్య ఆకాంక్షించారు. కార్యక్రమంలో బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు శిక్షణ పూర్తి

ప్రజాశక్తి-పంగులూరు

మే నెల ఒకటో తేదీ నుంచి 5వ తేదీ వరకు తిరుపతి జిల్లా తిరుపతి పట్టణాల్లో జరిగే, ఏపీ సీఎం కప్, రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలలో పాల్గొనే ఉమ్మడి ప్రకాశం జిల్లా పురుషుల జట్టు శిక్షణ పూర్తి చేసుకున్నట్లు, రాష్ట్ర ఖోఖో కార్యదర్శి మేకల సీతారాంరెడ్డి ఆదివారం తెలిపారు. గత పది రోజులుగా స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలో కోచింగ్ క్యాంప్ నిర్వహించామని, ఈ కోచింగ్ ఆదివారంతో ముగియటంతో, జట్టును నిర్ణయించడం జరిగిందని చెప్పారు. ఈ జట్టులో 12 మంది క్రీడాకారులు ఉంటారని, వీరిని జిల్లా క్రీడా అధికారి రాజరాజేశ్వరి, స్టెప్ సీఈవో బాబురావు, రాష్ట్ర ఖోఖో కార్యదర్శి మేకల సీతారాంరెడ్డి ఎంపిక చేశారు. ఈ శిక్షణ సందర్భంగా చందలూరు ఈవో రాజేష్ కుమార్, కోచ్ పేరిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మేకల సీతారామరెడ్డి పాల్గొన్నారు. ఈ టోర్నమెంటు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జరుగుతుందని సీతారామిరెడ్డి చెప్పారు.

జట్టులో పాల్గొనే క్రీడాకారులు వివరాలు

పి శివారెడ్డి (ఈదర), ఏ శివనాగిరెడ్డి (పంగులూరు), పి స్వామినాథన్ (రుద్రవరం), వి ఏడుకొండలురెడ్డి (పంగులూరు), ఎస్‌కే ఆలీ నవాజ్ (పంగులూరు), ఏ వీరాంజనేయులు (రుద్రవరం), జిఎన్‌వి శివ (పంగులూరు) కె రామ్మోహన్ (పంగులూరు), కే వంశీ (రుద్రవరం), ఎం ఫణికుమార్ (పంగులూరు), ఆర్ సూరి నాయుడు (పంగులూరు), కే మహేష్ (పంగులూరు) ఉన్నారు. ఈ జట్టుకు కోచ్‌గా పేరిరెడ్డి వ్యవహరిస్తారని సీతారామరెడ్డి తెలిపారు.

పోలియో చుక్కలు వేయించాలని ర్యాలీ

ప్రజాశక్తి-అద్దంకి: ఐదు సంవత్సరాల లోపు చిన్నారులకు తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలు వేయించాలని రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అధ్యక్షులు సంగిరెడ్డి శ్రీనివాసరావు అన్నారు. జాతీయ పల్స్ పోలియో వారోత్సవాల సందర్భంగా ఆదివారం పల్స్ పోలియో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. అద్దంకి ప్రభుత్వ బాలికల పాఠశాల నుంచి పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు ఈ ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు సందిరెడ్డి శ్రీనివాసరావు, కోశాధికారి తమ్మన శ్రీనివాసరావు, బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యా శాఖ అధికారి రాఘవరావు, విద్యా కమిటీ ఛైర్మన్ సుధాకరరెడ్డి, రోటరీ సభ్యులు డాక్టర్ ఉబ్బా దేవపాలన, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, షేక్ మహమ్మద్ రఫీ, చప్పిడి వీరయ్య, పసుపులేటి ఆంజనేయులు, మలాది శ్రీనివాసరావు, సంకా బాబు, కొల్లా భువనేశ్వరి, జాగర్లమూడి శివకుమారి, మంగమూరి సురేష్ తదితరులు పాల్గొన్నారు. పొట్టి శ్రీరాములు విగ్రహం దగ్గర మానవహారం ఏర్పాటు చేశారు.


అన్న క్యాంటీన్‌లో భోజనం వడ్డిస్తున్న ఎంఎం కొండయ్య, నరేంద్రవర్మ

పేదల ఆకలి తీర్చేందుకే అన్నా క్యాంటీన్

ప్రజాశక్తి-బాపట్ల

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ శత జయంతిని పురస్కరించుకుని తెలుగుదేశం పార్టీ పిలుపు మేరకు పేద ప్రజల ఆకలి తీర్చాలన్న లక్ష్యంతో బాపట్లలో అన్న క్యాంటీన్‌ను నిర్వహిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్రవర్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ 182వ రోజుకు చేరింది. ఆదివారం చెరువు జమ్ములపాలేనికి చెందిన యార్లగడ్డ హాసిని స్మృతులతో ఆమె తాతయ్య, నాయనమ్మ యార్లగడ్డ అంకమ్మ చౌదరి-వేదవతి సహకారంతో సుమారు 250 మంది పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పేదల ఆకలి తీర్చే బృహత్తర కార్యక్రమంలో భాగస్వాములై తమవంతు సహకారాన్ని అందిస్తున్న దాతలకు నరేంద్రవర్మ ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి చీరాల ఇన్‌ఛార్జి ఎంఎం కొండయ్య, తెలుగుదేశం పార్టీ నాయకులు, దాతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-వేటపాలెం

హృదయ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక రామానగర్‌లోని డాక్టర్ మధు క్లినిక్ ఆవరణలో అసోసియేషన్ సభ్యుడు కీర్తిశేషులు పింజల భాస్కర్ (డిఈఈ, సిపిడీసిఎల్) స్మారక చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఆదివారం మజ్జిగ పంపిణీ కార్యక్రమానికి అసోసియేషన్ సభ్యుడు ఎంవిఎన్ మూర్తి (రమణ) రెండు వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. ఈ చలివేంద్రాన్ని బైన మల్లికార్జునరావు ప్రారంభించారు. వేసవి దాహార్తిని తీర్చడానికి ఇలాంటి మంచి కార్యక్రమాలు చేయడం ఎంతో సంతోషదాయకమని బండ్ల బాపయ్య కాలేజ్ పిడి మాస్టరు బండ్ల బాపయ్య అన్నారు. వేసవిలో మజ్జిగ తాగటం ఎంతో ఆరోగ్యమని గణిత శాస్త్ర అధ్యాపకులు కోటేష్ అన్నారు. నేటి నుంచి మే నెల 30వ తేదీ వరకు జరిగే చలివేంద్రం కార్యక్రమానికి పింజల అనురాధ రూ.15 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ నన్నపనేని సునీల్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ బొడ్డు శివయ్య, జనరల్ సెక్రెటరీ గుగ్గిలం శ్రీహరి, డాక్టర్ మధు, వూట్ల వెంకటేశ్వర్లు, బాలాజీ, (బాలాజీ స్టూడియో అధినేత), బుద్ధి శీను, మస్తాన్, ధరణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

3న విశాఖ ఉక్కు కోసం రాస్తారోకో



మాట్లాడుతున్న మజుందార్

ప్రజాశక్తి-బాపట్ల

విశాఖ ఉక్కు పోరాటానికి మద్దతుగా ఈ నెల 3న నిర్వహించే రాస్తారోకోలను జయప్రదం చేయాలని సిఐటియు, ఏఐటీయూసీ సంఘాలు సంయుక్తంగా పిలుపునిచ్చాయి. ఆదివారం బాపట్ల సిపిఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సిఐటియు, ఎఐటి యుసి నాయకులు మాట్లాడారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందార్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదంతో గత 50 యేళ్ల క్రితం ఉమ్మడి రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు జరిపి 27 మంది బలిదానంతో శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యుల రాజీనామాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని నేటి కేంద్ర ప్రభుత్వం ప్రయివేటీకరించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. లక్షలాది మంది కార్మికులు నమ్ముకున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలు జేఏసీగా గత రెండేళ్ళుగా ఉద్యమిస్తున్నప్పటికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నాయన్నారు. విశాఖ ఉక్కు సాధనకు ఏప్రిల్ 19న విజయవాడలో జరిగిన అన్ని ట్రేడ్ యూనియన్, ప్రజా సంఘాలు, వామపక్షాలు హాజరై కేంద్ర ప్రభుత్వ విధానాన్ని వ్యతిరేకిస్తూ విశాఖ స్టీల్ ప్లాంట్‌ను నూటికి నూరు శాతం సామర్థ్యంతో ప్రభుత్వ రంగంలోనే నడపాలని, మే 3న రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల మధ్య రాస్తారోకో నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జెల్డి భాగ్య శ్రీధర్, బాపట్ల పట్టణ సిఐటియు కార్యదర్శి జె శ్యామ్యూల్, కుమార్ పాల్గొన్నారు.

విజ్ఞాన గని సారస్వత నికేతనం

ప్రజాశక్తి-వేటపాలెం: విజ్ఞాన గని సారస్వత నికేతనం అని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఎస్ సురేష్ కుమార్ అన్నారు. ఆదివారం ఆయన స్థానిక సారస్వత నికేతనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పురాతన తాళపత్ర గ్రంథాలను, మహాత్మాగాంధీ వదలి వెళ్లిన చేతి కర్రను పలు దినపత్రికలను పరిశీలించారు. ఆయన సతీమణితో పాటుగా విద్యాశాఖ అధికారి పివిజె రామారావు, బాపట్ల జిల్లా నాడు-నేడు పాఠశాలల నోడల్ ఆఫీసర్ పి సుబ్రహ్మణ్యేశ్వరరావు గ్రంథాలయాన్ని సందర్శించిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో పాలకురాలు శ్రీవల్లి శాంతారాం, ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు బుర్ర సాంబశివరావు తదితరులు ఉన్నారు.

దళితుల పథకాలు రద్దు చేసిన ప్రభుత్వం

ప్రజాశక్తి-రేపల్లె: జై భీమ్ భారత పార్టీ రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న గడపగడపకు దగా ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం రేపల్లెలోని 13వ వార్డు గాంధీ నగర్‌లో ప్రచార కార్యక్రమాన్ని ఆ పార్టీ నాయకులు ప్రారంభించి పుస్తకాలను కరపత్రాలను ఆవిష్కరించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే యానాది కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీలు ఇచ్చినటువంటి ప్రభుత్వం నేటి వరకు వారి సంక్షేమం అభివృద్ధి కోసం యానాది కార్పొరేషన్ ఏర్పాటు చేయకపోవడం ఆ వర్గాలపై ఉన్నటువంటి వివక్షతా వైఖరికి నిదర్శనమని రేపల్లె అసెంబ్లీ అభ్యర్థి న్యాయవాది దోవా రమేష్ రాంజీ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నాలుగు సంవత్సరాల కాలంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలకు చెందిన 27 రకాల పథకాలను రద్దు చేసిందని, ఉపాధి రంగాలకు తోడ్పాటు ఇవ్వకపోవడం వలన ఆయా సామాజిక వర్గాల విద్యార్థి యువత భవిష్యత్తు అందకారంలోనికి నెట్టివేయబడినదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రశ్నించిన మేధావి వర్గంపైన రాష్ట్ర ప్రభుత్వం మానవత్వాన్ని విస్మరించి పాశవిక దాడులకు పాల్పడడం సిగ్గుచేటు అన్నారు. కార్యక్రమంలో జై భీమ్ భారత్ పార్టీ బాపట్ల పార్లమెంటు నియోజకవర్గం అభ్యర్థి పెనుమాల సుబ్బారావు, రేపల్లె మండల కన్వీనర్ కర్ర బాబురావు, కొమరాబత్తిని జై ప్రసాద్, శివనాగులు, మల్లయ్య పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

ప్రజాశక్తి-కొల్లూరు: కొల్లూరు మండల పరిధిలోని కిష్కింధపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని ఉపాధి హామీ పనులను శనివారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి టి కృష్ణమోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు కనీస సౌకర్యాలు, టెంట్లు మెడికల్ కిట్లు ఓఆర్ఎస్ ప్యాకెట్లు మజ్జిగ పనిముట్లు సమ్మర్ అలవెన్స్ కింద చేసిన పనులకు వారం వారం బిల్లులు చెల్లించాలని కష్ణమోహన్ డిమాండ్ చేశారు. జిల్లాల్లో వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ చట్టం ఒక వర్మ లాంటిదని ఈ చట్టాన్ని నమ్ముకుని సుమారు నాలుగు లక్షల మంది పైగా జీవిస్తున్నారని అన్నారు. ఇలాంటి చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేయడానికి పూనుకుందని అన్నారు. కొత్త కొత్త నిబంధనలు తీసుకొచ్చి నిర్వీర్యం చేస్తుందని అన్నారు.

మర్లపాడు పొలాల్లో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-టంగుటూరు: మండలంలోని మర్లపాడు-కొణిజేడు గ్రామాల సమీపంలోని పొగాకు తోటలలో ఓ వ్యక్తి వేప చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కొణిజేడు గ్రామానికి చెందిన పాలపర్తి సురేష్(35) ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సురేష్‌కు అదే గ్రామానికి చెందిన మరో యువతితో వివాహేతర సంబంధం ఉన్నట్లు తెలుస్తోంది. ఆదివారం ఉదయం సురేష్ సదరు యువతి మధ్య వివాదం జరిగినట్లు చెబుతున్నారు. సమాచారం అందుకున్న టంగుటూరు ఎస్ఐ షేక్ ఖాదర్ బాషా సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ ఖాదర్‌బాషా సురేష్ మృతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంతమాగులూరు సిఐగా బి ప్రభాకర్

ప్రజాశక్తి-సంతమాగులూరు



సంతమాగులూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బి ప్రభాకర్ ఆదివారం సర్కిల్ కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు. ఇప్పటివరకు ఇక్కడ పని చేసిన ఎం లక్ష్మణ్‌ను విఆర్‌కు పంపారు. కాగా సంతమాగులూరు సర్కిల్ సిఐ నియామకంలో, ఇటీవల కొన్ని పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లా మాజీ మంత్రి సిఫార్సుతో ఇటీవల సిఐ లక్ష్మణ్ పోస్టింగ్ పొందాడు. అయితే వైసిపి నియోజకవర్గం ఇన్‌చార్జి ప్రమేయం లేకుండా లక్ష్మణ్ నియమించబడ్డారని తెలిసి ఇన్‌ఛార్జి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. సిఐ లక్ష్మణ్ 12 రోజులే విధులు నిర్వహించారు. ఇన్‌ఛార్జి సిఫారసు మేరకే ఉన్నతాధికారులు ప్రభాకర్‌ను నియమించారు.



వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవంలో పాల్గొన్న కృష్ణచైతన్య

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

ప్రజాశక్తి-అద్దంకి

పట్టణంలోని కాకానిపాలెంలో వీరబ్రహ్మేంద్ర స్వామి వారి దేవాలయంలో అద్దంకి పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి వారి 330వ ఆరాధన మహోత్సవ సందర్భంగా వేద పురహితులు సత్తెనపల్లి శ్రీశైలంచే ఉదయం నుంచి అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ శాప్ నెట్‌వర్క్ చైర్‌పర్సన్, వైసిపి ఇన్‌ఛార్జి బాచిన కృష్ణ చైతన్య పాల్గొనగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనంతో ఘనంగా శాలువాతో సత్కరించారు. ధర్మవరానికి చెందిన పామర్తి శివజ్యోతి విద్యాభివృద్ధికి దాతల ద్వారా సేకరించిన నగదు రూ.30 వేలను కృష్ణచైతన్య చేతుల మీదుగా విద్యార్థి తాతా సుబ్బారావు అందించారు. నలుగురు పేదలకు బట్టలు పంపిణీ చేశారు. భక్తులందరికీ తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గోనుగుంట రజిని, ప్రకాశం జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘ అధ్యక్షులు చెన్నుపల్లి శ్రీనివాసాచారి, అద్దంకి పట్టణ అధ్యక్షులు పొన్నపల్లి బ్రహ్మానందం, అనంత మురళి, గొల్లపాటి శ్రీనివాసచారి, గుండెమెడ హనుమంతరావు, ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ రాష్ట్ర డైరెక్టర్ కొల్లా భువనేశ్వరి, చింతలపూడి వీరయ్య, కొండమది రమేష్, వీరప్పయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ దేశ్ పరమేష్, సందిరెడ్డి రమేష్, వైస్ చైర్మన్ కె అనంతలక్ష్మి, చోడ వెంకట సుబ్బారావు స్థానిక భక్తులు పాల్గొన్నారు.

పర్చూరు: పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 330వ ఆరాధనోత్సవాలు పర్చూరు మండలంలోని వివిధ గ్రామాలలో ఘనంగా జరుపుకున్నారు. పర్చూరు మండలంలోని చెరుకూరు దేవాలయంలో ఆరాధనోత్సవం సందర్భంగా స్వామి వారి కళ్యాణం నిర్వహించారు. పోతుకట్లలో తిరునాళ్లలాగా ఆరాధనోత్సవాలు జరిపారు. వీరన్నపాలెంలో కళ్యాణం నిర్వహించి జెండా ఊరేగింపు నిర్వహించారు. రమణాయపాలెం, నూతలపాడు, బోడవాడ, ఉప్పుటూరు గ్రామాల్లో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని పర్చూరులో 5 రోజులు విశేష కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో బిసి రాష్ట్ర నాయకులు కోడూరి శేషబ్రహ్మాచారి, కల్లం కృష్ణారెడ్డి, బొప్పూడి ప్రసాద్‌బాబు, పి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సాహిత్య విప్లవాగ్నిని రగిలించిన శ్రీశ్రీ

ప్రజాశక్తి-బాపట్ల

తెలుగు సాహితీ లోకంలో విప్లవాగ్నిని రగిలించిన శ్రీశ్రీ సాహిత్యంలో ఒక నూతన ప్రభంజనాన్ని సృష్టించారని ప్రజాకవి, వైద్య విద్వాన్ డాక్టర్ ఎస్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం శ్రీశ్రీ 113వ జయంతి సందర్భంగా సాహితీ భారతి ఆధ్వర్యంలో శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఊహల్లో విహరిస్తున్న తెలుగు సాహిత్యాన్ని వాస్తవ పరిస్థితులకు అద్దంపట్టే విధంగా తమ రచనలతో సమాజాన్ని శ్రీశ్రీ చైతన్యపరిచారన్నారు. సాహితీ భారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ మాట్లాడుతూ.. ఛాందస భావ సంకెళ్లను ఛేదించి సామాన్యులకు అర్థమయ్యే భాషలో తాడిత పీడిత ప్రజల కష్టాలకు శ్రీశ్రీ అక్షర రూపాన్ని ఇచ్చారన్నారు. కార్యక్రమంలో మర్రి మాల్యాద్రి రావు, ఆదం షఫీ, ఎం జాకబ్, కస్తూరి శ్రీనివాసరావు, బొడ్డుపల్లి శ్రీరామచంద్ర మూర్తి, ఎం కృష్ణ, పువ్వాడ వెంకటేశ్వర్లు, రెంటాల మురళి, రాధాకృష్ణమూర్తి, అవ్వారు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కష్టజీవుల కవి శ్రీశ్రీ

సాహిత్య మార్గాన్ని విప్లవీకరించి తాడిత పీడిత జనుల పక్షాన నిలిచిన గొప్ప కవి శ్రీశ్రీ అని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి పిసి సాయిబాబు అన్నారు. ఆదివారం శ్రీశ్రీ 113వ జయంతి సందర్భంగా బాపట్ల సరస్వతి మెమోరియల్ ఉన్నత పాఠశాలలో జరిగిన శ్రీశ్రీ జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సామాజిక విప్లవానికి పురోగామిగా సాహిత్య విప్లవం సాగాలని ఆయన విశ్వసించారన్నారు. విప్లవ సాహిత్య యుగకర్తగా ఖ్యాతి గడించారని, కష్టజీవుల హృదయాలకు తగిలిన గాయాలను గేయాలుగా మార్చారని అన్నారు. బాధలు, భయాలు లేని నూతన సమాజ నిర్మాణాన్ని శ్రీశ్రీ కాంక్షించారు. తెలుగు సాహిత్యంలో ఎర్రజెండాని, ప్రపంచ సాహిత్యంలో తెలుగు జెండాని ఎగురవేసిన ఘనుడని అన్నారు. మూఢనమ్మకాలు, విశ్వాసాలను ఆయన వ్యతిరేకించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ సాహిత్య నిధి నూతనంగా ప్రచురించిన 30 పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జి శాంతకుమారి, ఉపాధ్యాయులు రమాదేవి, శివపార్వతి, విద్యార్థులు పాల్గొన్నారు.



శ్రీశ్రీ సాహిత్య నిధి పుస్తకావిష్కరణ దృశ్యం

మోడీ విధానాలకు వ్యతిరేకంగా ప్రచారభేరి

ప్రజాశక్తి-నగరం

మోడీ ప్రజవ్యతిరేక విధానాలని నిరసిస్తూ నగరంలో సీపీఎం ప్రచారభేరి నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేశారు. ఇందులో భాగంగా నగరం మెయిన్ సెంటర్‌లో జరిగిన ప్రచారంలో సీపీఎం బాపట్ల జిల్లా కమిటీ సభ్యుడు సిహెచ్ మణిలాల్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, మతాల పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెట్టి బిజెపి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందని విమర్శించారు. ధరలు పెద్దఎత్తున పెంచుతున్నారని విమర్శించారు. బిజెపి కుట్రలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత కమ్యూనిస్టులపై ఉందని అన్నారు. అందుకే ఏప్రిల్ 14 నుంచి రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ విధానాలను నిరసిస్తూ రాజకీయ ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలను రోజురోజుకూ పెంచుకుంటూ పోతోందని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ వ్యాపార వేత్తలకు అనుకూలంగా పనిచేస్తోందని అన్నారు. ప్రజలందరూ ఐక్యంగా ఉండి మోడీని సాగనంపాలని పిలుపునిచ్చారు. మన రాష్ట్రానికి మోడీ ప్రభుత్వం చేస్తున్న ద్రోహం అంతా ఇంతా కాదన్నారు. ప్రత్యేక హోదా, పోలవరం నిధులు, రాజధాని నిర్మాణం, రైల్వే జోన్, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజ్-ఇవన్నీ పార్లమెంట్ సాక్షిగా విభజన చట్టంలో ఇచ్చినా హామీలు వీటిలో ఏ ఒక్క దాన్ని అమలు చేయలేదని విమర్శించారు. రాష్ట్రంలో అనేక త్యాగాలు ద్వారా సాధించుకున్న విశాఖ ఉక్కును కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడానికి కేంద్రం కుట్ర చేస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం కూడా మెతక వైఖరి ఆవలంబిస్తూ ఇద్దరు కలిసి ప్రజలని మోసం చేస్తున్నారని విమర్శించారు. మోడీ ప్రభుత్వ నుంచి భారతదేశాని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క పౌరుడిపై ఉందని అన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో సీపీఎం నగరం మండల కార్యదర్శి కె గోపి, నాయకులు ఏవిపికె సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

మేదరమెట్ల: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పరిపాలన విధానాన్ని నిరసిస్తూ బీజేపీని ఓడించండి-దేశాన్ని కాపాడండి అనే నినాదంతో వామపక్షాల ఆధ్వర్యంలో ఆదివారం నిరసన ర్యాలీ జరిగింది. కొరిశపాడు మండలంలోని ప్రాసంగులపాడు నుంచి మేదరమెట్ల వరకు బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో పమిడిపాడు రావినూతల కుర్రవానిపాలెం కొరిశపాడు గ్రామాలను కలుపుకుంటూ ర్యాలీ జరిగింది. మేదరమెట్లలో సిపిఎం మండల కార్యదర్శి మోండ్రు ఆంజనేయులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్, హిందుత్వ విధానాలను దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో నందికోలు సుబ్బారావు, కంచర్ల సుధాకర్, చావ కోటేశ్వరరావు, చావా జయరావు, కంచర్ల సురేష్, వై రవీంద్రబాబు, కొల్లా సుబ్బారావు, సభ్యులు పాల్గొన్నారు.



నగరంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకుడు మణిలాల్



ప్రాసంగులపాడు-మేదరమెట్ల మోటారు సైకిల్ ర్యాలీ

వివేకా హత్య కేసులో జగన్ రంగు బయటపడింది: వేగేశన

ప్రజాశక్తి-బాపట్ల

వైఎస్ వివేకానందరెడ్డి హత్యను తెలుగుదేశం పార్టీకి అంటగట్టి రాజకీయంగా లబ్ధి పొందాలని చూసిన ముఖ్యమంత్రికి చుక్కెదురైందని, హత్యకేసులో నిందితులను అరెస్టు చేయడంతో జగన్ అసలు రంగు బయటపడిందని బాపట్ల నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్రవర్మ అన్నారు. ఆదివారం బాపట్ల టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వైసిపి ప్రభుత్వం వైఫల్యాలు, వివేకా హత్యోదంతంపై చీరాల టిడిపి బాధ్యులు ఎంఎం కొండయ్యతో కలిసి ఆయన మాట్లాడారు. నరేంద్రవర్మ మాట్లాడుతూ జగన్ వైఫల్యాలు మాట్లాడుకోవడానికి రోజులు సరిపోవని, గ్రంథాలు రాయవచ్చని అన్నారు. కూరగాయలు అమ్మేవారు డిజిటల్ పేమెంట్ ద్వారా డబ్బులు తీసుకుంటుంటే ప్రభుత్వ మద్యం దుకాణాల్లో నగదు లావాదేవీలు మాత్రమే చేస్తున్నారని అన్నారు. ఆ డబ్బంతా ఏమి చేస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని అన్నారు.



వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి వాడకం పెరిగిపోయిందని అన్నారు. ప్రభుత్వం యువతను మత్తుకు బానిసలను చేయడంతో వారు ఏమి చేస్తున్నారో వారికే తెలియని పరిస్థితిలో అనేక నేరాలకు పాల్పడుతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌ను ఆదర్శంగా తీసుకుని ఆ పార్టీ నాయకులు ప్రతి నియోజకవర్గంలో ఇసుక, భూ మాఫియాతో కోటానుకోట్ల రూపాయలు దోచుకుంటున్నారని అన్నారు. బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి అక్రమాలు బహిరంగ రహస్యమేనని అన్నారు. చీరాల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి ఎంఎం కొండయ్య మాట్లాడుతూ హత్యా రాజకీయాలు చేయడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిది ఆరితేరిన చేయన్నారు. తన అధికార దాహానికి సొంత కుటుంబ సభ్యులను కూడా బలి చేయడానికి వెనుకాడని క్రూర మనస్తత్వం గల ముఖ్యమంత్రి ఉండటం ఈ రాష్ట్ర దౌర్భాగ్యమన్నారు. బాబాయి హత్య, కోడికత్తి డ్రామాతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి నిజ స్వరూపం ప్రజలకు స్పష్టంగా అర్థం అయ్యిందన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలే వారికి తగిన బుద్ధి చెబుతారని కొండయ్య హెచ్చరించారు. సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కౌతావరపు జనార్ధన్, రామకృష్ణ, గొలపల శ్రీనివాసరావు, తనికొండ దయబాబు, తోట నారాయణ, ప్రమీల రాణి, ఫరీద్ మస్తాన్, ఊట్ల రామారావు పాల్గొన్నారు.

అన్నదాతకు తీరని కష్టం

- వర్షాలతో పడిపోయిన మొక్కజొన్న
- విరిగిపడిన కరెంటు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌లు
- వానకు తడిసిన మొక్కజొన్న, మిర్చి
- తడిసిన పంటకు ధర తగ్గిస్తారని రైతుల ఆందోళన

ప్రజాశక్తి-పంగులూరు

అకాల వర్షం గాలి, పంగులూరు మండలంలో విధ్వంసాన్ని సృష్టించింది. మండలంలోని పలు గ్రామాలు గాలి వాన ధాటికి గజగజ వణికిపోయాయి. శనివారం మధ్యాహ్నం జరిగిన ఈ విధ్వంసానికి, మండలంలోని సుమారు 150 ఎకరాల నుంచి 200 ఎకరాల్లో మొక్కజొన్న పైరు నేల వాలింది. కండెలు కొన్ని వర్షపు నీటిలో నానిపోయాయి. ఎండలో ఆరబోసిన మొక్కజొన్నలు తడిసిపోయాయి. కల్లాల్లో ఉన్న మిర్చి తడవటంతో పాటు, ఇంకా కోతకోయని మిర్చి పొలాల్లో కాయలు రాలి వర్షపు నీటికి తడిసిపోయాయి. మండలంలోని బూదవాడ, కళ్లంవారిపాలెం, చిన్న మల్లవరం, పంగులూరు, జనకవరం, కోటపాడు, కొండమంజులూరు, బయట మంజులూరు, భగవాన్ రాజుపాలెం, రామకూరు గ్రామాలు ఈ అకాల వర్షం బారిన పడ్డాయి. ఈ వర్షానికి తడిసిపోయిన మిర్చి, మొక్కజొన్నలను ఎండబెట్టుకునే పనిలో రైతులు ఉన్నారు. పరదాలపై ఆరబోసిన రైతులు ఆలోచనలో పడ్డారు. ఈ సంవత్సరం మొక్కజొన్న ఒక్కసారిగా రావడంతో, ప్రైవేట్ వ్యాపారులు సిండికేట్ అయ్యి రోజురోజుకూ ధరలు తగ్గించుకుంటూ 2,250 రూపాయలు ఉన్న ధరను, 1700 రూపాయలకు తగ్గించుకుంటూ వచ్చారు. ఈ వర్షం కారణంగా తడిసిపోయాయి అనే నెపంతో, ఇంకా ఎంత ధర తగ్గిస్తారో అని రైతులు ఆవేదన చెందుతున్నారు. మిర్చి కూడా ఈ కాలంలో కొంత రేటు తగ్గింది. ఇప్పుడు ఈ అకాల వర్షానికి ఎంత ధర తగ్గుతుందోనని రైతులు దిగాలు పడుతున్నారు. కరెంటు స్తంభాలు విరిగిపడటం, ట్రాన్స్ ఫార్మర్లు పడిపోవడం, చెట్లు కూలిపోవడం, పడిపోవడంతో వ్యవసాయ పొలాలకు ఇప్పట్లో సాగునీరు అందదేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.





అకాల వర్షానికి, గాలికి పడిపోయిన మొక్కజొన్న పైరును పరిశీలిస్తున్న రైతులు, రైతు సంఘం నాయకులు (పక్కన) అకాల వర్షానికి తడిసిపోయిన మొక్కజొన్నలను ఆరబెడుతున్న రైతులు

మొక్కజొన్నను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయించాలి
- రైతు సంఘం, కౌలు రైతు సంఘం నాయకుల డిమాండ్

మొక్కజొన్నను మార్క్ ఫెడ్ ద్వారా ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయించాలని రైతు సంఘం, కౌలు రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మధ్యాహ్నం కురిసిన అకాల వర్షానికి, గాలికి, కొండమంజులూరు గ్రామంలో దెబ్బతిన్న మొక్కజొన్న పైరును, ఆదివారం రైతు సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాయిని వినోద్‌బాబు పరిశీలించారు. మొక్కజొన్నను ప్రభుత్వమే వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌ను కలిసి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని అర్జీ ఇచ్చామని, దానికి ఆయన సానుకూలంగానే స్పందించారని, అయితే ఇంతవరకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదని చెప్పారు. శనగ కొనుగోలు కేంద్రాల్లో కూడా అరకొరగానే సెనగలు కొంటున్నారని, దీనివలన ప్రైవేటు వ్యాపారుల వలలో రైతులు పడిపోతున్నారని చెప్పారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విస్తారమైన సేవలు అందిస్తామని, విత్తనం మొదలుకొని కొనుగోలు చేసేదాకా రైతు భరోసా కేంద్రాలు రైతుకు అండగా ఉంటాయని చెప్పిన ముఖ్య మంత్రి మాటలు అమలు జరగడం లేదని విమర్శించారు. అధికారులు ఇప్పటికైనా రైతుల ఇబ్బందులు గమనించి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, రైతులు పండించిన మొత్తం పంటలను కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయించాలని రామారావు, వినోద్‌బాబు డిమాండ్ చేశారు.



ఒక్కచోట చేరిన పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-నిజాంపట్నం

నిజాంపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988-89 పదవ తరగతి టైటాన్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. తమకు విద్యాబుద్ధులు చెప్పిన నాటి గురువులను పూర్వ విద్యార్థులు శాలువాలతో ప్రత్యేకంగా ఘనంగా సన్మానించారు. అనంతరం పూర్వ విద్యార్థులు అందరూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. వివిధ వృత్తులలో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు తమ గత స్మృతులను నెమరువేసుకుంటూ తాము చదువుకున్న పాఠశాలలో కలియ తిరిగి తమ అనుబంధాలను స్మరించుకున్నారు. తమ విద్య, వైవాహిక, ఉద్యోగ జీవిత విశేషాలు, కుటుంబ నేపథ్యాల విషయాల గురించి ఒకరికొకరు చెప్పుకుంటూ, సెల్ఫీలు, ఫోటోలు తీసుకుంటూ ఎంతో ఆనందోత్సాహాలతో గడిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎంఈఓ కె హరిబాబు పాల్గొనగా పూర్వ విద్యార్థులు ప్రసాదం వాసుదేవ, నర్రా నాగేశ్వరరావు, మోపిదేవి నాగరాజు, అబ్దుల్ సలీం, కొత్వాల్ మౌలా సాహెబ్, నిజాంపట్నం మల్లికార్జునరావు, జిడుగు రాజా, మోపిదేవి శ్రీనివాసరావు, మరకా శ్రీనివాసరావు, నజీర్ అహమ్మద్, మెండు వెంకట రత్నరావు, పీతా సుబ్బారావు, షేక్ ఖలీల్ తదితర పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని క్రియా సంస్థ ఆర్థిక సహకారంతో ఇంకొల్లు మండలంలోని గంగవరం వలేటి కృష్ణయ్య ఉన్నత పాఠశాలో పలు పోటీలు నిర్వహించారు. వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు పాఠశాల చైర్మన్ వలేటి కృష్ణయ్య చేతుల మీదుగా అందజేశారు. సభకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె వీరాంజనేయులు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో వి విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.



బహుమతులతో విద్యార్థులు

చల్లా నాగ ఏకాంబరేశ్వరరావు హఠాన్మరణం

అమెరికాలో గుండెపోటుతో మృతి ● రెండు రోజుల్లో పార్థివ దేహం స్వస్థలానికి



ప్రజాశక్తి-వేటపాలెం: ప్రముఖ పారిశ్రామికవేత్త చల్లా నాగ ఏకాంబరేశ్వరరావు(57) ఇకలేరు. ఆకస్మికంగా గుండెపోటుతో గత శనివారం అమెరికాలో మృతి చెందారు. చల్లా నాగ ఏకాం బరేశ్వరరావు మండల పరిధిలోని పందిళ్లపల్లి గ్రామవాసి. చిన్న వయసులోనే పారిశ్రామిక వేత్తగా ఎదిగారు. ప్రాథమిక విద్యను పందిళ్లపల్లి గ్రామంలోనే అభ్యసించారు. ఇంజినీరింగ్ పూర్తి చేసుకొని అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేపట్టారు. చీరాల నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పోటీలో నిలిచేందుకు ప్రయత్నించారు. తన స్వగ్రామంలోని పందిళ్లపల్లి హైస్కూల్‌లో ఇటీవల నిర్మించిన ఇండోర్ స్టేడియానికి పెద్ద మొత్తంలో విరాళం అందించారు. స్థానికంగా ఉన్న చేనేత కుటుంబాలకు, నిరుపేదల చదువుకు గుప్త దానాలు చేశారు. దేవాలయాల్లో నిర్వహించే కార్యక్రమాలకు లేదనకుండా ఇచ్చేవారు. కరోనా కష్టకాలంలో పోలీసు లకు, జర్నలిస్టులకు ఆయన అందించిన చేయూత మరవలేనిది. ఏకాంబరానికి ఇద్దరు అమ్మాయిలు. పెద్దకుమార్తె సబిత ఎంబిబిఎస్ డాక్టర్‌గా చెన్నైలో ప్రాక్టీస్ చేస్తున్నారు. చిన్న కుమార్తె భవిత ఫాషన్ టెక్నాలజీ కోర్సును చేస్తున్నారు. ఏకాంబరేశ్వరరావు పార్థివ దేహాన్ని రెండు రోజుల్లో స్వగ్రామమైన పందిళ్లపల్లికి తీసుకొని రానున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మండల జడ్‌పిటిసి బండ్ల తిరుమలాదేవి వెంకటేశ్వరరావు ఏకాంబరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మంత్రి ఆధ్వర్యంలో ర్యాలీ

ప్రజాశక్తి-అమృతలూరు

జగనన్న మా భవిష్యత్తు కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన వచ్చిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మెరుగు నాగార్జున అన్నారు. 'జగనన్న మా భవిష్యత్తు' కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి ప్రజల నుంచి అనూహ్య మద్దతు లభించిందని మంత్రి అన్నారు.

వేమూరులో..

'జగనన్న మా భవిష్యత్తు' కార్యక్రమం విజయవంతంగా ముగిసిన సందర్భంగా వేమూరులో బైక్ ర్యాలీ నిర్వహించారు. తహశీల్దారు కార్యాలయం నుంచి మెయిన్ రోడ్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్దకు ర్యాలీ జరిగింది. అనంతరం వైఎస్సార్ విగ్రహా నికి మంత్రి నాగార్జున పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో రెండు కోట్ల 8 లక్షల కోట్ల రూపాయలు సంక్షేమ పథకాల ద్వారా నేరుగా ప్రజల ఖాతాల్లో జమ చేశారని వివరించారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ గుల్లిమంత ఏడు కొండలు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గాజుల మోహన్, ఎంపీపీ ఎర్లమాటి మోహన్ రావు, అమృతలూరు ఎంపీపీ రాపర్ల నరేంద్ర కుమార్, మాజీ ఎంపీపీలు పోలిశెట్టి ప్రభాకర్‌రావు, విష్ణుమూలకల వెంకటరెడ్డి, మాజీ జడ్పిటిసి గాదె శివరామకృష్ణారెడ్డి మాజీ ఎంపీపీ ఉయ్యూరు అప్పిరెడ్డి, దాది సుబ్బారావు, పార్టీ నాయకులు చందోలు డేవిడ్ విజయకుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు గాజుల భాను ప్రకాష్, తాడికొండ శీను బాబు, సర్పంచ్ గాజుల వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రహ్మంగారి ఆరాధనోత్సవం

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన సందర్భంగా ఇంకొల్లులో బ్రహ్మం గారి జెండా ఊరేగింపు జరిగింది. ఇంకొల్లు మండలంలోని కొణికి గ్రామంలో వీరబ్రహ్మేంద్రస్వామి మాతా గోవిందమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భారీఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. 1200 మందికి అన్నదానం జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మచ్చా నాగేశ్వరరావు, నారాయణం మురళి ఆంజనేయులు, సురేష్, ఆలయ ధర్మకర్తల అనంతు రామబ్రహ్మాచారి, బండి అంజయ్య, సాంబయ్య, బండారు బ్రహ్మం, నరశింహస్వామి తదితరులు పాల్గొన్నారు.

శ్రమశక్తిని చాటే కార్మిక దినోత్సవం: గొట్టిపాటి

ప్రజాశక్తి-అద్దంకి

మేడేను పురస్కరించుకుని అద్దంకి నియోజకవర్గ ప్రజలకు, కార్మికులకు ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ చరిత్రలో పారిశ్రామికీకరణ ఆరంభం మానవ జీవన స్థాయిలో అనూహ్య మార్పులు తెచ్చిందని, మానవ శ్రమశక్తి విలువను సగర్వంగా చాటుతున్న ప్రపంచ కార్మికుల దినోత్సవాన్ని ప్రతిఒక్కరూ జరుపుకోవడం గర్వించదగ్గ విషయమని హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని లక్షలాది అసంఘటిత కార్మికులు దైనందిన పనుల్లో ప్రమాదాలకు గురవుతుండడంతో వారి కుటుంబాలకు భద్రత కరువయిందని అన్నారు. సమస్య తీవ్రతను గుర్తిస్తూ గత ముఖ్యమంత్రి చంద్రబాబు అమలులోకి తెచ్చిన చంద్రన్న బీమా పథకం కార్మిక కుటుంబాలకు అండగా నిలుస్తూ ఆర్థిక భరోసా కల్పించేదని, దానిని వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని అన్నారు. రాబోయే రోజులు కార్మిక, కర్షక, శ్రామిక వర్గాల వారికి మంచి రోజులు కావాలని ఎమ్మెల్యే గొట్టిపాటి తన ప్రకటనలో తెలిపారు.

ఆపత్కాలంలో సేవలకు

హెల్ప్‌లైన్ నెంబర్ '112'

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఆపత్కాలంలో ఎలాంటి సాయం కావాలన్నా ఒకే ఒక్క కాల్‌తో పరిష్కారం లభించేలా కేంద్ర ప్రభుత్వం ఓ సరికొత్త హెల్ప్‌లైన్ నంబర్ తీసుకొచ్చినట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. 112 నంబర్‌కు కాల్ చేసి దేశంలో ఎక్కడైనా, ఎలాంటి అత్యవసర సాయమైనా పొందవచ్చునని జిల్లా ఎస్పీ తెలిపారు. ఆదివారం జిల్లా ఎస్పీ సరికొత్త హెల్ప్‌లైన్ నంబర్‌ను 112ను గురించి వివరించారు. పాన్-ఇండియా పేరుతో పిలుస్తున్న ఆ హెల్ప్‌లైన్ నంబర్ 112 అన్నారు. తాజాగా ఈ హెల్ప్‌లైన్ పరిధిలోకి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో పాటు దేశంలోని 20 రాష్ట్రాలు వచ్చాయన్నారు. రోడ్డు ప్రమాదాలు, అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు గాయపడిన వారికి అత్యవసర సేవల కోసం 108. దాడులు, వేధింపులకు గురైనప్పుడు పోలీసులను సంప్రదించడానికి డయల్ 100. వైద్య సేవల కోసం 104కి, అగ్నిమాపక వాహనం కోసం 101, మరియు రైల్ మిత్ర 139 లాంటి వివిధ అత్యవసర సేవలకు వేర్వేరు నంబర్లు ఉండేవని, ఇలా ఒక్కో సేవ కోసం ఒక్కో హెల్ప్ నంబర్ ఉన్నాయన్నారు. ఆయా రాష్ట్రాలను బట్టి ఈ నంబర్లు మారిపోతుంటాయని, తాజాగా వీటన్నింటినీ కలిపి ఒకే నంబర్ పరిధిలోకి తీసుకొచ్చారన్నారు. అన్ని రకాల అత్యవసర సేవలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ది ఎమర్జెన్సీ రెస్పాన్స్ సపోర్ట్ సిస్టమ్ (ఈఆర్ఎస్ఎస్)ను అభివృద్ధి చేశారన్నారు. అత్యవసర సేవల కోసం సాయం కోరే వ్యక్తులు తమ ఫోన్ నుంచి 112కి డయల్ చేస్తే చాలునని, దగ్గర్లోని నెట్‌వర్క్ టవర్ ఆధారంగా ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్ (ఈఆర్‌సీ)కి అనుసంధానం అవుతుందన్నారు. ఒకవేళ స్మార్ట్ ఫోన్ అయితే జీపీఎస్‌తో మనం ఇచ్చే సమాచారం మరింత కచ్చితంగా ఉండటం వల్ల సంబంధిత అధికారులు వేగంగా స్పందించే అవకాశం ఉంటుందన్నారు. స్మార్ట్ ఫోన్లలో పవర్ బటన్‌ను మూడుసార్లు నొక్కడం ద్వారా, కీ-ప్యాడ్ మొబైల్స్‌లో 5 లేదా 9ని లాంగ్ ప్రెస్ చేయడం ద్వారా 112కి కాల్ చేసుకునే అవకాశం కల్పించనున్నారు. దీంతో ఇది మరింత సులభమవుతుంది జిల్లా ఎస్పీ తెలిపారు. మహిళలు, యువతులు విపత్కర పరిస్థితుల్లో చిక్కుకున్నా ఈ నంబరుకు ఫోన్ చేయవచ్చన్నారు.

సంక్షేమ పథకాల అమలుతో ఆర్థికాభివృద్ధి

మంత్రి ఆదిమూలపు సురేష్



ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

చిన్నారుల దగ్గర నుంచి పండు ముసలి వాళ్ల వరకు ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించి.. ఆర్థికాభివృద్ధి సాధించే దిశగా సీఎం జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని, ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. యర్రగొండపాలెం పట్టణంలోని రెండో సచివాలయం పరిధిలో ఆదివారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇళ్లు మంజూరు చేయని వారికి ఇళ్లు, ఇంటి పట్టాలు ఇవ్వని వారికి ఇంటి పట్టాలు, రెవెన్యూ పరమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. గత ఐదేళ్లలో ప్రజా సంక్షేమం పట్టని టిడిపి నాయకులు ఇప్పుడేమో అధికార దాహంతో వంచెన మాటలు చెబుతున్నారని విమర్శించారు. 40 ఏళ్ల అనుభవం అని చెప్పుకునే 420 చంద్రబాబు ఇన్నేళ్లలో ప్రజా సంక్షేమం గురించి ఎందుకు ఆలోచించలేదని ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే 'బాబు అండ్ కో' కు ప్రజలు గుర్తు వస్తారని ఎద్దేవా చేశారు. ఇలాంటి నాయకులను నమ్మి మోసపోవద్దని తెలిపారు. మంచి పాలన అందిస్తున్న మనస్సున్న జగనన్నకు అండగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ ఏఎంసి చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్, జడ్పిటిసి చేదూరి విజయభాస్కర్, వైసిపి మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, సర్పంచ్ రామావత్ అరుణాబాయి, ఎంపిడివో ఎం రంగసుబ్బ రాయుడు, పంచాయితీ కార్యదర్శి ఈదుల రాజశేఖర్‌రెడ్డి, తహశీల్దార్ కె రవీంద్రారెడ్డి, ఎస్సై జి కోటయ్య, వైసిపి నియోజకవర్గ సోషల్ మీడియా కో కన్వీనర్ షేక్ ఖాసింబాషా, నాయకులు నర్రెడ్డి వెంకటరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

2న ధర్నాను జయప్రదం చేయండి

కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి బి.రఘురామ్ పిలుపు



మాట్లాడుతున్న బి.రఘురామ్

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

1998 డీఎస్సీ క్వాలిఫై అభ్యర్థులకు నియామక పత్రాలు వెంటనే అందజేయాలని ఈ నెల రెండున కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఒంగోలులోని కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి బి.రఘురామ్ పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో కెవిపిఎస్ ఆధ్వర్యంలో 1998 డీఎస్సీ క్వాలిఫై అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జవ్వాజి రాజు, రఘురామ్ మాట్లాడుతూ ఒక్క ప్రకాశం జిల్లాలో 726 మందికి ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉండగా 165 మందికి మాత్రమే ఉద్యోగాలు ఇచ్చి అందులోనూ ఓసీలకు మాత్రమే ఇవ్వడం తెలిసి చేశారా? తెలియక చేశారా? అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వెంటనే ప్రభుత్వం మిగిలిన 561 ఉద్యోగులకు సంబంధించిన నియమాకపత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 25 సంవత్సరాల నుండి ఉద్యోగాలు వస్తున్నాయని ఎదురుచూస్తున్న ఎస్సీ, బీసీ, ఈబీసీ, వికలాంగులు, మహిళలను తీరని అన్యాయమే జరిగిందన్నారు. చంద్రన్న, రాజన్న, కిరణన్న, రోశన్న.. పోస్టులు ఇస్తామని చెప్పి మోసం చేస్తే నేడు జగనన్న ఇచ్చి కూడా సామాజిక న్యాయం పాటించకుండా భారత రాజ్యాంగానికే అర్థం లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో 1998 డియస్‌సి క్యాలిఫైడ్‌అభ్యర్థి యన్.స్టీవెన్, కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు విక్టర్, 1998 డీఎస్సీ అభ్యర్థులు టి ప్రసాద్, పి కష్ణ, ప్రసాద్, ఎఫ్సిబ, రజిని, కుమారి, విజయ, అన్నమ్మ, జీవన్ జ్యోతి, దేవ కరుణ, శ్రీనివాసులు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా స్నేహ ప్లైవుడ్ మాల్ ప్రారంభం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు నగరంలోని ఉత్తర బైపాస్ రోడ్డులోని స్నేహ ప్లైవుడ్ మాల్ ఆదివారం అట్టహాసంగా ప్రారంభమైంది. స్నేహ ప్లైవుడ్ మాల్‌ను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాస రావు ప్రారంభించారు. అనంతరం మాల్‌లోని వివిధ రకాల ప్లైవుడ్, వస్తువులను పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఒంగోలు నగరంలోని వినియోగదారుల కోసం స్నేహ ప్లైవుడ్ మాల్‌ను ఏర్పాటు చేయటం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మొట్టమొదటిసారిగా ఎలాంటి బ్రోకర్లు, కమిషన్లు వ్యవస్థ లేకుండా వినియోగదారులకు హెూల్‌సేల్, ఫిక్స్‌డ్ ధరలకు వినియోగదారులకు ప్లైవుడ్, ఇతర వస్తువులను అందించటం జరుగుతుందన్నారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని స్నేహ ప్లైవుడ్ మాల్ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. స్నేహ ప్లైవుడ్ మాల్‌ను ఏర్పాటు చేసిన అధినేతలు బత్తుల ముసలా రెడ్డి, బత్తుల ఆజాద్‌ను వి.శ్రీనివాసరావు అభినందించారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర నాయకులు పూనాటి ఆంజనేయులు, వై.సిద్ధయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి.కొండారెడ్డి, ఎస్‌కె.మాబు, పెంట్యాల హనుమంతరావు, జన విజ్ఞానవేదిక నాయకులు పుల్లారావు, నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు, కొల్లా మధు, సిసికెఆర్ లక్ష్మణకుమార్ రెడ్డి, ఎంపిపి మల్లికార్జునరెడ్డి, బత్తుల ముసలా రెడ్డి, సుందరయ్య, ఆజాద్ పాల్గొన్నారు.



స్నేహ ప్లైవుడ్ మాల్‌నుప్రారంభిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-పిసిపల్లి

1988-89 సంవత్సరం 10వ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఉల్లాసంగా, ఉత్సాహంగా జరిగింది. స్థానిక జడ్‌పి హైస్కూల్‌లో వారి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు నైతిక విలువల గురించి, సామాజిక చైతన్యం గురించి నేర్పిన పాఠాలను గుర్తు చేసుకున్నారు. ఈ పూర్వ విద్యార్థులలో మాజీ ఆర్‌జెడి పద్మ చిన్నతనంలో మాదిరిగానే ప్రస్తుతం కూడా వ్యవహరించడం అభినందనీయమన్నారు. ఈ విధంగా పూర్వ విద్యార్థులందరూ కలిసి వారి వారి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. సహచర విద్యార్థులకు అవసరమైనప్పుడు తప్పకుండా ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కంచర్ల రామారావు, ముసలయ్య, రమణయ్య, పద్మావతి, వనజ, నాగకుమారి, రామయ్య, బ్రహ్మయ్య, కనపర్తి మాల్యాద్రి, మోహన్‌రావు, వీరనారాయణ, ప్రసాద్ తదితరులు తమ తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

ఆటోవాలాకు పూట గడిచేదెలా..?

- పెరిగిన ఇంధనం ధరలు
- అనారోగ్యానికి గురవుతున్న డ్రైవర్లు
- తప్పని అధికారుల వేధింపులు



ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రోజంతా కష్టపడితే ఖర్చులు పోనూ సాయంత్రానికి మిగిలేది రూ.200 నుంచి రూ. 300 మాత్రమే, పెరిగిన ఇంధన, నిత్యావసర ధరలతో మరింత పేదరికానికి గురవుతున్నామని ఆటో డ్రైవర్లు వాపోతున్నారు. రోడ్లపై నిరంతరం డ్రైవింగ్ చేయడం వల్ల రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు అప్పుడప్పుడు ఆర్‌టిఎ, పోలీసులు అధికారులు వేధింపులతో జీవన పరిస్థితి మరింత కష్టమవుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

యర్రగొండపాలెం మండల పరిధిలో దాదాపు 250 మంది ఆటో డ్రైవర్లు ఉన్నారు. తెల్లవారుజాము నుంచే ఆటో నడిపితేగానీ కుటుంబం గడవని పరిస్థితి. ఉదయం 6 గంటల నుండి ఆటో అడ్డాల మీదకు వస్తే రాత్రి 8 గంటల వరకు అక్కడే గడపాల్సి వస్తోందని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజ ఒక ఆటోలో ప్రయాణికులను బట్టి 1 నుంచి 5 వరకు ట్రిప్పులు తిరుగుతారు. ఖర్చులు పోనూ రోజుకు రూ.200 నుంచి రూ.300 మిగులుతుందంటున్నారు. ఈ డబ్బుతో కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలో తెలియడంలేదని వారు ఆందోళన చెందుతున్నారు. ఆటోను బాడుగకు తీసుకుని నడిపే వారి పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. ఆటో యజమానికి రోజుకు అద్దె కచ్చితంగా ఇచ్చి తీరాల్సిందే.

పెరిగిన ధరలతో ఇబ్బందులు

ఆలిశెట్టి వెంకటసుబ్బయ్య, ఆటో డ్రైవర్



పెరిగిన ధరలతో ఆటో నడిపే పరిస్థితి లేదు. రోజు వచ్చే డబ్బులతో ఇల్లు గడవడం కూడా కష్టంగా ఉంది. ఆటో నెలవారి కంతులు చెల్లించాలంటే అప్పులు చేయాల్సి వస్తోంది. పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం వల్ల పూట గడవడం గగనమైంది. పిల్లలను పాఠశాలలో చదివించుకునే పరిస్థితి లేదు. ప్రభుత్వం రుణాలిచ్చి ఆదుకోవాలి.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

డికెఎం.రఫీ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు



పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలి. వాటిని జిఎస్‌టి పరిధిలోకి తీసుకురావాలి. ఆటో డ్రైవర్ల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి. ఆటో కార్మికు లకు రుణ సౌకర్యం కల్పించి, ఆటోలు ఇప్పించాలి. ప్రమాద బీమా సౌకర్యాన్ని ప్రభుత్వమే కల్పించాలి. నాన్ ట్రాన్స్‌పోర్టు వాహనాలపై పోలీసులు, ఆర్‌టిఎ అధికారులు భారీ జరిమానాలు వసూలు చేయకుండా చూడాలి.

రుణ సౌకర్యం కల్పించాలి

బుడిగెపోగు యోబు, ఆటో డ్రైవర్



రుణ సౌకర్యం కల్పించి ఆటో ఇప్పించాలి. ఇఎస్ఐ కార్డులు ఇవ్వాలి. ఆర్‌టిఎ, పోలీసులు అధికారులు వేధింపులు ఆపాలి. 50 ఏళ్లు నిండిన వారికి పింఛను ఇవ్వాలి. ఉచిత బీమా సౌకర్యం కల్పించాలి. ప్రమాద బీమా వర్తింపజేయాలి. ఉచితంగా లైసెన్స్ ఇవ్వాలి.

నేడు మంత్రి సురేష్ దోర్నాల రాక

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

రాష్ట్ర పురపాలక, పట్టణాభివద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ సోమవారం పెద్దదోర్నాల వస్తున్నారు. ఉదయం 10 గంటలకు దోర్నాలలో నిర్మించిన ఐసిడిఎస్ కార్యాలయాన్ని మంత్రి ప్రారంభిస్తారని ఎంపిడిఒ నాసర్‌రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంటకు చిన్న దోర్నాల గ్రామంలో జరిగే కార్యక్రమానికి హాజరవుతారని వైసిపి మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి చెప్పారు. మధ్యాహ్నం మూడు గంటలకు దోర్నాల-3 సచివాలయం పరిధిలో నిర్వహిస్తున్న గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని ఆయన తెలిపారు.

నేడు మార్కాపురంలో ప్రత్యేక 'స్పందన'

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

మార్కాపురంలో జిల్లా కలెక్టర్ దినేష్ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహాశీల్దారు హరిబాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్పందన కార్యక్రమాన్ని మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి మండలాల ప్రజలందరూ వినియోగించుకోవాలని ఆయన కోరారు. ప్రజలు తమ సమస్యలు అర్జీల రూపంలో అందజేసి పరిష్కరించు కోలవాని ఆయన కోరారు.

నూతన కమిటీ ఎన్నిక

ఒంగోలు క్రైం : స్థానిక అంబేద్కర్ భవన్‌లో ఎపి గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా కమిటీకి ఆదివారం ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారులుగా ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరావు, బి.గోపాల కృష్ణ వ్యవహరించారు. ఎన్నికలలో పోటి లేకపోవడంతో ఏకగ్రీవం అయ్యాయి. జిల్లా అధ్యక్షుడిగా పిఆర్ఎస్.శర్మ (వి.రాము) ప్రధాన కార్యదర్శిగా వైపి.రంగయ్య ఎన్నికయ్యారు. మరో 24 మందిని కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు, అన్ని మండలాల అధ్యక్ష,కార్యదర్శులు, విఆర్ఒలు పాల్గొన్నారు.

సుధీర్‌కుమార్ ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-చీమకుర్తి



పూజలు నిర్వహిస్తున్న సుధీర్

వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక హరి హర క్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎపి చాంబర్ ఆఫ్ కామర్స్ డైరక్టర్ శిద్దా సుధీర్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పూజలు, కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

కార్మిక సంఘం నిర్మిద్దాం...

రండి కదలిరండీ- రండీ కలసిరండీ
కదలి రండీ మీరంతా- తరలిరండీ ఊరంతా..
కార్మిక సంఘం నిర్మిద్దాం- శ్రామిక రాజ్యం స్థాపిద్దాం..
కులం పేరుతో విడదీసే-మతం పేరుతో విభజించే..
మతోన్మాదుల రాజ్యంలో-
కార్మికుల హక్కుల కోసం-శ్రామికుల రక్షణ కోసం..
అదానీలకు అండగా-అంబానీలకు తోడుగా
శ్రామికశక్తిని దోచుకునే-ప్రజలసంపదను లూటీ చేసే
కార్పోరేట్లను ఎదిరించేందుకు..
భూమిని భుక్తిని కాజేసే- చెట్లను చేమను నరికేసే
భూబకాసురలను తరిమేందుకు
రైతాంగానికి బాసటగా-అన్నదాతకు అండగా
అరుణపతాకం చేబూని -విప్లవశంఖం పూరిద్దాం..

ఎఎస్.రాజు
ఒంగోలు
9515136465

ఐసిడిఎస్ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-టంగుటూరు



సిడిపిఒతో మాట్లాడుతున్న వరికూటి అశోక్ బాబు

కొండపి నియోజకవర్గంలోని అంగన్‌వాడీ అధికారులు, సిబ్బంది పనితీరును సులభతరం చేసేందుకే ఒంగోలు రూరల్ పరిధిలోని ఐసిడిఎస్ కార్యాలయాన్ని టంగుటూరులో ఏర్పాటు చేసినట్లు వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు తెలిపారు. స్థానిక కొండపి రోడ్డు ఏర్పాటు చేసిన టంగుటూరు ప్రాజెక్టు సిడిపిఒ కార్యాలయాన్ని అశోక్‌బాబు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ టంగుటూరు, శింగరాయకొండ, జరుగుమల్లి మండలాల పరిధిలోని దాదాపు 215 అంగన్ వాడీ కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. ఇక నుంచి వాటి పనితీరును టంగుటూరులో ఏర్పాటు చేసిన కార్యాలయం నుంచి పర్యవేక్షిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ సిహెచ్.మల్లేశ్వరి, సూపర్ వైజర్లు షేక్ సైదాబీ, ఆర్.సత్యవతి, పి.భారతి, రమాదేవి, ఎల్.విజయ, నాగలక్ష్మి, ఎస్‌కె.రిజ్వానా, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

'బ్లూ బగ్గింగ్' పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రకాశం జిల్లా ఎస్‌పి మల్లిక గర్గ్

ప్రజాశక్తి - ఒంగోలు క్రైం



మాట్లాడుతున్న ఎస్‌పి మల్లికగర్గ్

బ్లూ బగ్గింగ్ సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌పి మల్లికగర్గ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పరిచయం లేని వ్యక్తులు ఇచ్చే బ్లూ టూత్ పెయర్ రిక్వేస్ట్‌ను ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించవద్దని ఆమె సూచించారు. బహిరంగ ప్రాంతాలలో ఉచిత వైఫైని వినిగించరాదని తెలిపారు. సైబర్ నేరగాళ్లు పది మీటర్ల దూరం నుంచి బ్లూటూత్ హట్‌స్పాట్ ద్వారా పెయిర్ రిక్వేస్ట్ పంపుతారని తెలిపారు. చూసుకోకుండా ఓకే బటన్ క్లిక్ చేస్తే నేరగాళ్ళు మన ఫోన్‌ను కనెక్ట్ అయి వెంటనే మార్వెల్‌తో పాటు ప్రత్యక్షంగా తయారు చేసుకున్న ప్రోగ్రామ్‌ను మన ఫోన్‌లోకి పంపుతారని తెలిపారు. అక్కడ నుంచి మన ఫోన్ ఆపరేటింగ్ పూర్తిగా వారి చేతిలోకి వెళ్లిపోతుందని తెలిపారు. ఫోన్ లోని ఫొటోలు, ఇతర ముఖ్యమైన డేటాను దొంగిలించి డబ్బుల కోసం బ్లాక్‌మెయిల్ చేస్తారని తెలిపారు. ఇలాంటి నేరగాళ్ల బారిన పడకుండా ఉండాలంటే బహిరంగ ప్రదేశాల్లో ఉన్నప్పుడు అవసరమైతే తప్ప బ్లూటూత్ ఆఫ్ చేయాలన్నారు. రద్దీగా ఉన్న ప్రదేశాల్లో వైఫై, హట్‌స్పాట్ ఉపయోగించకుండా ఉంటే మంచిదని తెలిపారు. పరిచయం లేని వ్యక్తుల నుంచి వచ్చే పెయిర్ రిక్వేస్ట్‌ను ఎట్టిపరిస్ధితుల్లోనూ అంగీకరించకూడదని తెలిపారు. డేటాలోని హెచ్చు తగ్గులను గమనిస్తు ఉండాలన్నారు. ఎవరైనా బ్లూబగ్గింగ్ మోసానికి గురైతే వెంటనే దగ్గర్లో ఉన్న పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలన్నారు. లేదా సైబర్ హెల్ప్‌లైన్ నం 1930కు కాల్ చేయాలన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న వెన్నా కాశిరెడ్డి

సొసైటీ అధ్యక్షుడిగా కాశిరెడ్డి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాల సొసైటీ అధ్యక్షుడిగా వెన్నా కాశిరెడ్డి ఆదివారం బాధ్యతలు చేపట్టారు. కాశిరెడ్డి చేత సొసైటీ కార్యదర్శి కాశిరెడ్డి, గురువారావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు వెన్నా కాశిరెడ్డి మాట్లాడుతూ సొసైటీ ద్వారా రైతులకు పంట రుణాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. రైతులు పండించిన పంటలను సొసైటీ ద్వారా విక్రయించుకునేలా చర్యలు తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దదోర్నాల సర్పంచి చిత్తూరి హారిక, వైసిపి మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి, మాజీ ఎంపిపి జోగి వెంకట నారాయణ, సర్పంచి ఎక్కంటి వెంకటేశ్వరరెడ్డి, నాయకులు అల్లు ఆంజనేయరెడ్డి, భూపాల్‌రెడ్డి, గాలెయ్య, షేక్ అబ్దుల్ మజీద్, ఒంటేరు నాగేశ్వరరావు, రమణ పాల్గొన్నారు.

తహాశీల్దారుకు సన్మానం

ప్రజాశక్తి-మర్రిపూడి

మర్రిపూడి తహాశీల్దారుగా జగదీశ్వరరావు బాధ్యతలు చేపట్టారు. అందులో భాగంగా మండల నాయకులు తహాశీల్దారును ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మండలంలోని సమస్యల గురించి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన తహాశీల్దారు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తహాశీల్దారును కలిసిన వారిలో చిమట సొసైటీ మాజీ అధ్యక్షుడు మొల్లల శివరామిరెడ్డి, వైసిపి యూత్ మండల అధ్యక్షులు వనిపెంట మల్లికార్జునరెడ్డి, కూచిపూడి మాజీ సర్పంచి బాలచెన్నారెడ్డి, కాకర్ల సర్పంచి మేళం శివన్నారాయణ, నాయకులు వాకమళ్ల రమణారెడ్డి, బెల్లం వెంకటరెడ్డి, ఉస్తేలమూరి చెన్నారెడ్డి, మాచేపల్లి కోటేష్ తదితరులు ఉన్నారు.

అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

- ఎక్సైజ్ పోలీసుల తీరుపట్ల

మంత్రి సురేష్ ఆగ్రహం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను రాష్ట్ర పురపాలక, పట్టణాభివద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తనిఖీ చేశారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆ ప్రాంతానికి వెళ్లిన మంత్రి సురేష్ స్టేషన్ లోపలికి వెళ్లి పరిశీలించారు. ఆ సమయంలో సిబ్బంది ఎవరు అందుబాటులో లేకపోవడాన్ని గుర్తించారు. కొందరు హాజరు పట్టికలో సంతకాలు చేసి వెళ్లిపోగా, కొందరు మూడు నాలుగు నెలల పాటు సంతకాలు కూడా చేయకుండా ఉన్న వైనాన్ని మంత్రి గుర్తించారు. మంత్రి సురేష్ తనిఖీ చేసిన



రికార్డులను తనిఖీ చేస్తున్న మంత్రి సురేష్

సమయంలో కేవలం ఒక కానిస్టేబుల్ మాత్రమే అందుబాటులో ఉన్నారు. మంత్రి తనిఖీ విషయం తెలుసుకొని హడావుడిగా సిఐ అక్కడికి చేరుకున్నారు. అలసత్వం వహిస్తూ ఇష్టానుసారంగా ఉద్యోగాలు నిర్వర్తిస్తున్న అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవని మంత్రి సురేష్ హెచ్చరించారు. ఇక్కడి పరిస్థితిపై ఉన్నతాధికారులకు తెలియజేస్తానని మంత్రి చెప్పారు. హాజరు పట్టికలో స్టేట్‌మెంట్ రికార్డు చేసి అధికారులు, సిబ్బంది వివరణ ఇవ్వాలని ఆదేశించారు. మంత్రి వెంట ఎఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్, జడ్‌పిటిసి చేదూరి విజయభాస్కర్, వైసిపి మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, సర్పంచి రామావత్ అరుణాబాయి, ఎంపిడిఒ ఎం రంగసుబ్బ రాయుడు, పంచాయతీ కార్యదర్శి ఈదుల రాజశేఖర్‌రెడ్డి, ఇన్‌ఛార్జి తహశీల్దారు దాసు, ఎస్ఐ కోటయ్య, పుల్లల చెరువు ఎస్ఐ శ్రీహరి, వైసిపి నియోజకవర్గ సోషల్ మీడియా కో కన్వీనర్ షేక్ ఖాసింబాషా తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న మంత్రి సురేష్

మంత్రి సురేష్ ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పంచాయతీ పరిధిలోని పందివానిపల్లిలో సీతా లక్ష్మణ హనుమత్ సమేత శ్రీ పట్టాభి రామ చంద్రుల స్వామి జీవధ్వజ, శిఖర కల, శభాక్తాంజనేయస్వామి సహిత చతుర్భిక్షుగమిళ, నాభిశిల(బొడ్డురాయి), సీతాలంబ మరియు పోతురాజు స్వామి సహిత శ్రీ పోలేరమ్మ నూతన విగ్రహ ప్రతిష్ట మహా కుంభాభిషేక మహోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ వేడుకల్లో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహాల మహోత్సవ వేడుకలు నిర్వహించిన కమిటీ సభ్యులను అభినందించారు. అనంతరం మంత్రి సురేష్‌ను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్, వైసిపి మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, సర్పంచులు రామావత్ అరుణాబాయి, దుగ్గెంపూడి సుబ్బారెడ్డి, నాయకులు గోపు వెంకటరెడ్డి, పోతిరెడ్డి వెంకటరెడ్డి, దగ్గుల కాశిరెడ్డి, వైసిపి సోషల్ మీడియా కో కన్వీనర్ షేక్ ఖాసింబాషా పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-మద్దిపాడు

పాలకేంద్రం మాజీ అధ్యక్షుడు ఉప్పుగుండూరి లక్ష్మినారాయణ జ్ఞాపకార్థం వారి కుమారుడు, మాజీ సర్పంచి నాగేశ్వరరావు చలివేంద్రం ఏర్పాటు చేశాడు. ఈ చలివేంద్రాన్ని మాజీ ఎమ్మెల్యే బిఎన్. విజయ కుమార్ ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షుడు కడియాల రఘు బాబు, ఎస్‌సి సెల్ అధ్యక్షుడు, ప్రభాకరరావు, బిసి సెల్ అధ్యక్షుడు అనిల్‌కమార్, ఎంపిటిసి భవాని తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అశోక్‌బాబు

పేదల సంక్షేమమే ధ్యేయం

వరికూటి అశోక్‌బాబు

ప్రజాశక్తి-మర్రిపూడి

పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నట్లు వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు తెలిపారు. మండల పరిధిలోని కాకర్ల, శివరాయునిపేట గ్రామాలలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో ప్రతి పేదవానికి లబ్ధి చేకూరిందని తెలిపారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఎన్ని కుయితులు పన్నినా ఎన్నికల్లో గెలవలేరని ఎద్దేవ చేశారు. టిడిపి ప్రభుత్వ హయాంలో జన్మభూమి, నీరు-చెట్టు కార్యక్రమాల పేరుతో ప్రజల సొమ్మును దోచుకున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో చిమట సొసైటీ మాజీ అధ్యక్షుడు మొల్లల శివరామిరెడ్డి, వైసిపి మండల నాయకులు బోగసముద్రం విజయభాస్కర్‌రెడ్డి, దద్దాల మల్లికార్జున, కాకర్ల గ్రామ సర్పంచి మేళం శివన్నారాయణ, సుబ్బారెడ్డి, రామిరెడ్డి, ఉలవపల్లి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

విజయవాడ డిప్యూటీ కలెక్టర్ మురళి

ప్రజాశక్తి-కొండపి

ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని విజయవాడ డిప్యూటీ కలెక్టర్ ఇ.మురళి తెలిపారు. మండల పరిధిలోని పెరిదేపి గ్రామంలో భగత్ సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ఎదో ఒక అనారోగ్య సమస్యలో బాధపడుతుంటారని తెలిపారు. అలాంటి వారు ఈ వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకొని ఆరోగ్యం జీవివచ్చునని తెలిపారు. కొండపి తహశీల్దారుగా చేసేటప్పుడే పెరిదేపి గ్రామమంటే తనకు ఎంతో ఇష్టమని తెలిపారు. ఆ గ్రామ ప్రజలు కమ్యూనిజం భావాలు కలిగిఉన్నవారిని తెలిపారు. ఒంగోలు శ్రీరామ్‌మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ పెరిదేపి గ్రామంలో ఉండేవారంతా తనతో చాలా సన్నిహితంగా ఉంటారని అన్నారు. ఈ సందర్భంగా 520 మందికి వైద్యపరీక్షలు



మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ మురళి

నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతి నర్సింగ్ హోం వైద్యుడు డాక్టర్ బి.హరిబాబు, శ్రీరామ్ సూపర్ స్పెషాలిటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ చాపల శాంతకుమారి, డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ నాగిడి కుమార్‌వర్మ, డాక్టర్ సానల ధీరజ్‌బాబు, డాక్టర్ సున్నపు విజయ్‌కుమార్, డాక్టర్ సున్నపు నవీన, డాక్టర్ పొక్కిన ఏడుకొండలు పాల్గొన్నారు.

చలివేంద్ర ప్రారంభం

భగత్‌సింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెరిదేపి గ్రామంలోని బస్టాప్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఒంగోలు శ్రీరామ్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ వంశీకృష్ణ ప్రారంభించారు. తొలుత ముప్పరాజు శేషయ్య స్తూపం వద్ద శేషయ్య చిత్రపటానికి మాజీ సర్పంచి గుమ్మళ్ల వెంకటేశ్వర్లు నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర నాయకుడు అంద్ర మాల్యాద్రి, భగత్‌సింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యుడు తాళ్లూరి ప్రభుదాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు , వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కెజి.మస్తాన్,సిపిఎం నాయకులు మల్లెల కొండయ్య, అంగలకుర్తి జాబుల్, మల్లెల చిన్నపేతురు, అంగలకుర్తి బ్రహ్మయ్య, అంగలకుర్తి పెద్దపాలు, ఇనకొల్లు నరశింగరావు, అంగలకుర్తి సురేష్, థామస్, తాళ్లూరి బ్రహ్మయ్య, అంద్ర నరశింగరావు, ప్రభుదాస్, లక్కెపోగు పెద్ద లక్ష్మయ్య, అశోక్, వేములపాటి సురేష్, కాకర్ల మాబు, కాలే శేషరావు, మల్లెల ప్రభుదాస్, అశోక్, లక్కెపోగు ఆశీర్వాదం పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో 'పద్మ పూజిత'

ప్రజాశక్తి - ఒంగోలు

ఫైనాన్స్ వ్యాపారంలోనే కాదు ప్రజాహిత కార్యక్రమాల నిర్వహణలో పద్మ పూజిత ఆటో ఫైనాన్స్ సంస్థ పేరు గడించింది. పదేళ్ల స్థానికంగా క్రితం నెలకొల్పిన ఈ సంస్థ అనతికాలం లోనే అనూ హ్యమైన ప్రగతి సాధించింది. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఆర్‌ఎస్‌విపి. బసవరాజు మేనేజింగ్ డైరెక్టర్‌గా 2013లో ఒంగోలు నార్త్ బైపాస్ రోడ్ లో ఈసంస్థను స్థాపించారు. సెకండ్ హేండ్ ద్విచక్ర వాహనాల కొనుగోలుకు ఈ సంస్థ ఫైనాన్స్ చేస్తుంది. నేరుగా డీలర్ నుంచి కొనుగోలు చేసి కస్టమర్‌కు అందిం చడం ఈ సంస్థ పని. దీనికిసంబంధించి కస్టమర్‌కు షరతులతో కూడిన రుణం మంజూరు చేస్తారు. ఒంగోలు కేంద్రంగా చీరాల, కావలి పరిధిలో సమారు ఐదువేల మంది ఖాతాదారులకు సేవలందిస్తున్నారు. ఇక్కడ దాదాపు 110 కుటుంబాలకు ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు కల్పించారు. ఈ సంస్థ పరిధిలో పనిచేస్తున్నవారు అందరూ స్థానికులే. కేవలం వ్యపాం ^వ్యవహారాలకే పరిమితం కాకుండా ప్రతి ఏటా పద్మపూజిత ఫౌండేషన్ పేరుతో పలు ప్రజాహిత కార్యక్ర



రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దశ్యం

^మాలను నిర్వహించడంలో ముందుంటారు. ఏటా రక్తదాన శిబిరం నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాది ఏప్రిల్ 12న రెడ్ క్రాస్ సంస్థ నిర్వహించిన రక్తదాన శిబిరంలో సిబ్బంది పాల్గొన్నారు. వ్యాపార అంశాల్లో అమ్మకందారు నుంచి కొనుగోలుదారు అనే సంబంధం కొన సాగించడం వల్ల ఖాతాదారుల విశ్వాసాన్ని చూరగొంటున్నట్లు డివిజనల్ మేనేజర్ ఎం.రవికుమార్ చెప్పారు. నాణ్యమైన వాహనాలను అందించటం వల్ల ప్రమాణాలు పాటించడం వల్ల మధ్యతరగతి వర్గాలనుంచి మంచి ఆదరణ లభిస్తోందని రవికుమార్ తెలిపారు.



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

బిజెపి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా

పోరాటాలకు సిద్ధం కావాలి : సిపిఎం

కంభంరూరల్ : కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధా నాలకు వ్యతిరేకంగా ప్రజలు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఎం జిల్లా నాయకుడు తోట తిరుపతిరావు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 14 నుంచి సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచారభేరి కార్యక్రమంలో ఆదివారం తో ముగి సింది. ఈ సందర్భంగా నాయకులు కరపత్ర ప్రచారం నిర్వహించారు. అనంతరం సిపిఎం జిల్లా నాయకుడు తోట తిరుపతిరావు మాట్లాడుతూ ప్రజల త్యాగాలతో సాధించుకున్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రధాని మోడీ అంబానీ లకు అడ్డగోలుగా కట్టబెడుతున్నాడని విమ ర్శించారు. కార్మికుల హక్కులను కాలరాసినట్లు తెలిపారు., ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చినట్లు తెలిపారు. అన్న దాతల వెన్ను విరిచి ప్రజా హక్కులు పాతిపెట్టి నియం తత్వ పాలన సాగిస్తున్నరని ఆరోపిం చారు. పెట్రోలు డీజిల్ గ్యాస్ ధర లను రోజు రోజుకు పెంచి ప్రజలపై భారాలు మోపుతున్నారని విమర్శిం చారు. కార్యక్రమంలో నాయకులు సిపిఎం నాయకులు పాల్గొన్నారు

క్రీడల్లో మెరికలు..పాకల విద్యార్థులు



మాట్లాడుతున్న డాక్టర్ బి. హరిబాబు

ప్రజల కోసమే మానవత స్వచ్ఛంద సంస్థ
డాక్టర్ బి. హరిబాబు

ప్రజాశక్తి -శింగరాయకొండ

ప్రజల కోసం మానవత స్వచ్ఛంద సంస్థ పనిచేస్తుందని ప్రముఖ వైద్యులు, జనవిజ్ఞాన వేదిక నాయకుడు డాక్టర్ బి.హరిబాబు తెలిపారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శింగరాయకొండ వార్డు సభ్యుడు గంజి సుబ్బారావు తన కుమారుడు గంజి నాగరాజు జ్ఞాపకార్థకంగా బాలాజీ నగర్ వద్ద ఫ్రెషర్ బాక్సులు పెట్టుకునేందుకు మానవతా స్వచ్ఛంద సంస్థకు మూడు సెంట్లు స్థలాన్ని ఉచితంగా అందజేశారు. అక్కడ నిర్మించిన షెడ్డును గంజి సుబ్బారావు ఆదదివారం ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో. మానవతా ప్రకాశం జిల్లా కేంద్ర నియంత్రణ కమిటీ డైరెక్టర్ కల్లూరి రామిరెడ్డి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా మానవత స్వచ్ఛంద సంస్థను విస్తతం చేయనున్నట్లు తెలిపారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ బి.హరిబాబు మాట్లాడుతూ మానవత సంస్థ సేవల గురించి వివరించారు. సంస్థలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరినీ అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ జిల్లా కమిటీ అధ్యక్షుడు సోమిశెట్టి శ్రీనివాసులు, జెట్టి సూర్య చంద్రశేఖర్ రెడ్డి, కోటపాటి నారాయణ, మహంకాళి నరసింహారావు , మందలపు బాబూరావు పాల్గొన్నారు.



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

నీటికోసం రోడ్డెక్కిన మహిళలు

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని గార్లపేటరోడ్డులో నీటి ఎద్దడి నెలకొంది. దీంతో ప్రజలు నీటి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత్యంతర లేక మహిళలు నీటి కోసం ఆదివారం రెడ్డెక్కారు. ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ గత పదిరోజులుగా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా జరగడం లేదన్నారు. దీంతో నీటి కోసం అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. గత్యంతరం లేక రోడ్డెక్కినట్లు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

విశ్రాంత ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి- సంతనూతలపాడురూరల్



వెంకటేశ్వరరావు(ఫైల్)

మండల పరిధిలోని కామేపల్లి వారి పాలెం గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు ఇస్తర్ల వెంకటేశ్వరరావు (83) వయో భారంతో ఆదివారం మృతిచెందాడు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. వెంకటేశ్వర్లు మృతదేహానిన పలువురు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు

హెల్మెట్ తప్పనిసరి : ఎస్ఐ

మద్దిపాడు: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ బి. శ్రీకాంత్ తెలిపాడు. 16వ నంబరు జాతీయరహదారిపై ఆదివారం వాహన తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించని వాహనచోదకులను గుర్తించి వారికి అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించే ఉపయోగాల గురించి వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

- రాష్ట్రస్థాయి పోటీల్లో రాణిస్తున్న వైనం
- జాతీయ స్థాయి పోటీలే లక్ష్యంగా సాధన

ప్రజాశక్తి -శింగరాయకొండ

వారంతా పేదింటి విద్యార్థులు. గంగపుత్రులు. ఖాళీ దొరికితే ఏదో ఒక ఆట ఆడాల్సిందే. శింగరాయకొండ మండలం పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఈ విద్యార్థులు క్రీడా సంస్కతిని పుణికి పుచ్చుకున్న పేదింటి కుసుమాలు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు పిల్లి హజరత్తయ్య వారిని అన్ని విధాలుగా ప్రోత్సహిస్తూ ఆటల్లో తర్ఫీదు నిస్తున్నారు. దీంతో వారు వాలీబాల్, కబడ్డీ ,అథ్లెటిక్స్ క్రీడలలో జాతీయ, రాష్ట్ర స్థాయిలో రాణిస్తూ తమ సత్తా చాటుతున్నారు. విద్యతోపాటు ఆటలపై కూడా శ్రద్ధ చూపుతూ ముందుకు పోతున్నారు. మండల స్థాయి, జిల్లా స్థాయి. రాష్ట్రస్థాయి , జాతీయస్థాయి క్రీడల్లో రాణించిన పాకల విద్యార్థుల ప్రస్థానం పరిశీలిస్తే ఇలా ఉంది.



కబడీ ఆడుతున్న విద్యార్థులు

మంచి క్రీడాకారులను తయారు చేస్తా

కుమారి విజయలక్ష్మి, కబడ్డీ క్రీడాకారిణి



పోతయ్య గారి పట్టపుపాలెంనకు చెందిన కుమారి విజయలక్ష్మి కబడ్డీలో రాష్ట్రస్థాయిలో రాణిస్తుంది. 2022లో స్కూల్ గేమ్స్ అండర్ - 17 కబడ్డీ బాలికల విభాగంలో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభను కనబరిచింది. జాతీయ స్థాయిలో రాణించడమే లక్ష్యంగా సాధన చేస్తుంది. భవిష్యత్తులో వ్యాయామ ఉపాధ్యాయురాలై మరింత మంది క్రీడాకారులను తయారు చేయాలనే సంకల్పంతో తాను ముందుకు సాగుతున్నట్లు విజయలక్ష్మి చెబుతోంది.

సబ్ ఇన్‌స్పెక్టర్ కావాలన్నదే లక్ష్యం

కొక్కిలిగడ్డ నందిని, కబడ్డీ క్రీడాకారిణి



పాకల పల్లెపాలెంకు చెందిన నందిని కబడ్డీలో రెండు సార్లు జాతీయ స్థాయిలో పాల్గొని రాణించింది. సబ్ జూనియర్ కబడ్డీ 2021లో జాతీయ స్థాయిలో ఉత్తరాఖండ్‌లో , 2022లో జాతీయ స్థాయిలో జార్ఖండ్ లోని బొకోరో స్టీల్ సిటీలో ఆంధ్రప్రదేశ్ తరుపున పాల్గొని సత్తా చాటింది. సబ్ ఇన్‌స్పెక్టర్ ఎంపికై సమాజ సేవ చేయాలన్నదే తన ఆశయమని నందిని చెబుతోంది.

విద్యార్థులు క్రీడల్లో రాణిస్తున్నారు

కె. శివాజీ ప్రధానోపాధ్యాయుడు, పాకల



విద్యార్థులు మొదటి నుంచి క్రీడలలో రాణిస్తున్నారు. చక్కటి ఆట స్థలం అందుబాటులో ఉంది.. క్రీడల ఖిల్లాగా పాకల వెలుగొందుతుండడం ఎంతో ఆనందాన్నిస్తుంది. ఇదే స్ఫూర్తితో ముందుకెళ్తాం.

శక్తి వంచన లేకుండా కృషి

పిల్లి హజరత్తయ్య, పిఇటి పాకల



వాలీబాల్, కబడ్డీ, అథ్లెటిక్స్ వంటి క్రీడల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నా. 2021- 22 సంవత్సరంలో పాకల పాఠశాల స్పోర్ట్స్ అఫ్ ఎక్సెన్స్ అవార్డును గెల్చుకున్నది. 2022 - 23 లో పాఠశాలకు చెందిన ఇద్దరు జాతీయ స్థాయి, 15 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. విద్యార్థులను అంతర్జాతీయ క్రీడాకారులను తయారు చేయాలనే ఉద్దేశంతో నిరంతరం శ్రమిస్తున్నా.

పోలీసు అధికారి కావాలన్నదే ఆశయం

రేణుమాల రాకేష్, వాలీబాల్ క్రీడా కారుడు



పాకల ఆది ఆంధ్ర కాలనీకి చెందిన రేణుమాల రాకేష్ 9వ తరగతి చదువుతున్నాడు. రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో రాణిస్తున్నాడు. 2022 స్కూల్ గేమ్స్ అండర్ - 14 విభాగంలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలలో నైపుణ్యం కనబరిచాడు . వాలీబాల్‌లో మంచి అటాకర్ గా ఎదగాలనే లక్ష్యంతో శిక్షణ పొందుతున్నాడు. పోలీసు అధికారి కావాలన్నదే తన ఆశయమని రాకేష్ చెబుతున్నాడు.

జాతీయ జట్టుకు ప్రాతినిధ్య వహిస్తా..

కుర్రు త్రిగుణ, కబడ్డీ క్రీడా కారిణి



చెల్లెమ్మ గారి పాలెంకు చెందిన కుర్రు త్రిగుణ పాకల పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ఈ పాటికే రాష్ట్ర స్థాయి కబడ్డీ క్రీడాకారిణిగా పేరు తెచ్చుకుంది. 2022లో సబ్ జూనియర్ జాతీయ స్థాయి కబడ్డీ ప్రాబబుల్స్ జట్టుకి ఎంపికై సత్తా చాటింది. జాతీయ స్థాయి మహిళా జట్టుకు ప్రాతినిధ్య వహించాలనే లక్ష్యంతో శిక్షణ పొందుతుంది. భవిష్యత్తులో పోలీస్ ఆఫీసర్ కావాలన్నదే తన ఆశయమని త్రిగుణ చెబుతోంది.

ప్రజాసేవే లక్ష్యం

వాటుపలి శ్రీను,వాలీబాల్ క్రీడా కారుడు



పాకలపల్లెపాలెంకు చెందిన వాటుపలి శ్రీను పదో తరగతి చదువుతున్నాడు. రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలలో సత్తా చాటుతున్నాడు. 2022 స్కూల్ గేమ్స్ అండర్ - 17 బాలుర విభాగం రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలలో పాల్గొని ప్రతిభ చూపాడు. వాలీబాల్ లో జాతీయ స్థాయిలో రాణించాలనే లక్ష్యంగా శిక్షణ పొందుతున్నాడు. భవిష్యత్తులో పోలీస్ ఆఫీసర్ అయ్యి ప్రజలకు సేవ చేయాలన్నదే లక్ష్యం

డాక్టర్ సీటు సాధించడమే లక్ష్యం

చంచంగారి బ్లెస్సీ అమూల్య , కబడ్డీ క్రీడాకారిణి



పాకల శాంతినగర్‌కు చంచంగారి బ్లెస్సీ 9వ తరగతి చదువుతోంది. రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొని సత్తా చాటుతున్నది. జాతీయ స్థాయి కబడ్డీ మహిళా జట్టుకి ఎంపికై క్రీడా కోటాలో డాక్టర్ సీటు సాధించడమే లక్ష్యంగా శిక్షణ పొందుతున్నట్లు అమూల్య చెబుతోంది.

'శ్రీసాధన' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం శనివారం విడుదల చేసిన డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్ష ఫలితాలలో స్థానిక శ్రీ సాధన డిగ్రీ కళాశాల విద్యార్థులు 90 శాతం సగటుతో ఉత్తీర్ణతతో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కప్పగంతుల మధుసూదన్‌రావు తెలిపారు. బిఎస్‌సి జడ్‌సిలో శ్రీరామ్ రెడ్డి కౌసల్య 881/900 మార్కులు, బిఎస్‌సి ఎంపిసిఎస్‌లో షేక్ కరిష్మా 743/800, బిఎస్‌సి ఎంసిఎస్‌లో షేక్ నఫీసా 733/800, బిఎస్‌సి ఎంపిసిలో షేక్ సాహిదా 654/800 మార్పులు సాధించినట్లు తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డి.రాజగోపాల్ రెడ్డి, డైరెక్టర్లు విఆర్‌కె. ప్రసాద్, ఎంవి. కృష్ణారెడ్డి, డాక్టర్ వెన్నా కష్ణారెడ్డి, జివిఎల్. రమేష్ బాబు, కళాశాల వైస్ ప్రిన్సిపల్ శ్రీధర్‌కుమార్, ప్లేస్ మెంట్‌సెల్, సాక్, అకడమిక్ కో ఆర్డినేటర్ పవన్ కుమార్, డాక్టర్ రామకష్ణ, ప్రసాద్ అభినందించారు.



షేక్ కరీష్మా



షేక్ నఫీసా



షేక్ సాహిదా



కౌసల్య

పిఎన్‌సిఎ విద్యార్థుల విజయకేతనం

ప్రజాశక్తి -శింగరాయకొండ



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో కరస్పాండెంట్

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డిగ్రీ 5వ సెమిస్టర్ ఫలితాలలో స్థానిక పిఎన్‌సిఎ కళాశాల విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించి యూనివర్సిటీ పరిధిలో అగ్ర స్థానంలో నిలిచినట్లు కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎన్. గీతారాణి తెలిపారు. బిఎస్‌సి కంప్యూటర్‌లో 100శాతం, బిఎస్‌సి ఎంపిసిలో100 శాతం, ఎంపిసిస్‌లో 100శాతం, ఎంఎస్‌సిఎస్‌లో 100 శాతం, బిజెడ్‌సిలో ఒక్కరు మినహా పరీక్షకు హాజరైన వారంతా ఉత్తీర్ణత సాధించినట్లు ఆమె తెలిపారు. మ్యాథ్స్‌లో 33 మందికి 6 శాతంతో 13 మంది, 7 శాతంతో 19 మంది 100 శాతం మార్కులు సాధించినట్లు తెలిపారు. బిఎస్‌సి అగ్రికల్చర్‌లో జె .లావణ్య, అఫ్రిన్ 100 శాతం మార్కులు సాధించినట్లు తెలిపారు. బిఎస్‌సి స్టాటిస్టిక్స్‌లో సిహెచ్.సుకన్య 100 శాతం మార్కులు సాధించినట్లు డాక్టర్ గీతారాణి తెలిపారు. యూన్నివర్సిటీ స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించిన పిఎన్‌సిఎ విద్యార్థులను ఆంధ్రకేసరి యూనివర్సిటీ ప్రొఫెసర్స్ డాక్టర్ ఎం. జ్ఞానేశ్వరరెడ్డి (డిపార్టుమెంటు అఫ్ మ్యాథ్స్) డాక్టర్ ఎ.అమతవల్లిదేవి(డిపార్ట్మెంట్ అఫ్ ఎడ్యుకేషన్), కళాశాల చైర్మన్ పి.శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ డి.నాగేశ్వరరావు, లెక్చరర్స్ పల్లవి, ప్రసాదరావు, శివ, వెంకట్రావు, మాబు, కొండయ్య తదితరులు అభినందించారు.

ప్రభుత్వ కార్యక్రమమా.?

పార్టీ కార్యక్రమమా.?

38వ డివిజన్ కార్పొరేటర్ మలగా రమేష్

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివద్ధి, సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చేపట్టిన 'గడప 'గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ప్రభుత్వ కార్యక్రమమా.? లేక పార్టీ కార్యక్రమమా...? అని జనసేన ఒంగోలు నగర అధ్యక్షులు, 38వ డివిజన్ కార్పొరేటర్ మలగా రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. గడపగడపకూ కార్యక్రమంలో వైసీపీ నేతలు నవ్వుల పాలవుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం 38వ డివిజన్‌లో ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబుతో కమిషనర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ యంత్రాంగం పర్యటిస్తోందని, వారితో పార్టీ నేతలు కూడా పార్టీ జెండాలను ధరించి గడపగడపకూ తిరగడం విడ్డూరంగా ఉందన్నారు. ఎక్కడ చూసినా ప్రజల చేతిలో ప్రజాప్రతినిధులు భంగపాటుకు గురౌతున్నారని అన్నారు. ప్రభుత్వ కార్యక్రమంలో వైసిపి నేతలకు పనేంటని ప్రశ్నించారు. ప్రభుత్వ అధికారులను వెంటబెట్టుకొని మేళతాళాలతో గ్రామాల్లో, కాలనీల్లో పర్యటిస్తూ వారి అంగ బలాన్ని ప్రదర్శించుకోవడమే తప్ప.. ప్రజలకు ఉపయోగపడేలా 'గడపగడకూ మన ప్రభుత్వం' కార్యక్రమం సాగడం లేదన్నారు. పార్టీ జెండాలు, కండువాలు ధరించి ప్రభుత్వ అధికారులతో కలిసి గడపగడపకూ తిరగడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వ కార్యక్రమం అని చెప్పి, పూర్తిగా పార్టీ కార్యక్రమంగా మార్చి నిర్వహించడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రజలంతా గమనిస్తున్నారని, సరైన సమయంలో వైసీపీకి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.


మాట్లాడుతున్న చేరెడ్డి లక్ష్మణ్ కుమార్‌రెడ్డి

టీవీ మెకానిక్‌లకు 'చేయూత' అందించాలి

ప్రజాశక్తి-ఒంగోలు

టీవీ మెకానిక్‌లకు ప్రభుత్వం చేయూత పథకం ద్వారా ఆర్థిక సహకారం అందిం చాలని, కార్మిక చట్టాల పరిధిలోకి టీవీ మెకానిక్‌లను చేర్చాలని, ఆరోగ్య బీమా అందించాలని రాష్ట్ర ఎలక్ట్రానిక్స్ అండ్ టీవీ మెకానిక్స్ యూనియన్ ఉపాధ్యక్షులు పామర్తి సత్యనారాయణ కోరారు. ఒం గోలు ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం ఒంగోలు మల్లయ్య లింగం భవన్ నల్లూరి అంజయ్య మెమోరియల్ హాల్‌లో సంస్థ అధ్యక్షులు బొడ్డు నరసింహారావు (రాజు) అధ్యక్షతన ఆది వారం జరిగింది. ఈ సందర్భంగా ఒంగోలు ఎలక్ట్రానిక్ యూని యన్ మాజీ అధ్యక్షులు చేరెడ్డి లక్ష్మణ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఒంగోలులో ఎలక్ట్రానిక్ కాంప్లెక్స్ గురించి స్థానిక శాసనసభ్యునితో మాట్లాడతానని, అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తా నని చెప్పారు. ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ యూనియన్ సభ్యులు ఐక్యంగా ఉండి మనలో ఇబ్బంది పడు తున్న వారికి అండగా ఉండాలని, ఆర్థికం గా సహకారం అందించాలని కోరారు ఒం గోలు ఎలక్ట్రానిక్ డెవలప్మెంట్ అసోసి యేషన్ కన్వీనర్ పొన్నం హరిబాబు, ఒం గోలు ఎలక్ట్రానిక్ డెవలప్మెంట్ అసోసియే షన్ ఉపాధ్యక్షులు పుట్టా వెంకట శేషయ్య మాట్లాడారు. ఈ సందర్భంగా చేరెడ్డి లక్ష్మణకుమార్‌రెడ్డిని, మారెళ్ళ సుబ్బా రావును అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. టీవీ టెక్నీషియన్‌కు గుర్తిం పు కార్డులను వారి ద్వారా అందజేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసులు మాట్లాడుతూ టీవీ మెకానిక్‌లను అసంఘటిత రంగ కార్మికులుగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు నావూరి సుబ్బారావు, బుజ్జి, అనిల్‌బాబు, శేఖర్ పాల్గొన్నారు.

వైసిపిలో సంక్షోభం

- బాలినేని రాజీనామా విషయంలో అధినేత నిర్ణయంపైనే దృష్టి
- జిల్లా నేతల్లోనూ అయోమయం..

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

వైసిపిలో నాయకత్వ సంక్షోభం ముదురుతోంది. ముఖ్య నేతల్లో అసంతృప్తి ఏ స్థాయిలో ఉందో బాలినేని రాజీనామా విదితం చేస్తోంది. 'జగనన్నే మా భవిష్యత్..జగనన్నే మా దీమా' అంటూ కొత్త కార్యక్రమం చేపట్టిన వైసిపికి ఇప్పుడు ముఖ్యనేతలే అసంతృప్తితో రగిలిపోవడం మింగుడు పడని అంశంగా మారింది. నేతలకే ఆ ధీమా కనిపించడం లేదు. పార్టీ ఆదేశించిందని బలవంతంగా బ్యానర్లు పట్టుకుంటే ధీమా ఉంటుందా? అన్నది ఇప్పుడు చర్చలోకి వచ్చింది. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి మూడు జిల్లాల కోఆర్డినేటర్ పదవికి రాజీనామా చేశారు. దాన్ని ఆమోదించారా? లేదా? అన్నది ఇప్పుడు చర్చ కాదు. ఆ పరిస్థితి ఎందుకు వచ్చిందన్నదే ఇప్పుడు కీలక ఎజెండాగా మారింది. ఇక దీనిపై అధినేత సిఎం జగన్ ఎలాంటి నిర్ణయం తీసుకోనున్నారనేదీ నేతల్లో చర్చగా మారింది. ఆమోదిస్తారా? బుజ్జగిస్తారా? అనే దానిపై ఉత్కంఠ నెలకొంది. ఆయన్ను మంత్రి పదవి నుంచి తప్పించాక మొదలైన అసంతృప్తి ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. కొన్ని సందర్భాల్లో పార్టీ పరువు పోతుందని అధిష్టానం పెద్దలు జోక్యం చేసుకుని బుజ్జగింపులు చేసినా ఆయన మాత్రం అసంతృప్తిగానే కొనసాగుతున్నారు. మూడు జిల్లాల్లో పార్టీ బాధ్యతలు చూస్తున్నప్పటికీ ఇటీవల ఎమ్మెల్సీ ఎన్నికలు, నెల్లూరు జిల్లాలో పార్టీ నుంచి ఎమ్మెల్యేలు వెళ్లిపోవడం వంటి పరిణామాలు కూడా బాలినేనిపై ప్రభావం చూపాయంటున్నారు. ఆయన మాదిరిగానే మిగతా నేతల్లోనూ అసంతృప్తి ఉన్నట్లు చెప్పాల్సిన అవసరం లేదు. పార్టీ అవిర్భావం నుంచి ఉన్నప్పటికీ తగిన ప్రాధాన్యత లేదన్నది చర్చగా మారింది. పార్టీ పెట్టినప్పుడు లేనివాళ్లు, అప్పట్లో తెలుగుదేశంలో ఉన్న నేతలు ఇప్పుడు మంత్రులుగా ఉన్నారు. ఇదే బాలినేని జీర్ణించుకోలేకపోతున్నారు. మంత్రి వర్గ విస్తరణలో తప్పించారు. కొందరిని కొనసాగించడం బాలినేనికి ఇబ్బందిగా మారింది. ఇక్కడ చెప్పుకోవడానికి కూడా ఆయన తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. కోఆర్డినేటర్‌గా పెట్టి ఆయన్ను ఏదో రకంగా సర్దుబాటు చేశారు. అయితే ఆయనకు ఆ పదవి కూడా అంతగా సంతృప్తిని ఇవ్వలేదు. అధిష్టానం దృష్టిలో బాలినేనికి ప్రాధాన్యత లేదనే చర్చ తెరపైకి రావడంతోనే ఆయన తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. మంత్రివర్గం నుంచి బయటకు వచ్చాక ఆయన ఎక్కువ రోజులు హైదరాబాద్‌లోనే ఉన్నారు. ఇటీవల కాలంలో మళ్లీ నియోజకవర్గంపై దృష్టి సారించారు. గడపగడపకూ కార్యక్రమంలో తిరుగుతున్నారు. మిగతా జిల్లాలపై పెద్దగా దృష్టి లేదంటున్నారు. నెల్లూరు జిల్లాలో పార్టీలో అంతర్గత కుమ్ములాటలు పెరిగిపోయాయి. ఎమ్మెల్యేలే పార్టీని వీడారు. ఇక్కడా కొందరు అదే అసంతృప్తితో ఉన్నారు. ద్వితీయశ్రేణి నేతలే ఎమ్మెల్యేలపై తిరుగుబాటు చేస్తున్నారు. బయటకు పోలేకనే కొనసాగుతున్నారు. ఇప్పుడు బాలినేనికే అలాంటి పరిస్థితి వచ్చిందనే చర్చ నడుస్తోంది. ఆయన బయటకుపోయే పరిస్థితి లేనందున అసంతృప్తితోనే ఉన్నారు. సిఎం పర్యటనలో ఎదురైన పరాభవం మరింత కుంగదీసిందంటున్నారు. విలువలు లేని రాజకీయాలు చేయనని ఇటీవల బాలినేని చేసిన హెచ్చరికలు పరోక్షంగా అధిష్టానం పెద్దలనుద్దేశించి చేసినవేనంటున్నారు. బాలినేనిని అధినేత పెద్దగా పట్టించుకోకపోవడానికి అనేక కారణాలు చర్చలో ఉన్నాయి. సిఎం జగన్ బాబాయి వైవి.సుబ్బారెడ్డితో విభేదాలు ప్రధాన కారణంగా చెబుతున్నారు. గత ఎన్నికల్లో మొదలైన విభేదాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ఇక బాలినేని కొన్ని ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. ఆయన అనుచరులు పేరుతో కొనుగోలు చేసిన భూములు, బంధువుల చేపట్టిన నిర్మాణాలు ఇక్కడ ఆయనకు ఇబ్బందిగా మారాయి. ఎన్నడూ ఆరోపణలు లేని బాలినేని అన్ని రకాలుగా విమర్శల దాడిలో పడ్డారు. ఇవి ప్రతిపక్షాలకు అస్త్రాలుగా మారాయి. ఇవన్నీ ఇప్పుడు బాలినేనికి ఇబ్బందిగా మారాయి. ఈ తరుణంలో ఎవరూ అండగా లేరనే భావన బాలినేనిలో ఉంది. గతంలో ప్రకాశం జిల్లా కూడా ఆయన పరిధిలో ఉంది. ఇప్పుడు లేదు. అయినా జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో నేతలు వచ్చి కలుస్తుంటారు. అన్ని రకాల పేచీలు, గొడవలు ఆయన వద్దకే పంచాయితీకి వస్తుంటాయి. వీటిని పరిష్కారం చేయడంలోనూ ఇబ్బందులు పడుతున్నారు. ఇక సిఎం పేషీలోనూ తగిన ప్రాధాన్యత లేకుండా చేశారనే చర్చ ఉంది. అక్కడ ఏమి అడిగినా చేయడం లేదంటున్నారు. ప్రతి చిన్న పనికీ అక్కడ అధికారులను కలవాల్సి వస్తోంది. ఇవి కూడా బాలినేని పదవి నుంచి తప్పుకోవడానికి కారణాల్లో ఉన్నాయి. ఏదేమైనా వైసిపిలో నాయకత్వ సంక్షోభం ముదిరింది. కీలకమైన నేతలే ఇప్పుడు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. బాలినేనిని నమ్ముకుని వచ్చే ఎన్నికల్లో సీట్లు ఆశిస్తోన్న నేతలు కూడా ఇప్పుడు గందరగోళంలో పడ్డారు. మంత్రి ఆదిమూలపు సురేష్ కూడా బాలినేని నిర్ణయంపై గందరగోళంలోనే ఉన్నారు. ఈ పరిణామాలపై ఆయన కూడా నిశితంగా పరిశీలిస్తున్నారు. ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జిలు కూడా బాలినేని రాజీనామాపైనే దృష్టి సారించారు. పార్టీలో ఏం జరుగుతుందనే దానిపై తర్జనభర్జన పడుతున్నారు. కార్యకర్తల్లోనూ కలవరం మొదలైంది. పార్టీలో సంక్షోభాలు తలెత్తినప్పుడే నేతల నుంచి కార్యకర్తల వరకూ ఇలాంటి గందరగోళ పరిస్థితులు ఎదురవుతాయి.

'నిమ్జ్'తో జిల్లా సమగ్రాభివృద్ధి

- పరిశ్రమల అభివృద్ధే లక్ష్యం
- గుండ్లకమ్మ నుంచి గ్రోత్ సెంటర్‌కు నీటి సరఫరా
- రూ.1.20 కోట్ల పన్ను వసూలు
- ఎపిఐఐసి జోనల్ మేనేజర్ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో పరిశ్రమల అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ(ఎపిఐఐసి) జోనల్ మేనేజర్ జె.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. నిమ్జ్ ఏర్పాటు చేయటం ద్వారా జిల్లా సమగ్రాభివృద్ధి చెందుతుందన్నారు. గుండ్లకమ్మ నుంచి పైపులైన్ ద్వారా గ్రోత్‌సెంటర్‌కు నీటి సరఫరాకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. జిల్లాలోని వివిధ పరిశ్రమల ద్వారా రూ.1.20 కోట్ల పన్ను వసూలు చేస్తున్నట్లు వివరించారు. ఏపిఐఐసి ద్వారా పరిశ్రమల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను ఎపిఐఐసి జోనల్ మేనేజర్ ప్రజాశక్తికి వివరించారు. అవన్నీ ఆయన మాటల్లోనే..

ప్రకాశం జిల్లాలో 'నిమ్జ్' ద్వారా సమగ్రాభివద్ధి చెందడంతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో అగ్రగామిగా నిలుస్తోంది. కనిగిరి నియోజకవర్గ ప్రాంతంలో స్థాపించనున్న 'నిమ్జ్' పారిశ్రామిక కారిడార్‌కు 12 వేల ఎకరాలు సేకరించాలని ఏపిఐఐసి లక్ష్యంగా నిర్ణయించింది. ఇందుకోసం 809 ఎకరాలు సేకరించాం. మరో 900 ఎకరాలు ప్రభుత్వ భూములను గుర్తించాం. వీటిని త్వరలోనే ప్రభుత్వం ద్వారా సేకరించడానికి కషి జరుగుతోంది. అంచలంచెలుగా అవసరం ఉన్న మేరకు భూములు సేకరించేందుకు ప్రణాళికలు రూపొందించాం. ఈ పాటికే 55 ఎకరాలు అభివద్ధి పరచటం జరిగింది. మౌళిక సదుపాయాలు కల్పించటంలో భాగంగా ప్రాజెక్టుకు అవసరమైన నీటిని వెలుగొండ ప్రాజెక్ట్ నుంచి పైపులైన్ ద్వారా సరఫరా చేసేందుకు ప్రతిపాదనలు రూపొందిస్తాం. సింగరాయకొండ నుంచి అనంతపురం నాలుగు లైన్ల రోడ్డు రూపొందుతుండటంతో రవాణాకి వెసులుబాటు కలుగుతోంది.

స్థానిక సంస్థల సహకారం అవసరం

పరిశ్రమల అభివద్ధికి స్థానిక సంస్థలు తోడ్పాటును అందించాలి. ప్రధానంగా పరిశ్రమల నుంచి వెలవడే వ్యర్థాలు డంప్ చేసేందుకు డంపింగ్ యార్డులను స్థానిక సంస్థలు ఏర్పాటు చేయాలి. పరిశ్రమల నుంచి గ్రామ పంచాయతీలకు దామాషా ప్రకారం 35 శాతం టాక్స్ చెల్లిస్తుండటంతో ఆ మేరకు పాలకవర్గం పరిశ్రమలు నెలకొల్పిన ప్రాంతంలో డంపింగ్ యార్డులకు ప్రత్యేకంగా స్థలాలు సేకరించాల్సి ఉంది. ఇందుకు ప్రభుత్వ యంత్రాంగం ప్రధానంగా రెవెన్యూ శాఖ తోడ్పాటును అందించాల్సి ఉంది. ప్రతి గ్రోత్ సెంటర్‌కు డంపింగ్ యార్డు లేని కారణంగా వ్యర్థాలు ఎక్కడికక్కడ వదిలిపెట్టడం వల్ల పర్యావరణం దెబ్బతింటోంది.





పరిశ్రమల యజమానులు వ్యర్థాలు తరలించాలి

పరిశ్రమలకు చెందిన యజమానులు ముఖ్యంగా గ్రానైట్ పరిశ్రమలకు సంబంధించిన వ్యర్థాలను కంకర మిల్లులకు తరలించటం, దూరంగా ఉన్న కొండ ప్రాంతాలకు తరలించటం వంటి చర్యలు చేపట్టాలి. ఇందుకు కొంత వ్యయమైనప్పటికి భవిష్యత్ అవసరాల రీత్యా తప్పదు. ప్రస్తుతం గ్రోత్ సెంటర్‌లో పేరుకుపోయిన వ్యర్థాలను కొండ ప్రాంతానికి తరలించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. శాశ్వత పరిష్కారంగా రెవెన్యూ అధికారులతో పాటు స్థానిక పాలక వర్గంతో చర్చించి అవసరమైన స్థలం సేకరించటం ద్వారా సమస్యను అధిగమించేందుకు కృషి చేస్తాం.

గుండ్లకమ్మ నుంచి గ్రోత్ సెంటర్‌కు నీటి సరఫరా

గ్రోత్ సెంటర్ అభివద్ధిలో భాగంగా గుండ్లకమ్మ నుంచి పైపులైన్ ద్వారా నీరు అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. వాస్తవంగా ఈపాటికే పైపులైన్ రూపొందించాం. వినియోగంలో లేని కారణంగా పైపులైన్ తుప్పు పడుతోంది. దీనిని వినియోగంలోకి తేవటానికి సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తున్నాం. గ్రోత్ సెంటర్ యాజమాన్యంతో మాట్లాడి వాటా ప్రకారం డెడ్ స్టోరేజీ నుంచి గ్రోత్ సెంటర్‌లోని పరిశ్రమలకు నేరుగా కనెక్షన్లు ఇవ్వటానికి ప్రతిపాదనలు రూపొందించాలి. దీంతో గ్రోత్ సెంటర్ కూడా అభివృద్ధి చెంది పర్యావరణానికి దోహదపడుతోంది.

గ్రానైట్ పరిశ్రమకు గడ్డు కాలం

కోవిడ్ అనంతరం గ్రానైట్ పరిశ్రమకు గడ్డు కాలం నడుస్తోంది. గ్రోత్ సెంటర్‌లో 60 శాతం ఈ పరిశ్రమలు ఉన్నాయి. ఎగుమతులు నిలిచిపోవటంతో పరిశ్రమలు సంక్షోభంలో చిక్కుకున్నాయి. సెజ్‌లో పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా ఏమాత్రం లేదు. అక్కడ కూడా బిల్డింగ్ ప్రోడక్ట్ మెటీరియల్ ఉత్పత్తి అవుతోంది. సెజ్ పరిధిలో 21 పరిశ్రమలకు 1 పరిశ్రమలను మూతవేశారు.

రూ.1.20 కోట్ల పన్ను వసూలు

గ్రోత్ సెంటర్ నుంచి ఏటా రూ.7 కోట్ల పన్నులు వసూలు చేయాల్సి ఉంది. కేవలం రూ.1.20 కోట్లు మాత్రమే చెల్లించారు. 200 పరిశ్రమలకు సంబంధించి పన్నులు చెల్లించాల్సి ఉంది. 100కి పైగా పరిశ్రమలు మూతపడ్డాయి. కొన్ని ప్రరిశ్రమలు ఉత్పత్తుల ఎగుమతులు నిలిచిపోవటంతో యాజమాన్యం పన్నులు చెల్లించటానికి వాయిదాలు వేస్తున్నారు. మూడో వంతు పరిశ్రమల నుంచి మాత్రమే కొంత మేర పన్ను వసూలవుతున్నాయి. పూర్తి స్థాయిలో పన్ను వసూలు కాకపోవటంతో గ్రోత్ సెంటర్ అభివృద్ధి కుంటుపడుతోంది. డిమాండ్ ప్రకారం గ్రోత్ సెంటర్‌లో సభ్యులందరికి పన్నులు చెల్లించాలని విజ్ఞప్తి చేశాం. ఆర్థిక పరిస్థితి కుదుటపడే వరకు సమయం కావాలని యాజమాన్యం కోరింది.

'శ్రీ హర్షిణి' విద్యార్థులకు ఉత్తమ మార్కులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

నాగార్జున యూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ 3వ సెమిస్టర్ ఫలితాలలో శ్రీ హర్షిణి డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు యూనివర్సిటీ స్థాయిలో అత్యధిక మార్కులు సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఈ సందర్భంగా కాలేజీలో జరిగిన అభినందన కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ గోరంట్ల రవికుమార్, సెక్రటరీ, కరస్పాండెంట్ గోరంట్ల కవిత, ప్రిన్సిపల్ డి ఆంజనేయులు, పి.జి. కో–ఆర్డినేటర్ పి. శ్రీనివాసులరెడ్డి, మరియు అధ్యాపక మరియు అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

చదువుతోనే జీవితంలో వెలుగు

ఇంటర్మీడియట్ పూర్వ ఆర్‌జెడి జె.పద్మ

ప్రజాశక్తి-పిసిపల్లి

చదువే జీవితానికి వెలుగునిస్తుందని ఇంటర్మీడియట్ పూర్వ ఆర్‌జెడి జె.పద్మ పేర్కొన్నారు. ఆదివారం పిసిపల్లికి వచ్చిన సందర్భంగా స్థానిక జడ్‌పిహైస్కూల్‌ని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. నేడు ప్రభుత్వం విద్యార్థుల కోసం అనేక సౌకర్యాలు కల్పించిందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నతశిఖరాలను అధిరోహించాలన్నారు. జడ్‌పిహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో తెలుగు ఉపాధ్యాయులు జివి.మాల్యాద్రి, గణిత ఉపాధ్యాయులు ఎం.నరసింహం, డి.ఏసుబాబు తదితరులు ప్రసంగించారు.




మాట్లాడుతున్న పూర్వ ఆర్‌జెడి జె.పద్మ

'శ్రీ సరస్వతి' విద్యార్థుల జయకేతనం

విద్యార్థులకు అభినందించిన ఛైర్మన్ రమణారెడ్డి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

నాగార్జున యూనివర్సిటీ విడుదల చేసిన 3వ సెమిస్టర్ పరీక్షా ఫలితాలలో ఒంగోలు శ్రీ సరస్వతి డిగ్రీ కళాశాల జిల్లా స్థాయిలో అత్యుత్తమ ఉత్తీర్ణతతో అగ్రస్థానంలో నిలిచినట్లు విద్యా సంస్థల ఛైర్మన్ ఏవి రమణారెడ్డి తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో కాలేజ్ డైరెక్టర్స్ గణేష్ రెడ్డి, గంగా శంకర్ రెడ్డి, సిఇఒ వెంకట సురేష్, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ప్రజాశక్తి

ప్రపంచ కార్మిక దినోత్సవం



మేడే

ప్రత్యేక అనుబంధం

బాపట్ల జిల్లా 16 పేజీలు సోమవారం 1 మే 2023 Advt feature

కార్మిక వర్గంపై దాడులను..

ప్రతిఘటించడమే..



కార్మికవర్గం ముందున్న

మేడే కర్తవ్యం..

ప్రపంచీకరణ - సరళీకరణ - ప్రైవేటీకరణ విధానాలు ప్రారంభమైన గత మూడు దశాబ్దాల్లో కార్మికవర్గంపై దాడులు తీవ్రతరమయ్యాయి. కార్మికులకు హక్కులు కల్పించే చట్టాలను ప్రభుత్వాలు రద్దు చేస్తూ పెట్టుబడిదారుల, పారిశ్రామికవేత్తల కొమ్ముగాస్తున్నాయి. ఆనాడు పని గంటలు తగ్గించాలని, 8 గంటల పని విధానం ఉండాలని చేసిన వీరోచితమైన పోరాటాలే మేడేగా మారాయి. ఈనాడు ఐటి రంగంసహా అనేక రంగాల్లో 12 నుండి 16 గంటలు పని చేయడం, ఆరోగ్యాన్ని, కుటుంబ జీవితాన్ని ఉద్యోగులు, కార్మికులు కోల్పోవడం చూస్తున్నాం. అంతర్జాతీయంగా, జాతీయంగా కూడా కార్మిక, ఉద్యోగవర్గాలపైన, ప్రజల ఐక్యతపైనా దాడులు పెరుగుతున్న నేపథ్యంలో వాటిని ప్రతిఘటించడమే నేడు కార్మికవర్గం ముందున్న మేడే కర్తవ్యం.

అంతర్జాతీయంగా ప్రపంచీకరణ విధానాలు ప్రారంభమైన తొలిదశలో సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారీ విధానమే అజేయమని, వాటికి ఎదురులేదని సిద్ధాంతీకరించారు. 2008లో వచ్చిన ప్రపంచ ఆర్థిక సంక్షోభం తర్వాత సామ్రాజ్యవాద ఆర్థికవ్యవస్థ డొల్లతనం బయటపడింది. ఈ రోజు ▶ 14లో





బాపట్ల జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి

సమగ్ర ప్రణాళికతో చర్యలు

కలెక్టర్ రంజిత్‌బాషా



కలెక్టర్ రంజిత్‌బాషా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

పారిశ్రామికంగా బాపట్ల జిల్లాను అభివద్ధి చేయడానికి సమగ్ర ప్రణాళికతో చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా వెల్లడించారు. మేడే సందర్భంగా ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. పారిశ్రామిక రంగ అభివద్ధికి అవసరమైన వనరులు బాపట్ల జిల్లాలో పుష్కలంగా ఉన్నాయని చెప్పారు. ఇప్పటికే మొత్తం 3,569 పరిశ్రమలు నడుస్తుండగా సుమారు 41,767 మంది జిల్లాలో ఉపాధి పొందుతున్నారని చెప్పారు. జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు తోడ్పాటునందిస్తున్నామన్నారు. జిల్లా పారిశ్రామికాభివృద్ధి కోసం బ్యాంకర్ల ద్వారా అంకుర పరిశ్రమల ఏర్పాటుకు ఆర్థిక చేయూతనందిస్తూ.. తమ వంతు కృషిచేస్తున్నట్లు చెప్పారు. బాపట్ల జిల్లాలో వ్యవసాయ ఆధారిత కంపెనీల ఏర్పాటుకు మార్గం సుగమం చేస్తూ పలు రకాల పరిశ్రమల ఏర్పాటుకు కృషి జరుగుతుందన్నారు. జిల్లాలో తయారీ రంగం, సేవారంగాల్లో పలు పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు ఇస్తున్నట్లు చెప్పారు. ఏడాది క్రితం నూతనంగా ఏర్పడిన బాపట్ల జిల్లా ఇప్పుడిప్పుడే పారిశ్రామికంగా ముందడుగు వేస్తోందన్నారు. జిల్లాలో ఖనిజాధార పరిశ్రమలు, వ్యవసాయాధార పరిశ్రమలు, ఆహార రంగం, మెరైన్ ఆధారిత పరిశ్రమలు, టెక్స్‌టైల్ దాని అనుబంధ పరిశ్రమలు జిల్లాలో ప్రధాన ఆర్థిక చోదకాలుగా ఉన్నాయన్నారు. జిల్లాలో క్లస్టర్ డెవలప్ మెంట్ ప్రోగ్రామ్ ప్రాజెక్టు కింద కొత్త ఫ్యాబ్రికేషన్ ప్రొడక్ట్స్ క్లస్టర్ (మెటల్ డోర్స్) ఏర్పాటు పురోగతిలో ఉందని చెప్పారు. జిల్లాలో ప్రస్తుతం ఉన్న రొయ్యలు మరియు రొయ్యల ప్రాసెసింగ్ అనుబంధ పరిశ్రమలు, గ్రానైట్స్ కటింగ్ మరియు పాలిషింగ్, రైస్ మిల్లింగ్, డాల్ మిల్లింగ్, జీడిపప్పు ప్రాసెసింగ్, మిల్క్ చిల్లింగ్ మరియు ప్రాసెసింగ్ వంటి ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు, హ్యాండ్లూమ్స్, పవర్ లూమ్స్, సిల్క్ రీలింగ్, బిల్డింగ్ మెటీరియల్ అంటే బ్రిక్స్, స్టోన్ క్రషర్లు, మరియు ఆటోమొబైల్ కాంపోనెంట్స్ మరియు సర్వీసింగ్ సెక్టార్ పరిశ్రమలు ఉన్నాయని తెలిపారు. జిల్లాలో పెద్ద స్థాయి పరిశ్రమలు స్పిన్నింగ్ మరియు వీవింగ్ పరిశ్రమలు ఐదు ఉన్నాయన్నారు. పొగాకు ప్రాసెసింగ్ పరిశ్రమ,మిర్చి ఆధారిత పరిశ్రమ(ఒలియోరెసిన్ తయారీ యూనిట్)లు ఉన్నాయన్నారు. జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ) రంగంలో సుమారు 569 గ్రానైట్ కటింగ్ అండ్ పాలిషింగ్ పరిశ్రమలు పనిచేస్తున్నాయని తెలిపారు. గడిచిన సంవత్సరంలో బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లో బ్లాక్ గ్రానైట్ వెలికితీత 1,14,459 క్యూబిక్ మీటర్లు, కలర్ గ్రానైట్ వెలికితీత 2,23,929 క్యూబిక్ మీటర్లుగా ఉందన్నారు. జిల్లా నుంచి ఐరోపా దేశాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎగుమతులు జరుగుతున్నాయని తెలిపారు. జిల్లాలో రొయ్యల ఉత్పత్తి, ఎగుమతులు గణనీయంగా జరుగుతున్నాయని చెప్పారు. ఏటా సుమారు రూ.1088 కోట్ల అంచనా విలువతో 81,482 టన్నుల రొయ్యలు జిల్లా నుంచి శీతలీకరించిన సుమారు 9,400 టన్నుల రొయ్యలు నౌకల ద్వారా ఎగుమతులు జరుగుతున్నాయన్నారు. జిల్లాలోని నిజాంపట్నం వద్ద రూ.450 కోట్ల అంచనాలతో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం జరుగుతుందన్నారు. రెండు నెలల్లో పూర్తవుతుందన్నారు. జిల్లాలో వాడరేవు వద్ద రూ.450 కోట్లతో మరో ఓపెన్ ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి టెండర్ల పనులు పూర్తయ్యాయని, త్వరలో హార్బర్ నిర్మాణం పనులు ప్రారంభిస్తారని చెప్పారు. జిల్లాలో రూ.718 కోట్ల పెట్టుబడితో 2,56,800 స్పిండిల్స్‌తో ఆరు కాటన్ స్పిన్నింగ్, వీవింగ్ యూనిట్లు జిల్లాలో పనిచేస్తూ 3,965 మందికి ఉపాధి కల్పిస్తున్నామన్నారు. రెండు కాటన్ సీడ్ ఆయిల్ అండ్ కేక్ పరిశ్రమలు రూ.21 కోట్ల పెట్టుబడితో పనిచేస్తూ 650 మందికి ఉపాధి కల్పిస్తున్నాయన్నారు. నూతన పరిశ్రమల స్థాపనకు ఔత్సాహికులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం నుంచి వారికి అవసరమైన సహకారం, వనరులు అందిస్తున్నామని కలెక్టర్ చెప్పారు. ఇందుకోసం అనుబంధ శాఖల అధికారుల సహాయ సహకారాలు తీసుకుంటు న్నామన్నారు.

కార్మికవర్గ సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గం

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందర్



సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మజుందర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల బాపట్ల జిల్లాలోని కార్మిక వర్గం కూడా అనేక సమస్యలు ఎదుర్కొంటోందని, ఈ సమస్యల పరిష్కారానికి మేడే స్ఫూర్తితో ఐక్య పోరాటాలు చేయడం ద్వారానే కార్మికవర్గం సమస్యలను పరిష్కారం చేసుకుంటుందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.మజుందార్ పేర్కొన్నారు. మేడే సందర్భంగా 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడారు. జిల్లాలో 2500 మంది అంగన్‌వాడీలు ఉన్నారని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలందరికీ గ్రాడ్యూటీ అమలు చేయాలని, కానీ రాష్ట్ర ప్రభుత్వం అందుకు చర్యలు తీసుకోవడం లేదని చెప్పారు. జిల్లాలో ఆశావర్కర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కూడా లేవని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అమలు జరగటం లేదన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల్ని అధికారంలోకి వచ్చిన వెంటనే రెగ్యులర్ చేస్తామని జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో హామీలు ఇచ్చినా, నేటికీ రాష్ట్రంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయలేదన్నారు. జిల్లాలో అసంఘటిత కార్మికులైన భవన నిర్మాణం, ఆటో హమాలీలు వేల సంఖ్యలో కార్మికులు ఉన్నా.. వీరికి సమగ్ర చట్టం లేక హమాలీలు అనేక ప్రమాదాలకు లోనై ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డుని జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు నిధులు దారి మళ్లించడానికి లేదని, కానీ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.1300 కోట్లకు పైగా నిధులు దారి మళ్లించిందన్నారు. వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించి భవన నిర్మాణ కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. ఆటో కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి.. పన్నుల భారాలను తగ్గించాలని కోరారు. బాపట్ల జిల్లాలో మార్టూరు, చీరాల, నిజాంపట్నం, బాపట్ల, రేపల్లె ఏరియాలో పెద్ద సంఖ్యలో కార్మిక వర్గం ఉన్నారని, జిల్లాలోని బాపట్ల కేంద్రంలో ఈఎస్ఐ హాస్పిటల్ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు జిల్లాలో ఇప్పటికీ కార్మిక శాఖ అధికారి కార్యాలయం లేకపోవడం వల్ల అటు గుంటూరు లేదా ఒంగోలు వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. వెంటనే డిప్యూటీ లేబర్ కమిషన్ కార్యాలయాన్ని బాపట్లలో ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న ఆర్టీసీ కార్మికుల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్లుగా ఉందన్నారు. కార్పొరేషన్ ఉన్నప్పుడు అనేకమైన సౌకర్యాలు లభించిన కార్మిక వర్గం నేడు అనేక సౌకర్యాలు కోల్పోవాల్సి వస్తుందని, కార్మికులకు రావాల్సిన పెండింగ్ బకాయిలు అన్ని కూడా చెల్లించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఈ కాలంలో చేస్తున్న పోరాటాలకు సిఐటియు సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతినెల మొదటి తేదీ వేతనాలు చెల్లించాలని 11వ పిఆర్సీ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ జరుగుతున్న ఆందోళన సందర్భంగా.. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల పట్ల కక్ష సాధింపు చర్యలు మానుకోవాలన్నారు. ఉద్యోగులు కూడా సమాజంలో భాగమని ఉద్యోగులు వేరు కాదని, ఉద్యోగ వర్గాలతో పంతం వీడాలని సూచించారు. జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలు ఉన్నాయని, వాటిల్లో పనిచేస్తున్న కార్మికుల సంఖ్య పెంచకుండా ఉన్న కార్మికులపై పనిభారం పెరుగుతుందని చెప్పారు. ప్రజల సంఖ్యకు అనుగుణంగా పారిశుధ్య కార్మికులు సంఖ్య పెంచాలన్నారు. మునిసిపాలిటీలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులకు కూడా వేతనాలను పెంచాలని, వారిని ఆప్కాస్ లో కలపాలని కోరారు.

కొత్తగా ఏర్పడిన బాపట్ల జిల్లాలో కార్మిక వర్గ సమస్యల పరిష్కారం కోసం జిల్లా అధికారులు అన్ని ట్రేడ్ యూనియన్‌తో మీటింగ్ ఏర్పాటు చేసి.. జిల్లాలో కార్మిక వర్గ సమస్యల పరిష్కారం కోసం చర్చించాలని తెలిపారు. కొత్తగా ఏర్పడిన బాపట్ల జిల్లాలో సిఐటియు 25 మండలాల్లో కూడా తన కార్యక్రమాలు నిర్వహిస్తుందని కార్మిక ఉద్యోగ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఈ కాలంలో సెప్టెంబర్ 20న షెడ్యూల్ పరిశ్రమంలో పనిచేస్తున్న కార్మికులకు వేతన సవరణ జరపాలని, స్కీం వర్కర్లకు వేతనాలు పెంచాలని కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద మహాధర్నా నిర్వహించామని, జిల్లాలో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారని గుర్తుచేశారు. ఫిబ్రవరి 6వ తేదీన జిల్లాలో అంగన్వాడీ సమస్యల పరిష్కారం కోసం 3 వేల మందితో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించామన్నారు. ఆశా వర్కర్స్ సమస్యలపై ధర్నాలు చేశారని, ప్రభుత్వం నుంచి స్కీం వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో సీఐటీయూ రాబోయే కాలంలో 25 మండలాల్లో కూడా తన కార్యక్రమాలు విస్తరించి.. కార్మిక వర్గ సమస్యలపై రాజీలేని పోరాటాలకు సిద్ధమవుతోందన్నారు. జిల్లాలో కార్మిక వర్గం యూనియన్లకు అతీతంగా ఐక్యమవ్వాలని కోరారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలని.. మేడే సందర్భంగా కార్మికులంతా ప్రతినబూనాలని పిలుపునిచ్చారు.

ప్రజా సేవే లక్ష్యంగా ముందుకు ..

- టిడిపి బాపట్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్ర వర్మ



వేగేశన నరేంద్ర వర్మ

ప్రజాశక్తి బాపట్ల

ప్రజా సేవే లక్ష్యంగా తాను ముందుకు సాగుతున్నట్లు టిడిపి బాపట్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్ర వర్మ తెలిపారు. ప్రజాశక్తితో తాను చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను గురించి నరేంద్ర వర్మ వివరించారు. వేగేశన ఫౌండేషన్ ద్వారా పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో అనేక అభివద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. నియోజకవర్గం లోని ప్రతి ఇంటికీ టిడిపిని చేరువ చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. ఇంటింటికీ తెలుగుదేశం, మీ మా - నా బాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాపట్ల నియోజకవర్గంలో టిడిపి జెండాను తిరిగి ఎగుర వేసేందుకు అహర్నిశలు కషి చేస్తున్నట్లు తెలిపారు. టిడిపి నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రతి ఇంటికి తిరుగుతూ పార్టీని గెలిపించాలని ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేగేశన ఫౌండేషన్ ద్వారా ప్రజలకు సేవలు అందిస్తూనే టిడిపిని బలమైన శక్తిగా ఎదిగేలా, రాను ఎన్నికల్లో టిడిపిని గెలిపించేందుకు సర్వశక్తు లొడ్డు తున్నామని నరేంద్ర వర్మ తెలిపాడు.

ప్రజాలకు సేవలందించేందుకు రాకీయాల్లోకి ...

ప్రజలకు సేవందించేందుకు తాను రాజకీయల్లోకి వచ్చినట్లు నరేంద్ర వర్మ చెప్పాడు. రాబోయే ఎన్నికల్లో బాపట్ల నియోజకవర్గ టిడిపి అభ్యర్థిగా పోటీ చేస్తానని, కుటుంబ సభ్యుడిలా భావించి ఆదరించి ఆశీర్వదిస్తే బాపట్లను అన్నిరంగలలో అభివద్ధి చేస్తానని హామీ ఇస్తున్నాడు. ముస్లిం మైనారిటీలకు అండగా నిలిచి టిడిపి పక్షాన ప్రతి ఏటా ముస్లింలకు రంజాన్ మాసంలో రంజాన్ తోఫా, పేద ముస్లిం మహిళల పెళ్లికి ఆర్థిక సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. క్రిస్మస్ ,సెమీ క్రిస్మస్ పర్వదినాలను ఉత్సాహంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్‌సి సామాజిక వర్గానికి అభివద్ధికి అవసరమైన చర్చీలు, ప్రార్థన మందిరాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

క్రీడలను ప్రోత్సహం

తాను క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నట్లు నరేంద్రవర్మ తెలిపారు. క్రీడారంగంలో తాను జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నట్లు తెలిపారు. నాలుగేళ్ల క్రితం జాతీయ బీచ్ కబడీ పోటీలను సూర్యులంక బీచ్‌లో నిర్వహించినట్లు తెలిపారు.



వేగేశన నరేంద్ర వర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్

వాటర్ ప్లాంట్ ఏర్పాటు

నరేంద్ర వర్మ వేగేశన ఫౌండేషన్ ద్వారా బాపట్ల నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి అధికంగా ఉన్న గ్రామాల్లో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి ట్యాంకర్ల ద్వారా మంచినీరు సరఫరా చేస్తున్నట్లు తెలిపాడు. బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాల్లో ప్రతి ఇంటికి 20 లీటర్లు శుద్ధి చేసిన నీటిని సరఫరా చేస్తున్నట్లు వివరించారు.

నీలి విప్లవానికి నరేంద్ర వర్మ బ్రాండ్ అంబాసిడర్

నీలివిప్లవానికి తాను బాండ్ అంబాసిడర్‌గా నిలిచినట్లు నరేంద్ర వర్మ తెలిపారు. ఆక్వా రంగంలో తాను పట్టిందల్లా బంగారమేనని తెలిపారు. ఆక్వా రంగంలో సాంకేతికతను జోడించి నూతన పోకడలకు శ్రీకారం చుట్టి రొయ్యల దిగుబడిలో రికార్డు సృష్టించామన్నారు. రాయల్ మెరైన్ ఇంపెక్స్ సంస్థను స్థాపించి వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆక్వా రంగంలో తన సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం 2015లో ఉత్తమ రైతు అవార్డు ,2016లో బెస్ట్ క్వాలిటీ అవార్డు, 2017లో బెస్ట్ ఆక్వా కల్చర్ సెక్టార్ అవార్డును ప్రదానం చేసినట్లు తెలిపారు.



రంజాన్ తోఫా అందజేస్తున్న నరేంద్ర వర్మ

అన్న క్యాంటీన్ ద్వారా...

టిడిపి కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్ కు అనూహ్య స్పందన లబిస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ చివరి నాటికి 180 రోజులుగా అన్న క్యాంటీన్ కొనసాగుతున్నట్లు తెలిపారు. అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు పట్టెడన్నం పెట్టాలనే నరేంద్ర వర్మ సంకల్పానికి దాతలు సహాయ సహకారాలు అందిస్తున్నారు.



నష్టాల బాటలో ఇటుక బట్టీల యాజమానులు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

ఇటుక పరిశ్రమలో కార్మికుల శ్రమ దోపిడీ ఎంత ఉందో అంతకు మించి నష్టాలు కూడా ఉన్నాయి. ఒకప్పుడు ఈ పరిశ్రమ లాభాల బాటలో కొనసాగటంతో ఇతర జిల్లాల నుంచి రైతులు కొల్లూరు మండలం లో పలు గ్రామాలలో మెట్ట భూములు కొనుగోలు చేసి ఇటుక పరిశ్రమకు శ్రీకారం చుట్టారు. అప్పటివరకు ఇక్కడ ఉన్న రైతులు అరకొరగా ఇటుక రాయి తీస్తూ ఉండేవారు. నెల్లూరు,ప్రకాశం,కష్ణా జిల్లా నుంచి అనేక మంది రైతులు తామె కొనుగోలు చేసిన భూములలో మట్టిని త్రవ్వి ఇటుకను తయారు చేసి రాష్ట్రం లో పలు జిల్లాలకు వ్యాపారం విస్తరింపజేశారు. బంక ఒండ్రు కలిగిన మట్టి ఈ ప్రాంతంలో ఉండటంతో దీనితో తయారుచేసి న ఇటుక అత్యంత నాణ్యత కలిగి మాన్నికగా ఉండటంతో కొల్లూరు ఇటుక పేరుగాంచింది. దాదాపు యాభై ఏళ్లుగా ఈ ప్రాంతంలో ఇటుక పరిశ్రమ కొనసాగుతుంది. దీనికి గాను రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండే కాక ఒరిస్సా,తమిళనాడు, కేరళ,బెంగాల్,బీహార్ వంటి రాష్ట్రాల నుంచి కార్మికులు వలస వచ్చి జీవనం సాగిస్తూ ఉంటారు.



పెరిగిన మెటీరియల్ ధరలు

ఇటుక తయారీకి వినియోగించే రామెటీరియల్ ధరలు పెరగడంతో యజమానులు నష్టాలను చవిచూస్తున్నారు. ఒకప్పుడు రూ.10 నుంచి రూ. 20 వేలు పలికే లారీ ఊక ధర నేడు రూ.50 రూ.60 వేలు,బొగ్గు లారీ రూ.80 వేల నుంచి మూడు లక్షలకు పెరిగింది. దీంతో ఇటుకల ధర పెరిగింది. అయినప్పటికీ వివిధ ఖర్చులు, కారణాలతో పరిశ్రమ గిట్టుబాటు కాక నష్టాలు తప్పడం లేని ఇటుక బట్టీల యాజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏప్రిల్,మే నెలలో కురుస్తున్న అకాల వర్షాలకు పచ్చి ఇటుక తడిచి మరింత నష్టాలకు గురికావాల్సి వస్తుందని వారు వాపోతున్నారు.

గండితో ఇక్కట్లు

కొల్లూరు మండలం పెసర్లంక గ్రామం అరవింద వారధికి ఎగువన కష్ణా నదికి గండి ఏర్పడింది. దీంతో వందలాది ఎకరాలలో వాణిజ్య పంటలు పదుల సంఖ్యలో ఉన్న ఇటుక బట్టీలు నీట మునుగుతున్నాయి. ఐదారు నెలల పాటు పదడుగుల వరకు వరదనీరు నిలబడి ఇటుక అమ్ముకోవటానికి వీలు లేక పెట్టిన పెట్టుబడులకు వడ్డీలు కట్టలేక అల్లా డుతున్నట్లు కొల్లూరు ప్రాంత బట్టి యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గండిని పూడ్చి ఆదుకోవాలని ప్రజాప్రతినిధులు, ధికారులను కోరిన ఫలితం లేదని వాపోతున్నారు. ఈ గండి ద్వారానే నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. అక్రమ ఇసుక రవాణాకు అడ్డాగా ఉన్న ఈ గండిని పూడ్చేందుకు నాయకులు,ప్రజాప్రతినిధులు ముందుకు రావడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు గండిని పూడ్చి తమను ఆదుకోవాలని బట్టీ యజమానులు కోరుతున్నారు.





బాపట్ల అభివృద్ధికి కృషి : కోన రఘుపతి



సిఎం జగన్ తో కోన రఘుపతి

ప్రజాశక్తి బాపట్ల

బాపట్ల అభివృద్ధిలో కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ బాపట్ల అభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాల గురించి వివరించారు. బాపట్ల జిల్లాగా ఏర్పడుతుందన్న ముందు చూపుతో రహదారుల విస్తరణకు చొరవ చూపినట్లు తెలిపారు. జిల్లాగా ఏర్పడితే పెరుగుతున్న జనాభా , ఇతర నియోజకవర్గాల నుంచి బాపట్లకు వచ్చే ప్రజల అవసరాలకు అనుగుణంగా పట్టణాన్ని ఎలా విస్తరించాలనే దూర దష్టితో బాపట్ల పట్టణ అభివద్ధికి కోన వేసిన బాటలు మంచి ఫలితాలు ఇచ్చినట్లు తెలిపారు. తన హయాంలోనే జాతీయ రహదారి 216 /ఎ కి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. పట్టణంలో ఇరుకుగా ఉన్న రహదారులను విస్తరించేందుకు పలు చారిత్రాత్మకమైన నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. చీలు రోడ్డు సెంటర్ మొదలు విద్యుత్ సబ్ స్టేషన్ వరకూ కోట్ల రూపాయల విలువైన స్థలాలను రహదారి విస్తరణకు స్వీకరించినట్లు తెలిపారు. 2019లో బాపట్ల అసెంబ్లీ నుంచి తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి చతుర్ముఖ పోటీలో 30వేల ఓట్లు సాధించినట్లు తెలిపారు. 2014, 19 ఎన్నికల్లో ఎమ్మెల్యే గెలుపొందినట్లు తెలిపారు. హ్యాట్రిక్ సాధించే దిశగా తమదైన శైలిలో అడుగులు వేస్తున్నట్లు తెలిపారు.

బాపట్ల కీర్తి కిరీటంలో కలికితురాయిగా వైద్య కళాశాల

బాపట్లలో వైద్య కళాశాలకు నిర్మాణానికి తన హయాంలోనే పునాది పడదినట్లు తెలిపారు. రూ.505 కోట్లతో నిర్మిస్తున్న ఈ వైద్య కళాశాలకు నలువైపులా రహదారుల విస్తరణ కు ఓ ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. బాపట్ల చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే ఈ వైద్య కళాశాల ద్వారా వేలాది మందికి ఉపాధితో పాటు దాదాపు మూడు జిల్లాల ప్రజలకు ఉచితంగా నాణ్యమైన వైద్యసేవలు అందనున్నట్లు తెలిపారు.

గుర్తింపును తెచ్చి జగనన్న ఇళ్ల స్థలాలు..

జగనన్న కాలనీలో అర్హులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు విషయంతో బాపట్లకు ఓ ప్రత్యేక స్థానం ఉందన్నారు. రాష్ట్రంలో పట్టణ ప్రాంతాల్లో జగనన్న కాలనీ లబ్ధిదారులకు సెంటు స్థలం మాత్రమే మంజూరు చేశారు. బాపట్లలో సెంటున్నర స్థలం చొప్పున మంజూరు చేసి నట్లు తెలిపారు.

రహదారుల విస్తరణ

బాపట్లలో రహదారుల విస్తరించడంలో తనపేరు శాశ్వతంగా నిలిచిపోయే విధంగా ప్రత్యేక ముద్ర పడినట్లు కోన రఘు పతి తెలిపారు. జిల్లా కేంద్రానికి అవసరమైన రహదారుల విస్తరణలో తనకు తానే సాటిగా నిలిచినట్లు తెలిపారు. ప్రధానంగా రైల్వే స్టేషన్ రోడ్డు, శివాలయం, రథం బజార్ ,ఏజీ కాలేజీ రోడ్లు విస్తరణతో బాపట్ల పట్టణానికి నూతన శోభ సంతరించుకున్నట్లు తెలిపారు. బాపట్ల పట్టణంలో జిబిసి రోడ్డు విస్తరణలో కోట్లాది రూపాయలు విలువచేసే భవనాలు తొలగించాల్సి వచ్చినప్పటికీ వెనుకాడ లేదని తెలిపారు. బాపట్లలో ట్రాఫిక్ సమస్యకు దాదాపు తెరపడినట్లు ఎమ్మెల్యే కోన తెలిపారు.


మే డే శుభాకాంక్షలతో
కార్మిక సోదరులకు రైతులకు ,
మిత్రులకు, శ్రేయోభిలాషులకు
ప్రపంచ కార్మిక దినోత్సవం
మే డే శుభాకాంక్షలు తెలుపుతూ..
ప్రొ: కె.ఈశ్వరబాబు
శ్రీ కృష్ణా స్టీల్స్
డీలర్స్ - సిమెంట్: భారతి, జువారి, అల్ట్రాటెక్, కాకతీయ,పరాశక్తి, సువర్ణ, శ్రీచక్ర, డెక్కన్, నాగార్జున
ఐరన్: టాటా, వైజాగ్, హైదరాబాద్, సింహాద్రి, ఐ స్టీల్
వేదాంతంవారివీధి, రైలుపేట, రేపల్లె - 522265
E-mail : srikrishnasteels.repalle@gmail.com,సెల్: 92900 81569,99511 77071
సెల్ : 08648 - 222990,22254
మార్బుల్ షోరూం
శ్రీ కృష్ణా స్టీల్స్ వారి మార్బుల్ షోరూం
గవర్నమెంట్ హాస్పటల్ ఎదురు, రేపల్లె
రాజస్థాన్ మార్బుల్ మరియు గ్రానైట్ లభించును


నూతనంగా ఏర్పాటైన బాపట్ల జిల్లా పరిధిలోని ప్రజలందరికీ మేడే శుభాకాంక్షలు
ప్రజాశక్తి
శ్రేయోభిలాషి
బాపట్ల


1 MAY
మే డే శుభాకాంక్షలు...
గ్రామ పంచాయితీ,అడివి
బాపట్ల మండలం, బాపట్ల జిల్లా.
అడవి గ్రామ పంచాయితీ
అభివృద్ధికి సహకరిస్తున్న
ప్రజా ప్రతినిధులకు,
జిల్లా అధికారులకు,
గ్రామ ప్రజలకు
మేడే శుభాకాంక్షలు...
జి.ఆర్.డి.ప్రసాద్
పంచాయతీ కార్యదర్శి,అడివి.
చిన్నం. సుధారాణి.
స్పెషల్ ఆఫీసర్,
తహసీల్దార్, బాపట్ల


ప్రపంచ కార్మిక దినోత్సవ
శుభాకాంక్షలు
అంతర్జాతీయ కార్మిక దినోత్సవం
మేడే సందర్భంగా కార్మికసోదరులకి మేడే శుభాకాంక్షలు
జిల్లా రిజిస్ట్రార్, బాపట్ల
సబ్ రిజిస్ట్రార్
బాపట్ల


MAY
1
International WORKERS DAY
మేడే
శుభాకాంక్షలతో.
సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ
చెరుకుపల్లి, బాపట్ల జిల్లా
సిహెచ్. భీమాబాయి
సబ్‌రిజిస్ట్రార్
మరియు కార్యాలయ సిబ్బంది


MAY DAY
HAPPY LABOUR DAY
మే డే శుభాకాంక్షలు
బాపట్ల జిల్లా లోని కార్మిక సోదరులకు రైతులకు,
మిత్రులకు, శ్రేయోభిలాషులకు ప్రపంచ కార్మిక దినోత్సవం
మే డే శుభాకాంక్షలు తెలుపుతూ..
K.విజయ
DPEO, బాపట్ల
CH.శ్రీనివాస మూర్తి
ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్, బాపట్ల
జిల్లా మద్య నిషేధ మరియు
ఆబ్కారీ అధికారివారి కార్యాలయం
బాపట్ల - బాపట్ల జిల్లా





ఆదర్శ గ్రామంగా గోపాపురం

పాముల నరేష్‌బాబు, సర్పంచి

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

ప్రధానమంత్రి ఆదర్శ గ్రామం పథకం ద్వారా గ్రామాభివృద్ధికి కృషి చేసినట్లు గోపాపురం సర్పంచి పాముల నరేష్‌బాబు తెలిపారు. ఈ పథకం తమ గ్రామానికి దక్కడం సంతోషదాయకమన్నారు. గ్రామంలో ప్రధాన రహదారిని నిర్మించినట్లు తెలిపారు. కీవాల్ డస్ట్‌తో మరికొన్ని రోడ్లు పూర్తి చేసినట్లు తెలిపారు. రూ.10 లక్షల వ్యయంతో సైడ్ కాలువలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తాగునీటి స్కీం కోసం రూ.25 లక్షలతో పనులు జరుగుతున్నాయి. మరో రూ.30 లక్షల అభివృద్ధి పనులు చేపట్టాల్సిఉందన్నారు.















అభివృద్ధి బాటల్లో పూండ్ల గ్రామం

ప్రజాశక్తి-బాపట్ల రూరల్



సర్పంచి
నన్నం నరసింహారావు

పూండ్ల గ్రామ అభివృద్ధిలో సర్పంచి నన్నం నరసింహారావు తన మార్కు అభివృద్ధిని చేసి చూపించారు. మొత్తం కోటిన్నర పైచిలుకు నిధులు వెచ్చించి గ్రామాభివృద్ధికి కృషి చేశారు. రూ.40 లక్షలతో సచివాలయం భవన నిర్మాణం, రూ.17.5 లక్షలతో ప్రాథమిక చికిత్స కేంద్రం నిర్మాణంలో ఉంది. రూ.20 లక్షలతో సిసి రోడ్లను నిర్మించారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు రూ.10 లక్షల వ్యయంతో మైక్రో ఫిల్టర్లను ఏర్పాటు చేశారు. స్వచ్ఛ భారత్ నిధులు రూ.3 లక్షలతో కమ్యూనిటీ టాయిలెట్స్ నిర్మించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం రూ.16.5 లక్షల నిధులు వెచ్చించి అభివృద్ధి చేశారు. రూ.10 లక్షలతో స్టోన్ డస్ట్ వాల్, రోడ్ల నిర్మాణం జరిగింది. అలాగే జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా గ్రామంలో ఘన వ్యర్థాల నిర్వహణ కార్యక్రమంలో ప్రథమ స్థానంలో పూండ్ల గ్రామం నిలిచింది.



అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణంతో నూతన ఒరవడికి శ్రీకారం

చేగూడి వజ్రమ్మ శ్రీకాంత్, సర్పంచ్, మురుకుండపాడు

ప్రజాశక్తి-బాపట్ల రూరల్: తాను సర్పంచిగా బాధ్యతలు స్వీకరించాక పారిశుధ్య మెరుగుకు కృషి చేసినట్లు మండలంలోని మురుకుండపాడు గ్రామ సర్పంచి చేగూడి వజ్రమ్మ శ్రీకాంత్ తెలిపారు. పారిశుధ్య మెరుగుకు శాశ్వత పరిష్కారంగా హైదరాబాద్‌లో లాగా ఇక్కడ కూడా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేయాలనే ఆలోచన ఇంజనీర్లతో పంచుకున్నట్లు తెలిపారు. వారి సహకారంతో గ్రామంలో కొంతమేర అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేశాం. దీని వలన మంచి ఫలితాలొచ్చాయి. ఇదే స్ఫూర్తితో గ్రామం మొత్తం ఇలాగే చేయాలని నిర్ణయించుకున్నాను. తాగునీటి కోసం ఇంటింటికీ కుళాయి పథకంలో 20 కుళాయిలు ఏర్పాటు చేశామన్నారు. అలాగే ఫిల్టర్ బెడ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నూతన పైపు నిర్మాణం చేపట్టామన్నారు. గ్రామంలో ఆర్‌బీకే నిర్మాణం, డిజిటల్ లైబ్రరీ, బల్క్ మిల్క్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

అసంఘటితరంగ కార్మికుల ఆర్థిక భద్రతకు..

ఈ-శ్రమ్ కార్డు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

అసంఘటిత రంగంలోని కార్మికులకు ఆర్థిక భద్రత కల్పించడంతోపాటు సంఘటిత రంగ కార్మికులతో సమానంగా ప్రయోజనాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ-శ్రమ పోర్టల్‌ను ప్రారంభించింది. ఈ పోర్టల్ ద్వారా దేశంలోని అసంఘటిత రంగ కార్మికులకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి అన్ని ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను వారికి అందజేయడమే ప్రభుత్వ ఉద్దేశం. ఇందుకోసం కూలీలకు ఈ-శ్రమ్ కార్డులు అందజేస్తారు. ప్రభుత్వ పథకాల నుంచి సులభంగా ఉపాధి పొందే అవకాశాలను చూపుతున్నారు.

ఈ-శ్రమ్ కార్డ్ అంటే?

ఈ-శ్రమ్ కార్డ్ అనేది కార్మికులకు ప్రభుత్వం జారీ చేసే ప్రత్యేక కార్డు. ఈ కార్డు ద్వారా సదరు కార్మికుడు అసంఘటిత రంగంలోని వారని రుజువు చేస్తుంది. దీని ద్వారా కార్మికులు తమ ప్రయోజనాలను పొందేందుకు పెద్దగా పరుగులు తీయాల్సిన అవసరం ఉండదు. దీని వలన అసంఘటిత రంగ కార్మికులకు అందుబాటులో ఉన్న అన్ని ప్రయోజనాలు అందుతాయి. ఈ-శ్రమ్ కార్డు పొందిన కూలీలు దేశంలో ఎక్కడైనా ఉపాధి పొందడం సులభం అవుతుంది. డేటాబేస్‌లో వారికి సంబంధించిన డేటా వల్ల వారు పనిని సులభంగా పొందుతారు. ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదైన కార్మికుడికి రూ.2 లక్షల ప్రమాద బీమా కవరేజీ ఉంటుంది. పోర్టల్‌లో నమోదైన కార్మికుడు ప్రమాదానికి గురైతే, మరణం లేదా పూర్తి అంగవైకల్యం సంభవించినప్పుడు రూ.2 లక్షల మొత్తం ఇస్తారు. అదే సమయంలో కార్మికుడు పాక్షికంగా అంగవైకల్యం కలిగి ఉంటే ఈ బీమా పథకం కింద లక్ష రూపాయలకు అర్హులవుతారు. ఈ కార్డు సహాయంతో అసంఘటిత రంగ కార్మికులకు ప్రధానమంత్రి శ్రమ యోగి మాన్ ధన్ యోజన, స్వయం ఉపాధి కోసం జాతీయ పెన్షన్ పథకం, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, ప్రజా పంపిణీ వ్యవస్థ, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, జాతీయ ప్రభుత్వ పథకాలైన సామాజిక సహాయ పథకం, ఆయుష్మాన్ భారత్, నేత కార్మికులకు ఆరోగ్య పథకం, ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన, ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం వంటి వాటి ద్వారా ప్రయోజనం పొందే వీలు లభిస్తుంది. అసంఘటిత రంగంలో పనిచేసే 16 నుంచి 59 సంవత్సరాల వయస్సు గల ఎవరైనా ఈ కార్డు కోసం నమోదు చేసుకోవచ్చు. కార్మికుడు స్వయంగా లేదా ఈ-శ్రమ్ పోర్టల్ ద్వారా కామన్ సర్వీస్ సెంటర్‌ని సందర్శించడం ద్వారా నమోదు చేసుకోవచ్చు. నమోదు పూర్తిగా ఉచితం. కార్మికులు పోర్టల్ లేదా కామన్ సర్వీస్ సెంటర్‌లో రిజిస్ట్రేషన్ కోసం ఎటువంటి చెల్లింపులు చేయనవసరం లేదు. పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ కోసం కార్మికుని పేరు, వృత్తి, చిరునామా, విద్యార్హత, నైపుణ్యం వంటి సమాచారాన్ని ఇవ్వాలి.



ఈ-శ్రమ్ కార్డు పొందేందుకు..

ట్యూటర్, హౌస్ కీపర్, వంటమనిషి, గార్డ్, బ్యూటీ పార్లర్ వర్కర్, బార్బర్, చెప్పులు కుట్టేవారు, టైలర్, కార్పెంటర్, ప్లంబర్, ఎలక్ట్రీషియన్, పెయింటర్, టైల్ వర్కర్, వెల్డింగ్ వర్కర్, వ్యవసాయ కార్మికుడు, ఇటుకల బట్టీ కార్మికుడు, రాళ్ళు కొట్టేవాడు, క్వారీ కార్మికుడు, శిల్పి, మత్స్యకారుడు, రిక్షా పుల్లర్, వెయిటర్, రిసెప్షనిస్ట్, దుకాణంలో పనిచేసే సేల్స్‌మ్యాన్ లేదా హెల్పర్, ఆటో డ్రైవర్, పంక్చర్ మేకర్, పశుపోషకులు, జొమాటో స్విగ్గీ డెలివరీ బాయ్, అమెజాన్ ఫ్లిప్‌కార్ట్ డెలివరీ బాయ్, కొరియర్ బాయ్, వార్డ్‌బాయ్, వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లోని రోజువారీ వేతనంతో పనిచేసే వారు ఈ కార్డును తీసుకునేందుకు అర్హులు.

ఈ-శ్రమ్ కార్డ్ వల్ల ప్రయోజనాలు

60 ఏళ్ల వయస్సు వచ్చిన తర్వాత రూ.3 వేలు (కనీస) పెన్షన్ పొందుతారు. 60 సంవత్సరాల వయస్సు లోపు ఏదైనా ప్రమాదం జరిగితే మీకు పూర్తి బీమా లభిస్తుంది. ఏదైనా ప్రమాదం జరిగితే రూ 1 లక్ష బీమా పొందవచ్చు. అనుకోని ప్రమాదం జరిగితే లబ్ధిదారుడు మరణిస్తే అన్ని రకాల ఆర్థిక ప్రయోజనాలు భార్యకు బదిలీ చేయబడతాయి. ఈ-శ్రమ్ కార్డ్ ద్వారా నెలవారీ విరాళాన్ని అందించాల్సి ఉంటుంది మరియు అదే మొత్తం భారత ప్రభుత్వం ద్వారా క్రెడిట్ చేయబడుతుంది. ఈ-శ్రమ్ కార్డ్ ద్వారా కార్మికుల కోసం వర్తించే అన్ని ప్రభుత్వ పథకాలను పొందవచ్చు. ఈ-శ్రమ్‌లో చేరిన ప్రతి అసంఘటిత రంగ కార్మికునికి 12 అంకెలతో కూడిన ప్రత్యేక యూనివర్శల్ ఐడెంటిఫికేషన్ నంబరుతో కూడిన కార్డు

ఈ-శ్రమ్ కార్డ్ నమోదు కోసం..

పేరు, వృత్తి వంటి వివరాలు ఉన్న శాశ్వత చిరునామా, విద్యార్హత వివరాలు, పని నైపుణ్యం, అనుభవం వివరాలు, కుటుంబ సభ్యుల వివరాలు, ఆధార్ సంఖ్య, ఆధార్ కార్డుతో లింక్ చేయబడిన చెల్లుబాటు అయ్యే మొబైల్ నంబర్ ఉండాలి. విద్యుత్ బిల్లు లేదా రేషన్ కార్డ్, ఏదైనా బ్యాంక్ పాస్‌బుక్, వయస్సు 18-59 సంవత్సరాల మధ్య ఉండాలి, కార్మికుడు ఆదాయపు పన్ను చెల్లింపుదారునిగా ఉండకూడదు.



ఎమ్మెల్యే 'కోన' సహకారంతోనే ముందుకు..

గౌస్ వెల్డింగ్ షాపు అధినేత బాషా



ప్రజాశక్తి-బాపట్ల రూరల్

పెద్దాయన, మాజీ డిప్యూటీ స్పీకర్, బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి సహకారంతో తాను ముందుకు సాగుతున్నట్లు గౌస్ వెల్డింగ్ షాపు అధినేత మొల్లా నసీరుద్దీన్ బాషా తెలిపారు. బాపట్ల జిల్లా అభివృద్ధి నిర్మాణంలో తన వంతు సహకారం అందించడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. గ్రామ సచివాలయాల నిర్మాణం, ఆర్‌బీకే, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల నిర్మాణంలో తమ సంస్థ ద్వారా ఐరన్, స్టీల్ పనులు చేసినట్లు తెలిపారు. బాపట్ల పట్టణంలో చంద్రకళ పార్క్ పనులు, రైల్వే స్టేషన్ వద్ద అంబేద్కర్ విగ్రహ రైలింగ్ పనులు, సులభ్ కాంప్లెక్స్‌ల నిర్మాణం, పాత బస్టాండ్ నిర్మాణం, కలెక్టరేట్ సముదాయంలో పలుపనులు చేసినట్లు తెలిపారు. పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో స్టేజీ నిర్మాణం, జిల్లాలోని ఆయా పోలీస్ స్టేషన్లలో పనులు చేశాం. బాపట్లలో జగనన్న -3 కాలనీల్లో పైలాన్లు తయారు చేసే పని దక్కడం సంతోషాన్ని కలిగించిందన్నారు. బాపట్ల మునిసిపాలిటీలో చెత్త కుండీలు తయారు పనులు చేశాం. భవిష్యత్తులో ప్రభుత్వ సహకారంతో తమ వంతు కృషి చేస్తామని బాషా తెలిపారు.



ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా

బి.అనిల్ కుమార్, సర్పంచి, మూలపాలెం

ప్రజాశక్తి-బాపట్ల రూరల్: మండలంలోనే మూల పాలెం గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దేందుకు ఎమ్మెల్యే కోన రఘుపతి సహకారంతో కృషి చేస్తానని గ్రామ సర్పంచి బొలిమెర అనిల్ కుమార్ తెలిపారు. ప్రధాన రహదారిని సిసి రోడ్డుగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రూ.10 లక్షల వ్యయంతో సైడ్ డ్రెయిన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎంపియుపి పాఠశాల ప్రహరీ నిర్మాణం, రూ.5 లక్షలతో శ్మశానవాటికకు వెళ్లే రహదారిని నిర్మించినట్లు తెలిపారు. రూ.6 లక్షలతో నూతన విద్యుత్ లైన్లు, అమృత్ సరోవర్ ద్వారా తాగునీటి చెరువును అభివృద్ధి చేశామన్నారు. రూ.57.5 లక్షల వ్యయంతో సచివాలయం, వెల్‌నెస్ సెంటర్ నిర్మాణ పనులు కొనసాగుతున్నట్లు సర్పంచి అనిల్ కుమార్ తెలిపారు.







సూక్ష్మ చిన్నతరహా

పరిశ్రమల ఏర్పాటుకు కృషి

జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఎన్ మదన్ మోహన్ శెట్టి



ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

తనూతనంగా ఏర్పడిన బాపట్ల జిల్లా ప్రారిశ్రామికంగా అభివృద్ధి చెందేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఎన్ మదన్‌మోహన్‌శెట్టి తెలిపారు. జిల్లా ఆర్థికాభివృద్ధి చెందేందుకు బ్యాంకర్ల ఆర్థిక చేయూతతో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు తోడ్పాటునందిస్తూ పలు అంకుర పరిశ్రమల ఏర్పాటుకు తమవంతు కృషి చేస్తున్నట్లు చెప్పారు. బాపట్ల జిల్లాలో వ్యవసాయ ఆధారిత కంపెనీల ఏర్పాటుకు మార్గం సుగమం చేస్తూ పలు రకాల పరిశ్రమల ఏర్పాటుకు కృషి జరుగుతోందన్నారు. జిల్లా పరిశ్రమల కేంద్రం ద్వారా తయారీ రంగం, సేవారంగాల్లో పలు పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు ఇస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో పరిశ్రమల శాఖ ద్వారా చేపట్టిన పలు ప్రాజెక్టుల గురించి జిల్లా అధికారి ఎన్ మదన్ మోహన్ శెట్టి ప్రజాశక్తికి వివరించారు. సూక్ష్మ మరియు చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలను అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన యంత్ర సామాగ్రిని, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలను అందుబాటులోకి తెచ్చి ఉత్పత్తులను పెంచడంతో పాటు స్థానికులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగుపరచేందుకు రాష్ట్రప్రభుత్వం ఎపి ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ సంస్థ ద్వారా క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్, ర్యాంప్ ప్రోగ్రామ్‌లను అమలు చేస్తారు. కోవిడ్ వలన దెబ్బతిన్న పరిశ్రమలను తిరిగి నిలదొక్కుకునేలా వారికి సహకరించడం కోసం, మార్కెట్ అవకాశాల పెంపుదల కోసం, స్త్రీల భాగస్వామ్యాన్ని పెంచడం, ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలను అభివృద్ధి చేయడం కోసం ఈ కార్పొరేషన్ ఏర్పాటు చేశారు. దీని ద్వారా రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు విలువగల ప్రాజెక్టులను ఒక కేటగిరిగా రూ.10 నుంచి రూ.30 కోట్ల విలువగల ప్రాజెక్టులను మరొక కేటగిరిగా చేసి రుణాలు ఇవ్వనున్నారు. కేంద్ర ప్రభుత్వ వాటాతో ఈ ప్రాజెక్టులు మంజూరు అవుతాయి. రూ.10 కోట్ల లోపు ప్రాజెక్టు కోసం 10 సూక్ష్మ మరియు చిన్న తరహా పరిశ్రమలు ఒక క్లస్టర్‌గా ఏర్పడాలి. సేవారంగంలో కూడా ప్రాజెక్టులు మంజూరు చేస్తారు. చీరాలలో వైద్యరంగంలో అధునాతన యంత్ర పరికరాలు, పరిజ్ఞానం కోసం ఒక ప్రాజెక్టును మంజూరు చేస్తున్నారు. పారిశ్రామికవాడగా బాపట్ల జిల్లాను మార్చడానికి తీసుకుంటున్న చర్యల్లో భాగంగా చీరాల ఆటోనగర్లో పలు రకాల పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులు ఇస్తున్నట్లు చెప్పారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో 10 సూక్ష్మ పరిశ్రమల స్థాపనకు ఆమోదం తెలిపారు. సింగిల్ డెస్క్ పోర్టల్లో వచ్చిన 230 దరఖాస్తులను పరిశీలించి 218 యూనిట్ల స్థాపనకు అనుమతులిచ్చారు. అద్దంకి వద్ద రూ.11 కోట్లతో మెటల్ డోర్స్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసే అంశంపై చర్చించారు. ఈ కేంద్రం ఏర్పాటైతే బాపట్ల జిల్లాలోనే మెటల్ డోర్స్ తయారవుతాయి. వేమూరు మండలం జంపని గ్రామంలో భారత్ టెక్స్‌టైల్స్ క్లస్టర్ అసోసియేషన్ ద్వారా రూ.10 కోట్ల అంచనాలతో అరిటి బోదెలు, పట్టుపురుగుల వ్యర్థాలతో వస్త్రాల తయారీ కేంద్రం ఏర్పాటుపై చర్చించారు. సంబంధిత ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయడానికి కావలసిన భూమి కేటాయింపుల ప్రతిపాదనలను పరిశీలిస్తున్నారు. జిల్లాలో కాలుష్యం లేని కంపెనీల ఏర్పాటు కోసం రూ.15 కోట్లతో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ భవన నిర్మాణ ప్రతిపాదనలు ఉన్నాయి. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి చేయూతతో ఈ ప్రాజెక్టు నెలకొల్పాల్సి ఉంది. అలానే సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల పార్క్ ఏర్పాటు కోసం బాపట్ల, రేపల్లె, చీరాలలో 25 ఎకరాల భూమి కేటాయింపుల కోసం సంబంధిత అధికారులకు నివేదికలు పంపారు. జిల్లాలోని మేదరమెట్ల వద్ద రూ.225 కోట్ల అంచనాలతో ఎథనాల్ తయారీ పరిశ్రమ ఏర్పాటుకు శర్వానీ బయోఫ్యూయెల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ రాష్ట్ర ప్రభుత్వంతో ఎంవోయు కుదుర్చుకుంది. నూతనంగా పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే వారికి తగిన సాంకేతిక సలహాలు, పరిజ్ఞానం అందజేసేందుకు కోసం రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ఆర్ ఏపి వన్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీని ద్వారా రంగాల వారీగా ప్రాజెక్టు ప్రొఫైల్, ల్యాండ్ బ్యాంక్ వివరాలు, ముడి పదార్థాల లభ్యత, పారిశ్రామిక సంభావ్య సర్వే, నిపుణులతో సమావేశాలు జరపడం, అంకుర పరిశ్రమల ఏర్పాటుపై ఫీడ్ బ్యాక్ తీసుకోవడం లాంటి వాటి కోసం వైఎస్ఆర్ ఏపి వన్ యాప్ ఉపకరిస్తుంది. దీంతో పాటు కేంద్ర ప్రభుత్వం ఉద్యమి (అల్టిమేట్ డ్రీమ్ ఆఫ్ యంగ్ అండ్ మోడరన్ ఇండియా) అనే యాప్‌ను సూక్ష్మ మరియు చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన సాంకేతిక సాయం, ప్రాజెక్టు రిపోర్టుల తయారీలో సలహాల కోసం దేశవ్యాప్తంగా అందుబాటులోకి తెచ్చింది. ఈ రెండు యాప్‌ల ద్వారా నూతన పరిశ్రమల ఏర్పాటుకు కాలసిన అన్ని వివరాలు, సలహాలు లభ్యమవుతాయి.

ఉద్యమాన్ని బలహీనపరిచే యత్నాలు సాగవు

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

ఉద్యోగుల సంక్షేమం కోసం చేస్తున్న పోరాటాన్ని బలహీనపరిచే ప్రయత్నాలను సాగనివ్వబోమని ఏపి జేఏసీ అమరావతి చైర్మన్ సురేష్ అన్నారు. సొంత పత్రికలో రెవెన్యూ జేఏసీ అధ్యక్షుడినని చెప్పుకొని తిరుగుతున్న దివాకర్ అనే వ్యక్తి ఒక ప్రెస్‌మీట్ పెట్టి ఏపిజేఏసీ అమరావతి నిజాయితీగా చేస్తున్న ఉద్యమం గురించి అవాకులు చవాకులు పేలారని, దీనిని జేఏసి అమరావతి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ బాపట్ల జిల్లా పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఏ రాజకీయ జెండా లేకుండా ఉద్యోగుల సమస్యలే ఎజెండాగా, సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిజాయితీగా కొనసాగుతున్న గొప్ప ఉద్యమాన్ని నీరుగార్చే ప్రయత్నం చేయడం అంటే ఆకాశం మీద ఉమ్మి వేయడమే అని సురేష్ బాబు, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కె రాజా రమేష్ మోహన్ పేర్కొన్నారు. ఉద్యోగుల అపరిష్కృత డిమాండ్ల సాధనకై బొప్పరాజు నేతృత్వం వహిస్తున్న ఏపి అమరావతి గత మార్చి 9 నుంచి మొదలు పెట్టిన ఉద్యమం రోజు రోజుకూ తీవ్రతరం అవు తోందని తెలిపారు. ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలు, ప్రజా సంఘాలు అందరూ ఏకతాటిపైకి వస్తున్న దశలో ప్రభుత్వం ఆత్మరక్షణలో పడి ఆగమేఘాల మీద ఒక స్క్రిప్ట్ తయారు చేసి బంటు నంబర్ 2 దివాకర్ లాంటి దారినపోయే దానయ్యతో అసత్య స్టేట్మెంట్లు ఇప్పిస్తూ ఉద్యమాన్ని నీరు గార్చే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ప్రజల దృష్టిలో మమ్మల్ని దోషులుగా నిలబెట్టే ఎత్తుగడ వేస్తోందన్నారు. ఇక్కడే అందరు ఉద్యోగులు మేల్కొనాలని, నిజాలు తెలుసుకోవాలని కోరారు. ఇలాంటి చిల్లర ప్రయత్నాల వల్ల స్క్రిప్ట్ రైటర్లు పుండు మీద కారం చల్లారు. దీని వల్ల వీరి లక్ష్యం నెరవేరదన్నారు. ఈ చర్యల వల్ల రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులు ఇంకా పట్టుదలతో, రెట్టించిన ఉత్సాహంతో వారి ప్రయత్నాలను తిప్పికొట్టేలా ఉద్యమాల్లో పాల్గొనడం ద్వారా వారి కుటిల యత్నాలను ఎండగట్టాలి. దివాకర్ ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదివారని, ఆయన దగ్గర ఈ కింది వాటికి సమాధానాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. ఉద్యోగులకు ఇప్పటిదాకా ఎన్ని డీఏలు పెండింగులో వున్నాయి. ఉద్యోగులకు రావలసిన పిఆర్‌సి బకాయిల మొత్తం ఎంత? ఉద్యోగుల జీపిఎఫ్ ఖాతాల నుంచి మాయమైపోయిన డబ్బు ఎంత? ఈహెచ్ఎస్ సబ్‌స్క్రిప్షన్ డబ్బులు ఎక్కడికెక్కళ్లాయి? సరెండర్ లీవు కోసం ఉద్యోగులు ఎదురు చూస్తున్న డబ్బులు ఎంత దూరంలో వున్నాయి? సాక్షాత్తూ ముఖ్యమంత్రి ఇచ్చిన సిపిఎస్ రద్దు హామీ గడువు వారం రోజులు పూర్తి కాలేదా? శ్రమదోపిడీకి గురవుతున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రబద్ధీకరణ ఏ మూలన పడిపోయింది? సమగ్ర శిక్షలో దాదాపు 25 వేల మంది ఉద్యోగులకు 3 నెలలుగా జీతాలు అందలేదన్న విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. అణచివేత అధికమైతే తిరుగు బాటు తీవ్రతరం అవుతుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని ఘాటుగా హెచ్చరించారు.


ఏపి జేఏసి చైర్మన్ సిహెచ్ సురేష్‌బాబు

నిజాంపట్నం, చీరాల వాడరేవుల్లో ఫిషింగ్ హార్బర్లు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

నూతనంగా ఏర్పడిన బాపట్ల జిల్లాలో 74 కిలోమీటర్ల మేర సముద్రతీరం ఉంది. 65 మత్స్యకార గ్రామాల్లో 54 వేల మంది మత్స్యకారులు సముద్రాన్ని నమ్ముకుని జీవిస్తున్నారు. జిల్లాలో అన్ని రకాల బోట్లు కలిపి 2,986 వరకు ఉన్నాయి. సముద్రతీర ప్రాంతంలో ఉండే మత్స్యకారులకు చేపల వేటే జీవనాధారం. ప్రతిరోజూ లోతైన సముద్రజలాల్లో వేటకు వెళ్లే మెకనైజ్డ్ బోట్లు, మోటరైజ్డ్ బోట్లను సముద్రపు ఒడ్డున నిలిపి ఉంచేందుకు జిల్లా తీరంలో ఫిషింగ్ హార్బర్లు లేకపోవడంతో మత్స్యకారులు ఇబ్బందులు పడుతూ వచ్చారు. ఈ నేపథ్యంలో చేపల వేటను మరింతగా ప్రోత్సహిస్తూ మత్స్య ఉత్పత్తులను భారీఎత్తున ఎగుమతులు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం బాపట్ల జిల్లాలోని నిజాంపట్నం, చీరాల వాడరేవుల్లో రెండు ఫిషింగ్ హార్బర్ల నిర్మాణాలు జరపాలని నిర్ణయించింది. ఈ మేరకు నిజాంపట్నం వద్ద రూ.450 కోట్ల వ్యయంతో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం జరుగుతోంది. రూ.250 కోట్లతో ఒడ్డుకు బోట్లు రావడానికి వీలుగా మొగ నిర్మాణాలు, మరో రూ.200 కోట్లతో జెట్టి నిర్మాణాలు పూర్తి కావచ్చాయి. పరిపాలనా భవనాలు నిర్మించాల్సి ఉంది. రానున్న రెండు నెలల కాలంలో హార్బర్ నిర్మాణం పూర్తి చేసే దిశగా పనులు జరుగుతున్నాయి. చీరాల వాడరేవులో రూ.450 కోట్లతో ఫ్లోటింగ్ హార్బర్ నిర్మాణానికి టెండర్లు పూర్తి అయ్యాయి. సముద్రపు ఒడ్డున ఉన్న 19 ఎకరాల భూమిని హార్బర్ కోసం కేటాయించారు. దీనిలో కొంత భూమి కేటాయింపుల్లో సమస్యలు తలెత్తాయి. రెవెన్యూపరంగా ఉన్న భూ సమస్య పరిష్కారం కోసం నివేదిక తయారు చేశారు. టెండర్ కూడా ఖరారయిన నేపథ్యంలో త్వరలోనే హార్బర్ పనులకు శంఖుస్థాపన జరిపి, నిర్మాణ పనులు ప్రారంభిస్తారు.


చీరాల వాడరేవు ఫిషింగ్ హార్బర్ నమూనా

ప్రతిఘటిస్తేనే..

(మొదటిపేజీ తరువాయి)

సామ్రాజ్యవాదులు అమెరికా నాయకత్వంలో ఉద్రిక్తతలను, యుద్ధాలను సృష్టిస్తున్నారు. తమ వ్యాపార, వాణిజ్య సామ్రాజ్యాలను వర్ధమాన దేశాల్లో విస్తరించడానికి రకరకాల ఎత్తుగడలు వేస్తున్నారు. రష్యా – ఉక్రెయిన్ యుద్ధం సామ్రాజ్యవాద ఎత్తుగడల్లో భాగమే. ఉక్రెయిన్‌ను 'నాటో' కూటమిలో చేర్చుకుని, నాటోను విస్తరించి తన ఆధిపత్యాన్ని చాటుకోవడానికి అమెరికా చేసిన ప్రయత్నమే ప్రస్తుత పరిస్థితికి కారణం. ఇటువంటి యుద్ధాలు, ఉద్రిక్తతలు సృష్టించడం ద్వారా అమెరికా తన ఆయుధాలను అమ్ముకోగలుగుతుంది. ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాద విధానాలకు, ప్రపంచీకరణ విధానాలకు వ్యతిరేకంగా పెద్దఎత్తున ఉద్యమాలు, పోరాటాలు జరుగుతున్నాయి. లాటిన్ ఆమెరికాలోని అనేక దేశాల్లో వామపక్ష శక్తులు విజయం సాధిస్తున్నాయి. ఇటీవల చిలీ అధ్యక్ష ఎన్నికల్లో వామపక్ష అభ్యర్థి విజయం సాధించడం గొప్ప ముందడుగు. శ్రీలంక వంటి దేశాలు ఆర్థికంగా దివాళా తీయడానికి ఆ ప్రభుత్వాలు అనుసరించిన 'అంతర్జాతీయ ద్రవ్యనిధి' విధానాలే కారణం. ఈ క్రమంలో ప్రపంచీకరణ విధానాలకు పెరుగుతున్న ప్రతిఘటన ఉద్యమాలను ముందుకు తీసుకెళ్లాలి.

భారతదేశం - ప్రైవేటీకరణ, మతతత్వ విధానాలు

భారతదేశంలో నరేంద్రమోడీ ప్రభుత్వం సరళీకరణ – ప్రైవేటీకరణ – ప్రపంచీకరణ విధానాల అమలును వేగవంతం చేయడంతోపాటు ప్రజల మధ్య ఐక్యతను దెబ్బతీయడానికి మతతత్వాన్ని బహిరంగంగా ప్రోత్సహిస్తోంది. ప్రైవేటీకరణలో భాగంగా 'మానిటైజేషన్' విధానాలు అమలు చేస్తామని దేశ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టంగా ప్రకటించారు. లాభాలతో నడుస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలు సహా అన్నింటినీ ప్రైవేటీకరిస్తామని ప్రకటించారు. దీనిలో భాగమే 'విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు' నినాదంతో పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించడం. దీనికి వ్యతిరేకంగా విశాఖ నగరంలో దీర్ఘకాలికంగా ఉద్యమం జరుగుతోంది. ఆంధ్ర ప్రదేశ్‌లోని మిగిలిన జిల్లాల ప్రజలు, కార్మికులు కూడా ఉక్కు కర్మాగారాన్ని రక్షించుకునే ఉద్యమంలో భాగస్వాములు కావాలి. దేశ ఆర్థిక వ్యవస్థకు కొండంత అండగా ఉన్న ఎల్‌ఐసి (జీవిత బీమా సంస్థ)ని ప్రైవేటీకరించడానికి ప్రయత్నాలు ప్రారంభించింది. కార్మికుల హక్కులు కాలరాయడానికి నాలుగు లేబర్ కోడ్‌ల చట్టాలను రూపొందించింది. వీటన్నింటినీ నిలువరించాలంటే కేంద్ర ప్రభుత్వ విధానాలను కార్మికులు, ఉద్యోగులు ఐకమత్యంగా ప్రతిఘటించాలి.

నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలను మతపరంగా చీలదీసే ప్రయత్నాలు ప్రారంభించింది. పౌరసత్వ సవరణ చట్టం, జమ్ము–కాశ్మీర్‌కు స్వయంప్రతిపత్తిని కల్పించే 370 నిబంధనను రద్దు చేయడం, మైనార్టీలపై మతపరమైన దాడులు దీనిలో భాగమే. ఇప్పుడు దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో ముఖ్యంగా బిజెపి అధికారంలో ఉన్న కర్నాటక, మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లో మతపరమైన ప్రదర్శనలు నిర్వహిస్తూ, మైనార్టీలపై దాడులు చేస్తున్నారు. ప్రజల మధ్య మతపరమైన సామరస్యాన్ని దెబ్బతీయడం ద్వారా కార్మికోద్యమాన్ని, కార్మికవర్గ ఐక్యతను దెబ్బతీయడం కూడా పాలకవర్గాల లక్ష్యంగా ఉంటోంది. దేశంలో మత సామరస్యాన్ని, రాజ్యాంగ లక్ష్యాలను కాపాడుకోవాల్సిన బాధ్యత కార్మికవర్గంపై ఉంది.

నరేంద్రమోడీ ప్రభుత్వ ఆర్థిక, సామాజిక, విధానాలపై విస్తృతమైన ఉద్యమాన్ని నిర్మించాల్సిన అవసరం ఉంది. వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో జరిగిన రైతు ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకుని నరేంద్ర మోడీ ప్రభుత్వ విధానాలపై పోరాడాలి. ప్రతిఘటన ఉద్యమంలో విస్తృతమైన ప్రజానీకాన్ని భాగస్వాములను చేయాలి.

ఆంధ్రప్రదేశ్ - సిపిఎస్ రద్దు ఉద్యమం

ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదు. కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామనే హామీ ఇంకా అమలు కాలేదు. దీంతోపాటు అధికారంలోకి వచ్చిన వారంరోజుల్లో సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి ఓల్డ్ పెన్షన్ స్కీమ్‌ను అమలు చేస్తామని హామీనిచ్చారు. ఇప్పుడు సిపిఎస్ పరిధిలో 1,80,000 మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పోలీసులు ఉన్నారు. గత నాలుగేళ్లుగా అనేక ఉద్యమాలు, పోరాటాలు జరిగాయి. ఇటీవల రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాలు సిపిఎస్‌ను రద్దు చేస్తూ చారిత్రాత్మక నిర్ణయం చేశాయి. తమిళనాడు, కేరళ మొదలగు రాష్ట్రాలు కమిటీలు వేశాయి. సిపిఎస్ రద్దు కోరుతూ ఉద్యమం చేయడమంటే ప్రపంచ బ్యాంకు, ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించడమే. యుటిఎఫ్ సహా అనేక ఉపాధ్యాయ, ఉద్యోగ, సిపిఎస్ సంఘాలు కూడా సిపిఎస్‌ను రద్దు చేయాలని ఉద్యమిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సిపిఎస్‌ను రద్దు చేస్తూ రాజకీయ నిర్ణయం చేయాల్సిన బాధ్యత సిఎంపై ఉంది.

కర్తవ్యాలు

మేడే సందర్భంగా కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయ, పెన్షనర్లు అందరూ జరుగుతున్న పరిణామాలపై స్పందించి విశాల ఉద్యమాల్లో, ఐక్య పోరాటాల్లో పాల్గొనాల్సిన అవసరం ఉంది. కార్మికుల, ఉద్యోగుల హక్కులను హరించే చట్టాలకు వ్యతిరేకంగా జరిగే ఉద్యమాల్లో పాల్గొనాలి. దేశ స్వావలంబనకు దోహదపడిన పెద్ద పరిశ్రమలు, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించే విధానాలను ప్రతిఘటించాలి. మతతత్వాన్ని, మతోన్మాదాన్ని రెచ్చగొట్టి ప్రజలను, కార్మికులను చీల్చే విధంగా జరిగే ప్రయత్నాలను అర్థం చేసుకుని వాటిని వ్యతిరేకించాలి. కార్మిక, కర్షక, ఉద్యోగ వర్గాల ఐక్యత కోసం కృషి జరగాలి.













ఎన్నియ్యల్లో

ఖాయిలా పడ్డ
పరిశ్రమ వాకిలి ముందు
సర్రుమని దూసుకొచ్చి
కీచుమని ఆగిన నల్లద్దాల్లోంచి
చెమట పట్టని దేహాలు కొన్ని
తొంగి చూస్తున్నాయ్
చిరిగి రెపరెపలాడుతున్న
టెంటుకింద,
ఖాకీగుడ్డల గుంపు
నినాదాల ప్లకార్డుల నీడలో
నీరసంగా పడి ఉంది
రూపాయిల చీకటి
ఆవరించిన లోకంలో
చివరాఖరి ఆశలా
కంది పుల్లకి
తగులుకున్న
తువ్వాల ముక్క ఒకటి
ఎర్రెర్రగా ఎగురుతూ..ఉంది
పుల్ల లంకించుకున్న
పిలగాడు..చేలోంచి
గెనుంమీదకి , గెనుంమీదినుంచి
గట్టుమీదకి గట్టుమీది నుంచి
టెంటుపక్కకి లగెత్తాడు
ఒక అనాది స్వరం
పాట ఎక్కడినుంచో
ఇనపడతా ఉంది..
డప్పులకు కాపుచేద్దామని
చిదుగులు కూడేస్తున్న
మనుషులుకొందర్ని చూస్తూ
కార్లలోపలి చీకటి కనుమరుగవుతోంది...
పాట ఉరిమే కొద్దీ
ఆశ వానై కురుస్తున్నట్లుంది
ఎరజెండెరజెండెన్నియ్యలో
ఎర్రెర్రనిదీజెండెన్నియ్యలో..
పాట ఉరిమేకొద్దీ
ఆశ వానై కురుస్తున్నట్టుంది..
రేపెప్పటికైనా
ఎరుపే వేకువ అంటూ
చలవద్దాల్లో వచ్చిన చీకటి
జిల్లార్చుకుపోతా ఉంది..
మేడే
పిడికిలిలోకి
అన్నం పెట్టేవీ,
ఆయుధం పట్టేవీ,
యంత్రం నడిపేవీ
పాఠం చెప్పేవీ
అన్నీ.. వేళ్లన్నీ
బిగుస్తున్న దృశ్యం
శానా ధైర్యంగా ఉంది..

- కోసూరి రవికుమార్


తెలుగుదేశం పార్టీ
కార్మికుల మాట-నా బాట
బాపట్ల నియోజకవర్గంలో కార్మికుల కుటుంబాల సంక్షేమమే ధ్యేయంగా తెలుగుదేశం పార్టీ తరపున కృషి చేస్తున్నాను. దానికోసం మీ అవసరాలు, అధికార పార్టీ నుంచి వృత్తి పరంగా మీకు ఎదురయ్యే కష్టాలు తెలుసుకోవటం నా భాద్యత. "మీ మాట-నా బాట" కార్యక్రమం ద్వారా అన్నీ మాట్లాడుకుందాం మరియు మీ కోసం బాపట్ల తెలుగుదేశం కార్యాలయంలో ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాను.
రండి మన జీవితాలను,
బాపట్ల భవిష్యత్తును మార్చుకుందాం.
బాపట్ల నియోజకవర్గంలోని
కార్మిక సోదర సోదరీమణులకు
కార్మిక దినోత్సవ
శుభాకాంక్షలు
వేగేశన నరేంద్ర వర్మ
బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్
/vegesanaNarendravarma